# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 181 | హైదరాబాద్ | బుధవారం 07-01-2026 | పేజీలు : 12 | వెల : 1.00




11లో

బంగ్లాదేశ్ లో ఒకరోజు మూడు ఘోరాలు..
హిందువులపై ఆగని అకృత్యాలు

## కోనసీమలో ఓఎన్జీసీ గ్యాస్ బ్లోఅవుట్..
# ఇంకా అదుపులోకి రాని మంటలు



- కోనసీమ జిల్లా ఇరుసుమండలో ఓఎన్‌జీసీ బావి బ్లోఅవుట్
- రెండో రోజూ అదుపులోకి రాని మంటలు
- భద్రతా చర్యల్లో భాగంగా 500 కుటుంబాల తరలింపు
- సీఎం, డిప్యూటీ సీఎం పరిస్థితిని సమీక్షిస్తున్నారని తెలిపిన ఎంపీ

11లో



11లో

## యూపీలో వివిధ కారణాల వల్ల
# 2.8 కోట్ల ఓట్లు రద్దు

- 15.44 కోట్ల నుంచి ఎస్ఐఆర్ తర్వాత 12.56 కోట్లకు తగ్గిన ఓటర్లు
- శాశ్వత వలస, మరణాలు, ఒకటి కంటే ఎక్కువ చోట రిజిస్ట్రేషన్ల ఓటర్ల తొలగింపు
- అభ్యంతరాలు ఉంటే ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా సమర్పించవచ్చన్న అధికారులు

## నేపాల్ సరిహద్దుల్లో ఉద్రిక్తత..
# భారత్ అప్రమత్తం

- నేపాల్ లో మత ఘర్షణలు
- ఒక ప్రార్థనా స్థలంపై కొందరి దాడి
- పలు ప్రాంతాల్లో ఆందోళనకారుల నిరసన
- అప్రమత్తమైన భారత ప్రభుత్వం
- నేపాల్ సరిహద్దులు మూసివేత

11లో





11లో

## ఇక్కడే ఉంటా.. దమ్ముంటే
# వచ్చి నన్ను పట్టుకో..

- కొలంబియాపై దృష్టి సారించిన ట్రంప్.. పెట్రోకు తీవ్ర హెచ్చరిక
- నన్ను వచ్చి పట్టుకో.. నేను ఇక్కడే ఎదురుచూస్తున్నా అంటూ పెట్రో బహిరంగ సవాల్
- వెనిజువెలా అధ్యక్షుడు మదురో అరెస్ట్ తర్వాత వేడెక్కిన రాజకీయం

## మరోసారి ఆసుపత్రిలో అడ్మిట్ అయిన సోనియాగాంధీ

- దగ్గు, శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న సోనియా
- సర్ గంగారామ్ ఆసుపత్రిలో చేరిక
- సోనియా ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్న వైద్యులు



11లో

## కవితకు మద్దతుగా ఆమె ఇంటి వద్దకు
# భారీగా తరలివచ్చిన అభిమానులు



11లో

- బాల్కనీలో నిలబడి అందరికీ అభివాదం చేసిన కవిత
- కిందకు వచ్చి అందరినీ పలకరించిన వైనం
- మీరే నా బలం అంటూ కవిత భావోద్వేగం

## ఆ కిక్ కోసమే మనమందరం
# కలిసికట్టుగా పనిచేయాలి: సీఎం

- సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో ఎస్ఐపీబీ సమావేశం
- గత ప్రభుత్వంలో పోయిన బ్రాండ్ ఇమేజ్ ఇప్పుడు తిరిగి వచ్చిందన్న చంద్రబాబు
- టాటా, అదానీ, రిలయెన్స్ వంటి దిగ్గజ సంస్థలు ఏపీలో పెట్టుబడులు పెడుతున్నాయని వెల్లడి
- రూ.4500 కోట్ల ట్రూఅప్ ఛార్జీల భారాన్ని ప్రభుత్వమే భరించిందని వివరణ
- 2026లోనూ ఇదే ఉత్సాహంతో పనిచేయాలని అధికారులకు దిశానిర్దేశం

11లో



భారతశక్తి

# తెగని నీటి పంచాయితీలు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రెండు రాష్ట్రాలుగా విడిపోయి ఇప్పటికే పదేళ్లు దాటుతున్నా, నదీ జలాల వివాదాలు మాత్రం ఇంకా తీరని సమస్యగానే కొనసాగుతున్నాయి. రాష్ట్ర విభజన జరిగి మరో ఆరు నెలల్లో పన్నెండేళ్లు పూర్తవుతున్నా, నీటి పంచాయతీలు మాత్రం కొత్త కొత్త మలుపులు తిరుగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా గోదావరి , కృష్ణా నదీ జలాల విషయంలో ఆంధ్రప్రదేశ్? తెలంగాణ మధ్య పోరు తీవ్రంగా సాగుతోంది. ఈ వివాదాలు కేవలం సాంకేతిక అంశాలకే పరిమితం కాకుండా, రాజకీయ సెంటిమెంట్‌గా మారడంతో పరిష్కారం మరింత క్లిష్టంగా తయారైంది.రాష్ట్రం విడిపోయిన తర్వాత రెండు రాష్ట్రాలు కొత్త నీటి ప్రాజెక్టులపై దృష్టి పెట్టాయి. పెరుగుతున్న జనాభా, సాగునీటి అవసరాలు, తాగునీటి డిమాండ్, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అన్నీ కలిసి కొత్త ప్రాజెక్టుల నిర్మాణానికి దారితీస్తున్నాయి. అయితే కొత్త ప్రాజెక్టులు కట్టాలంటే నికర జలాలు ఎంత, మిగులు జలాలు ఎంత, సముద్రంలో వృథాగా కలిసే నీరు ఎంత అన్నది స్పష్టంగా తేలాల్సి ఉంది. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు కుదిరిన వాటా నిష్పత్తులను పక్కనపెట్టి తెలంగాణ తనకు ఎక్కువ వాటా కావాలని కోరుతుండగా, గతంలో నిర్ణయించిన విధంగానే నీటి పంపిణీ జరగాలని ఏపీ వాదిస్తోంది.ఏపీ వాదన ప్రకారం, దిగువ రాష్ట్రంగా ఉన్న కారణంగా సముద్రంలో కలిసే వృథా నీటిని వినియోగించుకునే హక్కు తమకుందని చెబుతోంది. అదే ఆధారంగా బనకచర్ల వంటి కొత్త ప్రాజెక్టులను నిర్మించాలని భావిస్తోంది. కానీ తెలంగాణ మాత్రం దీనిని పూర్తిగా తిరస్కరిస్తోంది. తమ రాష్ట్రంలో కూడా ప్రాజెక్టులు నిర్మిస్తే మిగులు నీరు ఎంత ఉందో తేలుతుందని, సముద్రంలో కలిసే నీటిలో కూడా తమ వాటా ఉందని తెలంగాణ అభిప్రాయం.కృష్ణా జలాల విషయానికి వస్తే విభజన తర్వాత ఏపీకి 66 శాతం, తెలంగాణకు 34 శాతం వాటా కేటాయించారు. అయితే తెలంగాణ దీనిని అంగీకరించకుండా 50-50 శాతం పంపిణీ కావాలని డిమాండ్ చేస్తోంది. మరోవైపు శ్రీశైలం , నాగార్జున సాగర్ వంటి ఉమ్మడి ప్రాజెక్టుల్లో నీటి వినియోగంపై స్పష్టమైన నియమాలు లేకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. శ్రీశైలంలో విద్యుత్ ఉత్పత్తి కోసం నీటిని ఎక్కువగా వినియోగించడం వల్ల ఏపీలో సాగునీటి అవసరాలు దెబ్బతింటున్నాయని ఆరోపణలు ఉన్నాయి.గోదావరి జలాల విషయంలో ఏపీకి 65 శాతం, తెలంగాణకు 35 శాతం వాటాలు నిర్ణయించారు. పోలవరం కారణంగా ముంపు ప్రాంతాలు పెరుగుతాయని తెలంగాణ అభ్యంతరం తెలుపుతుండగా, ఇది జాతీయ ప్రాజెక్ట్ అని కేంద్రం ( ద్వారా నిర్మాణం జరుగుతోందని ఏపీ సమాధానం ఇస్తోంది. బనకచర్ల ప్రాజెక్ట్‌ను నల్లమల సాగర్ గా పేరు మార్చి కొత్త డీపీఆర్ పంపినా, దానిపైనా అభ్యంతరాలు కొనసాగుతున్నాయి.ఈ వివాదాల మధ్య కోర్టు కేసులు, గ్రీన్ ట్రిబ్యునల్) స్టేలు కారణంగా ప్రాజెక్టులు నిలిచిపోతున్నాయి. అంచనా వ్యయాలు పెరుగుతుండగా, రైతులు నీటి హక్కులు కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. సెంట్రల్ వాటర్ కమిషన్ చైర్మన్ నేతృత్వంలో ఏర్పడిన ఈ కమిటీకి రెండు రాష్ట్రాల అధికారులు సభ్యులుగా ఉన్నారు. సాధారణంగా ఏపీ అంటే గులాబీ పార్టీకి నచ్చదు. అలా నచ్చితే ఆ పార్టీకి సెంటిమెంట్ వర్కౌట్ కాదు. అదే సమయంలో టిడిపి అన్న ఆ పార్టీకి పడదు. పడితే మళ్లీ తెలంగాణలో టిడిపి బతికేస్తుంది. అందుకే ఏపీతోపాటు టిడిపిని విపరీతంగా ద్వేషిస్తుంటారు గులాబీ నేతలు. ఈ అంశంపై నైనా మాట్లాడాలి అంటే అది ముందుగా చంద్రబాబు గురించి అయి ఉంటుంది. అంతలా అక్కడ విద్వేషం రెచ్చగొడితే గాని పని జరగదు. అటువంటి గులాబీ పార్టీ ఇప్పుడు చంద్రబాబు సర్కార్ చెప్పింది కరెక్ట్ అని చెబుతోంది. ఏపీ ప్రభుత్వం చెప్పినదానితో ఏకీభవిస్తోంది. తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు ఏపీ ప్రస్తావన వచ్చింది. చంద్రబాబు ప్రస్తావన తీసుకొచ్చారు సీఎం రేవంత్ రెడ్డి. రాయలసీమలో నిర్మించ తలపెట్టిన పోతిరెడ్డిపాడు ఎత్తిపోతల పథకాన్ని చంద్రబాబుతో మాట్లాడి తానే నిలుపుదల చేయించానని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. అయితే ఈ ప్రకటనపై మూడు పార్టీల నుంచి అభిప్రాయాలు వచ్చాయి. ముందుగా ఏపీ ప్రభుత్వం ఇది తప్పు అని.. రేవంత్ రెడ్డి చెప్పిన దాంట్లో నిజం లేదని తేల్చేసింది. గులాబీ పార్టీ సైతం ఏపీ ప్రభుత్వం చెప్పిందే నిజం అని పేరు చేసింది. కానీ ఏపీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రం తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తో చంద్రబాబు చీకటి ఒప్పందం అని ఆరోపిస్తోంది. అయితే ఇప్పుడు పోతిరెడ్డిపాడు ఎత్తిపోతల పథకం గురించి ప్రధానంగా చర్చ నడుస్తోంది.పోతిరెడ్డిపాడు ప్రాజెక్టుఅనేది శ్రీశైలం ప్రాజెక్టు నుంచి కృష్ణా నది వరద నీటిని తరలించేందుకు నిర్మించ తలపెట్టినది. రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాలోని ప్రాజెక్టులకు మళ్లించే ముఖ్యమైన నీటి నియంత్రణ వ్యవస్థ. అయితే జగన్మోహన్ రెడ్డి ఈ ప్రాజెక్టును ప్రతిపాదించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ ప్రాజెక్టును ప్రారంభించారు. కానీ ఈ ప్రాజెక్టుకు అవసరమైన ఏ అనుమతులు తీసుకోలేదు. దీంతో నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ తో పాటు కేంద్ర సంస్థల నుంచి అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. దీంతో 2020లోనే పోతిరెడ్డిపాడు ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులు నిలిచిపోయాయి. జగన్ ఈ ప్రాజెక్టు ప్రతిపాదన చేసిన సమయంలోనే తెలంగాణలో అధికార పార్టీగా ఉన్న బిఆర్ఎస్, విపక్షంలో ఉన్న కాంగ్రెస్ అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ అప్పటి కేంద్ర ప్రభుత్వానికి లేఖలు కూడా రాశాయి. అయితే కేవలం రాజకీయ ప్రయోజనాలకు.. తెలంగాణలో తన మిత్రుడు కేసీఆర్ కు లబ్ది చేకూర్చే విధంగా.. జగన్మోహన్ రెడ్డి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా, చిత్తశుద్ధి లేకుండా ఈ పథకాన్ని ప్రారంభించారని అప్పట్లో విమర్శలు వచ్చాయి.

# రాయలసీమకు ద్రోహం చేసిందెవరు..

కర్నూలు,భారత శక్తి జిల్లా ప్రతినిధి) జనవరి 6:

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా చేసిన ఒక్క ప్రకటన ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మంటలు రేపింది. "రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని నేనే చంద్రబాబుతో మాట్లాడి ఆపించాను" అని రేవంత్ చెప్పడమే ఆలస్యం.. ఏపీలో ప్రతిపక్ష వైసీపీ భగ్గుమంది. చంద్రబాబును 'రాయలసీమ ద్రోహి'గా చిత్రీకరిస్తూ ఆందోళనలకు దిగింది. అయితే, తెలంగాణ మాజీ మంత్రి హరీశ్ రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అసలు నిజాలను బయటపెట్టడంతో సీన్ రివర్స్ అయ్యింది. జగన్ హయాంలోనే ఈ ప్రాజెక్టు పనులు ఆగిపోయాయని ఆయన ఆధారాలతో సహా చూపించారు. ఈ పరస్పర విరుద్ధ ప్రకటనల నేపథ్యంలో అసలు రాయలసీమ ఎత్తిపోతలకు బ్రేకులు వేసింది ఎవరు? 2019-24 మధ్య ఏం జరిగింది? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ ను ఇరకాటంలో పెట్టే క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబుతో తనకు ఉన్న సాన్నిహిత్యాన్ని ప్రస్తావించారు. అక్రమ ప్రాజెక్టులను ఆపడంలో తాము సఫలమయ్యామని చెప్పే ప్రయత్నంలో రాయలసీమ ఎత్తిపోతల ప్రస్తావన తెచ్చారు. దీన్ని వైసీపీ అందిపుచ్చుకుంది. తెలంగాణ సీఎంకు తలొగ్గి చంద్రబాబు రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టారని, సీమ గొంతు కోశారని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. పలు జిల్లాల్లో నిరసనలకు దిగారు.వైసీపీ ఆరోపణలు ఇలా ఉంటే.. హరీశ్ రావు మాత్రం తన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ లో లెక్కలతో సహా వాస్తవాలను బయటపెట్టారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల కారణంగా జగన్ అధికారంలో ఉన్నప్పుడే ఈ ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయని ఆయన గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి ఇప్పుడు కొత్తగా ఆపించింది ఏమీ లేదని, అసలు అక్కడ పనులే జరగడం లేదని తేల్చి చెప్పారు. ఇది పరోక్షంగా జగన్ హయాంలో జరిగిన వైఫల్యాన్ని ఎత్తిచూపినట్లయింది.రాయలసీమ ఎత్తిపోతల పథకం ద్వారా పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని పెంచి, రోజుకు 3 టీఎంసీల నీటిని తరలించాలని జగన్ ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకోసం 2020లో జీవో 203ని విడుదల చేసింది. అయితే, దీనికి పర్యావరణ అనుమతులు లేవని తెలంగాణ ప్రభుత్వం అప్పట్లో ఎన్జీటీని ఆశ్రయించింది. విచారణ జరిపిన ఎన్జీటీ, పర్యావరణ అనుమతులు వచ్చే వరకు పనులు చేపట్టవద్దని స్టే ఇచ్చింది. జగన్ ప్రభుత్వం ఈ అనుమతులు సాధించడంలో విఫలమైంది. అంతేకాకుండా, ఎన్జీటీ ఆదేశాలను ధిక్కరించి పనులు చేశారన్న ఆరోపణలపై ఏపీ అధికారులకు కోర్టు ధికార నోటీసులు కూడా వచ్చాయి. ఫలితంగా, టెండర్లు పిలిచి కాంట్రాక్టర్ ను నియమించినా, క్షేత్రస్థాయిలో పనులు ముందుకు సాగలేదు. హరీశ్ రావు చెప్పిన పాయింట్ ఇదే. జగన్ హయాంలోనే చట్టపరమైన చిక్కులతో ప్రాజెక్టు స్తంభించిపోయింది. 2024లో జగన్ ఓడిపోయారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చారు. టీడీపీ వచ్చి ఏడాదిన్నరే అయింది. ఎన్జీటీ స్టే ఇంకా కొనసాగుతోంది. ఈ తరుణంలో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు చంద్రబాబును ఇబ్బందికర పరిస్థితిలోకి నెట్టాయి. ఒకపక్క తెలంగాణతో సత్సంబంధాలు కోరుకుంటున్న చంద్రబాబు, మరోపక్క రాయలసీమ సెంటిమెంట్ ను విస్మరించలేరు. రేవంత్ వ్యాఖ్యలపై టీడీపీ నేతలు స్పందిస్తూ.. "మేము ప్రాజెక్టు ఆపేస్తామని ఎక్కడా చెప్పలేదు, చట్టపరమైన అనుమతులు తెచ్చుకుని కడతాం" అని కౌంటర్ ఇస్తున్నారు. రేవంత్ రెడ్డి కేవలం తెలంగాణలో పొలిటికల్ మైలేజ్ కోసమే ఆ వ్యాఖ్యలు చేశారని టీడీపీ వాదన.వాస్తవాలను పరిశీలిస్తే.. ఇక్కడ ఎవరూ పూర్తిగా రైట్ కాదు. ప్రాజెక్టును ఆర్భాటంగా ప్రకటించినా, పర్యావరణ అనుమతులు సాధించడంలో జగన్ ప్రభుత్వం విఫలమైంది. చట్టపరంగా బలమైన అడుగులు వేయలేకపోవడం వల్లే ప్రాజెక్టు ఎన్జీటీ స్టేలో చిక్కుకుంది. కాబట్టి పనులు ఆగిపోవడానికి ప్రధాన కారణం జగన్ ప్రభుత్వ వైఫల్యమే. రేవంత్ రెడ్డి 'నేను చెప్తే బాబు ఆపారు' అని అంటుంటే.. చంద్రబాబు ప్రభుత్వం నుండి గట్టి కౌంటర్ రాకపోవడం సీమ ప్రజల్లో అనుమానాలకు తావిస్తోంది. కేసీఆర్ ను కార్నర్ చేయడానికి రేవంత్ వాడిన అస్త్రం.. పక్క రాష్ట్రంలో మంటలు రేపింది. అక్కడ పనులు జరగడం లేదని తెలిసీ, తానే ఆపించానని చెప్పుకోవడం పూర్తిగా రాజకీయ ఎత్తుగడ.అసలు విషయం ఏంటంటే.. ప్రస్తుతం రాయలసీమ ఎత్తిపోతల పనులు జరగడం లేదు. అవి జగన్ హయాంలోనే ఎన్జీటీ కేసుల వల్ల ఆగిపోయాయి. ఇప్పుడు కొత్తగా చంద్రబాబు ఆపిందేమీ లేదు, రేవంత్ ఆపించిందీ ఏమీ లేదు. కానీ, ఇద్దరు సీఎంల మధ్య ఉన్న దోస్తీని అడ్డం పెట్టుకుని వైసీపీ రాజకీయం చేస్తుంటే, గతాన్ని గుర్తు చేస్తూ హరీశ్ రావు వాస్తవాలను బయటపెట్టారు. అంతిమంగా రాజకీయ నాయకుల మాటల యుద్ధంలో రాయలసీమ నీటి హక్కులు పక్కదారి పడుతున్నాయన్నది చేదు నిజం.

# మళ్లీ రేసులోకి ధర్మాన

శ్రీకాకుళంభారత శక్తి జిల్లా ప్రతినిధి) జనవరి 6:

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యంత సీనియర్ రాజకీయ నాయకుల్లో ఒకరిగా ధర్మాన ప్రసాదరావు కు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఆయన రాజకీయ జీవితం దశాబ్దాల పాటు సాగింది. కాంగ్రెస్ పార్టీ లో దీర్ఘకాలం పనిచేసిన ఆయన, దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రోత్సాహంతో మరింత బలమైన నాయకుడిగా ఎదిగారు. 1989లో తొలిసారి శాసనసభలో అడుగుపెట్టిన ధర్మాన, అదే సమయంలో మంత్రి పదవిని కూడా దక్కించుకున్నారు. అప్పటి నుంచి కాంగ్రెస్‌లోనే కొనసాగుతూ 2014 వరకు కీలక బాధ్యతలు నిర్వహించారు.రాష్ట్ర విభజన తరువాత రాజకీయ పరిస్థితులు మారాయి. అనుకోని పరిణామాల మధ్య వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు ధర్మాన ప్రసాదరావు. కాంగ్రెస్‌లో ఉన్న సమయంలో జగన్మోహన్ రెడ్డి నాయకత్వాన్ని వ్యతిరేకించినా, తర్వాత అదే నేత ఆధ్వర్యంలో పని చేయాల్సి వచ్చింది. పార్టీ మారిన తర్వాత కూడా ఆయన రాజకీయ అనుభవం కారణంగా వైసీపీలో ప్రాధాన్యం దక్కింది. అయితే ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఓటమి తర్వాత ఆయన పార్టీ నుంచి బయటకు వస్తారన్న ప్రచారం సాగింది. దానికి అనుగుణంగా దాదాపు ఏడాది పాటు ఆయన రాజకీయంగా మౌనంగా ఉండిపోయారు. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు.ఇటీవల మాత్రం ధర్మాన మళ్లీ యాక్టివ్‌గా మారారు. ఈ మార్పు వెనుక కుమారుడి రాజకీయ భవిష్యత్తే ప్రధాన కారణమని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ఆయన కుమారుడు రామ్ మనోహర్ నాయుడు కు సరైన రాజకీయ అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ధర్మాన మళ్లీ రంగంలోకి దిగినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో జగన్మోహన్ రెడ్డి, ధర్మాన ప్రసాదరావుకు కీలక బాధ్యతలు అప్పగించేందుకు సిద్ధమవుతున్నారన్న వార్తలు చర్చనీయాంశంగా మారాయి.ఈ పరిణామాల మధ్య ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ( చేసిన వ్యాఖ్యలు రాజకీయ వేడిని పెంచాయి. ఆయన ధర్మాన సోదరులపై తీవ్ర ఆరోపణలు చేస్తూ, పార్టీని నాశనం చేస్తున్నారంటూ బహిరంగంగా విమర్శించారు. తన పరాజయాల వెనుక కొన్ని రాజకీయ కుటుంబాల పాత్ర ఉందని కూడా పేర్కొన్నారు. జగన్మోహన్ రెడ్డికి ఫిర్యాదు చేస్తూ, ధర్మాన కుటుంబాన్ని నమ్మవద్దని కోరిన సందర్భాలు ఉన్నాయి. అయితే



ఈ వ్యాఖ్యల అనంతరం దువ్వాడ శ్రీనివాస్ పార్టీ నుంచి సస్పెండ్ కావడం గమనార్హం.ఇప్పుడు అదే సమయంలో ధర్మాన ప్రసాదరావుకు మరింత ప్రాధాన్యం పెరగడం రాజకీయంగా ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లా లో ధర్మాన కుటుంబానికి ఉన్న పట్టు దృష్ట్యా, జగన్ వారి సేవలను వినియోగించుకోవాలని భావిస్తున్నారని సమాచారం. తాడేపల్లి కేంద్ర కార్యాలయం బాధ్యతలను ధర్మానకు అప్పగించే ఆలోచన కూడా ఉందని తెలుస్తోంది. ఇప్పటివరకు విజయసాయిరెడ్డి సజ్జల రామకృష్ణారెడ్డి (, వైవి సుబ్బారెడ్డి వంటి నేతలపై ఆధారపడిన జగన్, ఇకపై పార్టీ బలోపేతం కోసం సీనియర్ నాయకులను ముందుకు తెచ్చే వ్యూహం రచిస్తున్నట్లు కనిపిస్తోంది.ఈ పరిణామాలన్నీ దువ్వాడ శ్రీనివాస్ రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం చూపే అవకాశం ఉంది. జగన్మోహన్ రెడ్డి నిర్ణయాలు చూస్తే, ధర్మాన ప్రసాదరావుకు ఇచ్చే ప్రాధాన్యం ద్వారా పార్టీలో కొత్త సమీకరణాలు మొదలవుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# క్రెడిట్ వార్.....

విజయనగరం, భారత శక్తి జిల్లా ప్రతినిధి) జనవరి 6:

భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ అంశం ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ ఎయిర్‌పోర్ట్ క్రెడిట్ ఎవరికి దక్కాలనే విషయంపై టీడీపీ , వైసీపీ మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే ఈ ప్రాజెక్ట్ ఎక్కువగా ముందుకు వెళ్లిందని వైసీపీ నేతలు చెబుతున్నారు. అనుమతులు, కోర్టు వివాదాల పరిష్కారం, భూసేకరణ, శంకుస్థాపన అన్నీ తమ ప్రభుత్వ హయాంలోనే జరిగాయని వారు గుర్తు చేస్తున్నారు. దాదాపు 80 శాతం పనులు అప్పుడే పూర్తయ్యాయని వైసీపీ వాదన.దీనికి టీడీపీ తీవ్రంగా స్పందిస్తోంది. ఒకప్పుడు జగన్ విపక్ష నేతగా ఉన్న సమయంలో భోగాపురంలో ఎయిర్‌పోర్ట్ అవసరమా అని ప్రశ్నించిన వీడియోలను బయటకు తీసి, అదే మీ అభివృద్ధి దృష్టికోణమా అంటూ కౌంటర్లు వేస్తోంది. ఈ నేపథ్యంలో రాజకీయ వేడి పెరుగుతున్నప్పటికీ, ప్రాజెక్ట్ మాత్రం కీలక దశకు చేరుకుంది.ఇదిలా ఉండగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చేసిన వ్యాఖ్యలు ప్రాజెక్ట్‌కు కొత్త ఉత్సాహం ఇచ్చాయి. ఢిల్లీ నుంచి వాణిజ్య విమానంలో నేరుగా భోగాపురం ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్ అయి ట్రయల్ రన్ విజయవంతం కావడం గర్వకారణమని ఆయన తెలిపారు. ఎయిర్ ఇండియా (సహకారంతో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్‌లో తొలి విమానం దిగడం చారిత్రాత్మక ఘట్టమని అన్నారు. ఈ విమానాశ్రయానికి అల్లూరి సీతారామరాజు పేరు పెట్టడం కూడా విశేషమని పేర్కొన్నారు.భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు సంబంధించి అనుమతులు 2016లోనే అప్పటి సివిల్ ఏవియేషన్ మంత్రి అశోక్ గజపతి రాజు తెచ్చారని కేంద్ర మంత్రి గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత 18 నెలలుగా నిరంతర సమీక్షలతో పనులను వేగవంతం చేశామని చెప్పారు. డిసెంబర్ నాటికి పూర్తి చేయాల్సిన పనులను ఆరు నెలలు ముందుగానే పూర్తి చేస్తున్నామని వెల్లడించారు. ఎల్ అండ్ టీ , జీఎంఆర్, డీజీసీఏ ( అధికారులు కీలక పాత్ర పోషించారని తెలిపారు. భూములు ఇచ్చి సహకరించిన స్థానిక రైతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు

# మూడేళ్ల కోసం పక్కా వ్యూహాలు

విజయవాడ, భారత శక్తి జిల్లా ప్రతినిధి) జనవరి 6:

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి ప్రస్తుతం బెంగళూరులో ఉన్నప్పటికీ, ఆయన దృష్టి మొత్తం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల భవిష్యత్తుపైనే ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఒకవైపు పార్టీని మళ్లీ బలోపేతం చేయడం,




మరోవైపు అధికార కూటమి వేగాన్ని ఎదుర్కొని వైసీపీని రాజకీయంగా నిలబెట్టడం, అలాగే రాబోయే మూడేళ్లలో జరగనున్న ఎన్నికల కోసం పక్కా వ్యూహాలు రూపొందించడం వంటి అంశాలపై జగన్ సీరియస్‌గా ఆలోచిస్తున్నారని సమాచారం.కొత్త ఏడాది 2026 ప్రారంభమవడంతో జగన్ ప్రజల్లోకి రావడానికి సిద్ధమవుతున్నారని అంటున్నారు. సంక్రాంతి పండుగ తర్వాత జిల్లాల పర్యటనలకు ఆయన రంగం సిద్ధం చేస్తారని పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలను కవర్ చేస్తూ ఈ టూర్లు నిర్వహించాలన్నది జగన్ ఆలోచనగా చెబుతున్నారు. ఈ పర్యటనలు దాదాపు ఆరు నెలల పాటు నిరాటంకంగా కొనసాగుతాయని, ఈ సమయంలో పార్టీ పరిస్థితిని పూర్తిగా అంచనా వేయాలని ఆయన భావిస్తున్నారట.జిల్లాల పర్యటనల అనంతరం పార్టీలో కీలక మార్పులు చోటు చేసుకునే అవకాశముందని అంటున్నారు. గ్రౌండ్ లెవెల్ నుంచి వచ్చే నివేదికలు, నాయకులు మరియు కార్యకర్తల నుంచి నేరుగా అందే ఫీడ్‌బ్యాక్ ఆధారంగా నియోజకవర్గ స్థాయిలో మార్పులు చేస్తారని అంచనా. కొందరు నాయకులకు బాధ్యతలు మారవచ్చు, మరికొందరికి కొత్త అవకాశాలు కల్పించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.ఇదే సమయంలో జగన్ 2027లో మరోసారి భారీ పాదయాత్రకు సిద్ధమవుతున్నారన్న ప్రచారం కూడా బలంగా వినిపిస్తోంది. గతంలో 2017లో ప్రారంభమైన పాదయాత్ర 2019లో పార్టీకి ఘన విజయం తీసుకువచ్చిన విషయం తెలిసిందే. అదే సెంటిమెంట్‌ను కొనసాగించాలనే ఆలోచనతో 2027ను ఎంచుకున్నారని చెబుతున్నారు. అయితే ఈసారి నవంబర్‌లో కాకుండా ఫిబ్రవరి లేదా మార్చి నుంచే పాదయాత్ర ప్రారంభమయ్యే అవకాశం ఉందని సమాచారం.ఈసారి పాదయాత్ర మరింత భారీగా ఉండబోతోందని అంటున్నారు. సుమారు ఐదు వేల కిలోమీటర్ల లక్ష్యంతో జగన్ నడవాలని భావిస్తున్నారట. అందుకే 2029 ఎన్నికల నాటికి పాదయాత్ర పూర్తయ్యేలా ముందుగానే ప్రణాళిక సిద్ధం చేస్తున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ యాత్ర దాదాపు 24 నెలల పాటు కొనసాగే అవకాశమూ ఉందని అంచనా.అయితే గత పాదయాత్ర సమయంలో జగన్ తల్లి విజయమ్మ , చెల్లెలు షర్మిల పార్టీ వ్యవహారాలను చూసుకునేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. విజయమ్మ రాజకీయాలకు దూరంగా ఉండగా, షర్మిల కొత్త రాజకీయ దారిలో వెళ్లనున్నారనే ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో పార్టీకి నాయకత్వ స్థాయిలో ఒక లోటు కనిపిస్తోందని అంటున్నారు. అందుకే జగన్ కొత్త ఆలోచనలపై దృష్టి పెట్టారని సమాచారం. తన సతీమణి భారతిని రాజకీయాల్లోకి తీసుకురావాలనే ఆలోచన చేస్తున్నారని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. తాను పాదయాత్రలో బిజీగా ఉన్నా పార్టీని పర్యవేక్షించేందుకు ఆమె ఉపయోగపడుతుందని జగన్ భావిస్తున్నారట. ఆమెకు రాజకీయ అవగాహన కల్పించడానికి 2026 సరైన సమయమని, ఈ ఏడాదిలోనే ఆమె ఎంట్రీపై ప్రకటన వచ్చే అవకాశముందని అంటున్నారు. అయితే ఈ ప్రచారంలో ఎంతవరకు నిజం ఉందన్నది కాలమే తేల్చాల్సి ఉంది.

# అడ్డంగా బుక్కైన టీడీపీ నేత

తిరుపతి,భారత శక్తి జిల్లా (ప్రతినిధి) జనవరి 6:

రాజకీయ అధికారాన్ని అడ్డం పెట్టుకుని ప్రభుత్వ భూములను, మాజీ సైనికులకు కేటాయించిన స్థలాలను చెరబట్టారనే ఆరోపణలు అన్నమయ్య జిల్లా రాజకీయాల్లో ఇప్పుడు పెను ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. మదనపల్లె టీడీపీ మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్‌పై వచ్చిన భూ ఆక్రమణ ఆరోపణలపై లోకాయుక్త సీరియస్ అయ్యింది. పేదలకు, సైనికులకు చెందాల్సిన భూములను నకిలీ పత్రాలతో కాజేసిన వైనంపై కలెక్టర్ నివేదిక ఇవ్వడంతో ఈ వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది.మదనపల్లె నియోజకవర్గం పరిధిలోని బి.కె.పల్లి గ్రామంలో సర్వే నంబర్ 8/1లో ఉన్న సుమారు మూడు ఎకరాల భూమి చుట్టూ ఈ వివాదం ముడిపడి ఉంది. ఇది ప్రభుత్వ రికార్డుల ప్రకారం 'చెరువు పోరంబోకు' భూమి. దీనిని గతంలో దేశం కోసం పోరాడిన మాజీ సైనికులకు ప్రభుత్వం కేటాయించింది. అయితే, 2016లో దొమ్మలపాటి రమేష్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తన రాజకీయ పలుకుబడిని ఉపయోగించి ఈ భూమిని కబ్జా చేశారనేది ప్రధాన ఆరోపణసుమారు 2.92 ఎకరాల ఈ విలువైన భూమిని నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి, మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్, ఆయన భార్య సరళ పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. కోట్లాది రూపాయల విలువ చేసే ఈ ప్రభుత్వ భూమిని ప్రైవేట్ ఆస్తిగా మార్చుకునే క్రమంలో రెవెన్యూ చట్టాలను, నిబంధనలను తుంగలో తొక్కినట్లు అధికారుల విచారణలో తేలింది. ఈ భూ కుంభకోణంలో కేవలం రాజకీయ నాయకులే కాదు, బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న రెవెన్యూ అధికారులు కూడా కీలక పాత్ర పోషించడం విస్మయం కలిగిస్తోంది. అప్పటి తహశీల్దార్ శివరామిరెడ్డి, ఆర్ఐ, విఆర్ఓ లు ఎమ్మెల్యేతో కుమ్మక్కై రికార్డులను తారుమారు చేశారు.మరీ ముఖ్యంగా, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు రోజైన ఆదివారం తహశీల్దార్ కార్యాలయం తెరిచి మరీ రికార్డులను మార్చినట్లు విచారణలో బయటపడింది. ఆన్‌లైన్ రికార్డుల్లో పేర్లు మార్చడం, నకిలీ పట్టాలు సృష్టించడం వంటివి అత్యంత పథకం ప్రకారం జరిగాయి. సాక్షాత్తు జిల్లా కలెక్టర్ ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో ఈ విషయాన్ని స్పష్టంగా పేర్కొనడం గమనార్హం.



మాజీ ఎమ్మెల్యే ఒత్తిడికి తలొగ్గి, నిబంధనలకు విరుద్ధంగా అధికారులు సహకరించారని కలెక్టర్ నివేదిక నిర్ధారించింది. ఈ అక్రమాలపై దాఖలైన ఫిర్యాదును విచారించిన లోకాయుక్త న్యాయస్థానం తీవ్రంగా స్పందించింది. మాజీ సైనికులకు ఇవ్వాల్సిన భూమిని కబ్జా చేయడం, చెరువు పోరంబోకు భూమిని ఆక్రమించడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. కలెక్టర్ నివేదిక ఆధారంగా తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. దీంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. ఈ అక్రమాలకు సహకరించిన ఐదుగురు ప్రభుత్వ అధికారులపై క్రమశిక్షణా చర్యలకు ఆదేశాలు జారీ చేసింది. అంతేకాకుండా, ఆంధ్రప్రదేశ్ భూ ఆక్రమణ చట్టం కింద బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని స్పష్టం చేసింది.మదనపల్లెలో ఇటీవల సబ్-కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దగ్ధం ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఆ ఘటన మరువకముందే, ఇప్పుడు మాజీ ఎమ్మెల్యేపై భూ కబ్జా ఆరోపణలు రుజువు కావడం, లోకాయుక్త జోక్యం చేసుకోవడం దొమ్మలపాటి రమేష్ రాజకీయ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసే అవకాశం ఉంది.సాధారణంగా రాజకీయ ఆరోపణలు వేరు, సాంకేతిక ఆధారాలతో కూడిన అధికారుల నివేదికలు వేరు. ఇక్కడ కలెక్టర్ స్వయంగా విచారణ జరిపి, రికార్డుల తారుమారుని నిర్ధారించడం మాజీ ఎమ్మెల్యేకు పెద్ద ఎదురుదెబ్బే. రాబోయే రోజుల్లో ఈ కేసు విచారణ ఎలా సాగుతుంది? క్రిమినల్ కేసుల నమోదు తర్వాత అరెస్టుల వరకూ వెళ్తుందా? అన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. ఏది ఏమైనా, కంచే చేను మేసిన చందంగా రక్షించాల్సిన ప్రజాప్రతినిధులే భక్షకులుగా మారారన్న విమర్శలకు ఈ ఘటన బలం చేకూరుస్తోంది.

# మారుతున్న సమీకరణాలు

విశాఖపట్టణం, భారత శక్తి జిల్లా (ప్రతినిధి) జనవరి 6:

ఉత్తరాంధ్రలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వచ్చింది. ఎయిర్పోర్ట్లో ట్రయల్ రన్ కూడా పూర్తయింది. జూన్ లో విమానాశ్రయాన్ని ప్రారంభించి.. జూలై నుంచి విమాన రాకపోకలు మొదలయ్యేలా చూడనున్నారు. ఎయిర్పోర్ట్ తో ఉత్తరాంధ్ర స్వరూపమే మారనుంది. అయితే ఇప్పుడు ఏపీలోనే భోగాపురం నియోజకవర్గం ఎంతో ప్రాధాన్యత కలిగిన రాజకీయ ప్రాంతం. అందుకే అక్కడ పట్టు కోసం అన్ని రాజకీయ పార్టీలు ప్రయత్నాలు చేస్తాయి. ప్రస్తుతం ఇక్కడ జనసేన ఎమ్మెల్యే లోకం మాధవి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే వచ్చే ఎన్నికల్లో ఈ స్థానం టిడిపి తీసుకుంటుందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. భోగాపురం లాంటి ప్రాంతంలో అధికార పార్టీ ముద్రగా చూపాలన్నది టిడిపి నుంచి వస్తున్న అభిప్రాయం. పైగా ఈ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీకి క్షేత్రస్థాయిలో పట్టున్న ప్రాంతం. అందుకే వచ్చే ఎన్నికల్లో జనసేనను తప్పించి.. తిరిగి టిడిపికి ఈ స్థానం కేటాయిస్తారని ప్రచారం జరుగుతోంది.భోగాపురం ఎయిర్పోర్ట్ కు అనుబంధంగా పర్యాటక ప్రాజెక్టులు సైతం రానున్నాయి. ఇందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం 500 ఎకరాల భూమిని రిజర్వు కూడా చేసింది. మొన్నటి ఎన్నికల్లో నెల్లిమర్ల నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయించారు. అయితే ఇక్కడ తెలుగుదేశం పార్టీ బలంగా ఉంది. కానీ రాష్ట్రస్థాయిలో కుదిరిన పొత్తుల వల్ల ఈ స్థానాన్ని జనసేనకు కేటాయించాల్సి వచ్చింది. అయితే భోగాపురం ఎయిర్పోర్ట్ తో ఉత్తరాంధ్ర కేంద్రంగా ఈ నియోజకవర్గం మారనుంది. అందుకే ఎంత మాత్రం ఈ నియోజకవర్గాన్ని వదిలి పెట్టేందుకు తెలుగుదేశం పార్టీ అంగీకరించదన్న టాక్ నడుస్తోంది. పైగా జనసేన ఎమ్మెల్యే పై అనేక రకాల ఆరోపణలు వస్తున్నాయి. కూటమి శ్రేణులను సమన్వయం చేసుకోలేకపోతున్నారన్న విమర్శ ఉంది. పైగా ఇక్కడ తెలుగుదేశం పార్టీ బలంగా ఉండడం.. జనసేన ఎమ్మెల్యే పట్టించుకోకపోవడంతో ఒక రకమైన గందరగోళం ఉంది. అందుకే ఈ నియోజకవర్గాన్ని టిడిపికి విడిచిపెట్టి.. మరో నియోజకవర్గాన్ని జనసేన ఎంచుకుంటుందన్న టాక్ కూడా నడుస్తోంది.మరోవైపు వచ్చే ఎన్నికల్లో ఇక్కడ నుంచి టిడిపి అభ్యర్థిగా అశోక్ గజపతిరాజు కుమార్తె అదితి గజపతిరాజు పోటీ చేస్తారన్న ప్రచారం కూడా ఉంది. విజయనగరం అసెంబ్లీ స్థానాన్ని జనసేనకు విడిచిపెడతారని.. ఇక్కడ మాత్రం టిడిపి తీసుకుంటుందన్న టాక్ నడుస్తోంది. జనసేనకు ఇప్పటికే పాలవలస యశస్విని అనే మహిళ నేత నాయకురాలిగా ఉన్నారు. మొన్నటి ఎన్నికల్లో విజయనగరం అసెంబ్లీ టికెట్ ఆశించారు. అయితే కూటమి అధికారంలోకి రావడంతో ఆమె తూర్పు కాపు కార్పొరేషన్ చైర్ పర్సన్ పదవి వరించింది. అయితే ఈసారి తూర్పు కాపు సామాజిక వర్గానికి విజయనగరంలో ప్రాధాన్యం ఇవ్వాలని చూస్తోంది కూటమి. ఎందుకంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ.. తూర్పు కాపు సామాజిక వర్గాన్ని తెరపైకి తెస్తోంది. అందుకు ధీటుగా కూటమి జనసేనకు టికెట్ ఇచ్చి.. తూర్పు కాపు సామాజిక వర్గానికి చెందిన యశస్వినికి అవకాశం ఇస్తారని తెగ ప్రచారం జరుగుతుంది. అయితే నెల్లిమర్ల వెళ్లేందుకు అదితి గజపతిరాజు ఒప్పుకుంటారా? ఈ ప్రచారంలో నిజం ఎంత ఉంది? అనేది త్వరలో తెలుస్తుంది.

# ఓవర్ గ్రౌండ్ వర్కర్లను లేపేస్తున్న అజ్ఞాత సాయుధులు

న్యూఢిల్లీ, భారత శక్తి జిల్లా (ప్రతినిధి) జనవరి 6:

ఉగ్రవాద వ్యతిరేక పోరాటంలో భద్రతా సంస్థలు యోజనాత్మక మలుపు తిరిగాయి. మొదటి పంజా ఉగ్రవాదులపై ఉండగా, ఇప్పుడు వారి మద్దతు వ్యవస్థపై కేంద్రీకరిస్తున్నాయి. ఇది దీర్ఘకాలిక విజయానికి మార్గం సుగమం చేస్తోంది.పాకిస్తాన్‌లోని ఉగ్రవాద నాయకులు కేవలం ఆదేశాలు ఇవ్వడంతో ఆగరు.. రిక్రూట్‌మెంట్, శిక్షణ, ఆయుధ సరఫరా చేస్తారు. అయతే భారత్‌లోకి ఉగ్రవాదులను చొరవడానికి ఓవర్‌గ్రౌండ్ వర్కర్లు కీలకం. కశ్మీర్‌లో హ్రాస్ లాంటి ప్రాంతాల్లో ఉండి లాజిస్టిక్స్ సామగ్రి అందించే వ్యక్తులు గుర్తించారు. ఈ వ్యక్తులు సామాన్యంగా కనిపించి, ఉద్యోగాలు చేస్తూ సురక్షిత ఆవాసాలు, తప్పించుకునే మార్గాలు, నకిలీ డాక్యుమెంట్లు సిద్ధం చేస్తారు.బాలాకోట్, పఠాంకోట్, ఉరి, సర్జికల్ స్ట్రైక్‌లు ఉగ్రవాదులను అంతం చేశాయి కానీ సమస్య మొత్తం తీరలేదు. 2014 నుంచి దృష్టి మారి, ఓవర్‌గ్రౌండ్ నెట్‌వర్క్‌ను లక్ష్యంగా చేసుకున్నారు. ఉదాహరణగా, పుల్వామా దాడి తర్వాత జైష్?ఇ?మొహమ్మద్‌కు మద్దతు ఇచ్చిన 20 మంది వర్కర్లను అరెస్ట్ చేశారు. ఇది నాయకులు?ఉగ్రవాదుల మధ్య కనెక్షన్‌ను బలహీనపరుస్తోంది, దాడులు తగ్గుతున్నాయి. వీరు డబ్బు, ఆయుధాలు స్మగ్లింగ్, చొరబాటు దారులు పరిచయం చేస్తారు. నమస్యల నమయంలో తప్పించుకునే ప్రణాళికలు రూపొందిస్తారు. ఉదాహరణకు, లష్కర్?ఇ?తొయబా నెట్‌వర్క్‌లో భాగమైన ఒక వ్యక్తి ఆయుధాలు దాచి, ఉగ్రవాదులకు ఆహారం అందించాడు. వారి విస్తృత నెట్‌వర్క్ ఉగ్రవాదానికి బలమైన మూలాలు అందిస్తుంది. ఈ లింక్‌లను ధ్వంసం చేస్తే మొత్తం వ్యవస్థ కుప్పకూలుతుంది. ఎల్ఓసీ రెండు వైపులా గుర్తింపు పెరిగింది. బలూచిస్తాన్‌కు చెందిన బిలాల్ సద్దామ్ హుస్సేన్ వంటి వ్యక్తి లాజిస్టిక్స్, ప్రణాళికలు, భయాందోళనలకు కారణమయ్యాడు. అజ్ఞాత సాయుధులు అతన్ని అంతం చేశారు. మరో ఉదాహరణగా, రీసెంట్‌గా జమ్మూ ప్రాంతంలో ఒక ఓజీ డ్రోన్‌ల ద్వారా ఆయుధాలు సరఫరా చేస్తున్నట్టు గుర్తించి లేపారు. పాకిస్తాన్ దీన్ని పట్టించుకోకపోయినా, ఇది వ్యూహ విజయాన్ని సూచిస్తోంది. ఓవర్‌గ్రౌండ్ వర్కర్లపై దాడులు ఉగ్రవాదాన్ని మూలాల వద్ద నియంత్రిస్తాయి. ఇది భద్రతా దళాల సామర్థ్యాన్ని పెంచుతూ, దాడులు తగ్గిస్తుంది. దీర్ఘకాలంలో ఇది ప్రాంతీయ స్థిరత్వానికి దోహదపడుతుంది

# బస్సు డ్రైవర్...
# దేశాధ్యక్షుడు ఎలా అయ్యారు..

న్యూఢిల్లీ,భారత శక్తి జిల్లా (ప్రతినిధి) జనవరి 6:

వెనిజుల అధ్యక్షుడిని అమెరికా అరెస్ట్ చేసింది. ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. అదే కాదు, మదురో ను అరెస్ట్ చేసిన ఫోటోలను ఆయన సోషల్ మీడియాలో పంచుకున్నారు. అమెరికా సైన్యం విజయవంతమైన పని చేస్తుందని అందులో రాసుకొచ్చారు. మదురో ను అరెస్టు చేసి జైలుకు తీసుకెళ్తున్న ఫోటోలు ట్రంప్ పోస్ట్ చేయడంతో సోషల్ మీడియాలో విస్తృతమైన చర్చకు దారితీస్తోంది.మదురో అరెస్ట్ తర్వాత వెనిజులా ప్రాంతంలో ఒక్కసారిగా పరిణామాలు మారిపోయాయి. ఈ క్రమంలో ఆ ప్రాంతంలో అమెరికా ఏం చేస్తుంది? తనకు నచ్చిన వ్యక్తులతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయిస్తుందా? ఉన్న ప్రభుత్వాన్ని తన చెప్పు చేతల్లో పెట్టుకొని.. తోలుబొమ్మ లాగా ఆడిస్తుందా.. ఈ ప్రశ్నలకు మరి కొద్ది రోజుల్లోనే సమాధానాలు లభిస్తాయి.మదురో ను అరెస్ట్ చేసిన తర్వాత అమెరికా సంబరాలు చేసుకుంటున్నది. వాస్తవానికి మదురో ఓవర్ నైట్ లో వెనిజులా దేశానికి అధ్యక్షుడు కాలేదు. అతడు చిన్న స్థాయి నుంచి తన జీవితాన్ని మొదలుపెట్టాడు. ఒక బస్సు డ్రైవర్ గా జీవితాన్ని ప్రారంభించాడు. ఆ తర్వాత రాజకీయాలలోకి వచ్చాడు. క్రమ క్రమంగా ఎదిగాడు. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన ఆయన.. వెనిజులా అధిపతి హ్యూగో చావేజ్ కు ప్రధాన అనుచరుడిగా మారిపోయారు. ఆ తర్వాత రాజకీయాలలో ఎదిగారు.చావెజ్ కన్ను మూసిన తర్వాత 2013లో వెనిజులా దేశానికి అధ్యక్షుడయ్యారు. అయితే ఆ దేశాన్ని ఆర్థిక సంక్షోభం చుట్టుముట్టింది. ఇదే క్రమంలో మదురో మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడ్డారని ఆరోపణలు వచ్చాయి. అమెరికాకు అక్రమంగా మాదక ద్రవ్యాలను సరఫరా చేస్తున్నారని విమర్శలు వినిపించాయి. చివరికి అమెరికా మాదక ద్రవ్యాలను సాకుగా చూపించి.. వెనిజులా మీద దాడి చేసింది. మదురో ను అరెస్ట్ చేసింది.మదురో మొదటి నుంచి కూడా స్వయం ప్రతిపత్తి కల నాయకుడు. అనేక సందర్భాలలో అమెరికా ఆధిపత్యాన్ని ప్రశ్నించాడు. ఇది సహజంగానే అమెరికాకు కడుపు మంటగా మారిపోయింది. దీంతో సమయం కోసం ఎదురుచూసిన ఆ దేశం. మదురో కు చెక్ పెట్టింది. అనేక విషయాలలో ఆయనకు అడ్డు తగిలింది. చివరికి దేశం మీద దాడి చేసి.. సైన్యాన్ని మోహరించి.. అరెస్టు చేయించింది. మదురో ను అరెస్ట్ చేసిన తర్వాత.. అతడిని అమెరికా తన అదుపులో ఉంచుకుంటుంది. ఎన్నో రకాలుగా ఇబ్బంది పెట్టిన తర్వాతనే బయటికి విడుదల చేస్తుందని అంతర్జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఒకవేళ విడుదల చేసినా.. సొంత దేశంలో అతడిని అనేక రకాలుగా ఇబ్బంది పెట్టి.. కాలగర్భంలో కలిపేలా చేస్తుందని విశ్లేషకులు చెబుతున్నారు.

దక్షిణ మధ్య రైల్వే

Tender No.GTL-EM-69-2025-26 Date : 02.01.2026

టెండర్ నెం. : GTL-EM-69-2025-26 పని పేరు : DTTC/GTL స్కూల్ - ఎలక్ట్రికల్ ... అంచనా వ్యయం : ₹1,41,738/-

ముగింపు తేదీ , సమయం : 28.01.2026 మధ్యాహ్నం 3.00 గంటలకు.

http://www.ireps.gov.in

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/ ... /గుంతకల్

No.: G/E.29/Tr/Tenders/2025-26 Date : 02.01.2026

టెండర్ నెం. : GTL-TRD-29-eTN-69-2025-26 ... GDR-TPTY-KPD ... HX-RU ... CHED ... అంచనా వ్యయం : 1,81,40,500.00 ఈఎండి : 2,40,700.00

ముగింపు తేదీ , సమయం : 27.01.2026 మధ్యాహ్నం 3.00 గంటలకు.

Notice Inviting e-Tender (through https://www.ireps.gov.in)

... 2025-26 తేదీ : 02.01.2026

... WD-SC & SC-KZY ... CSR ... 1,84,24,866.48 ... 120 ... 29.01.2026 మధ్యాహ్నం 3.00 గంటలకు.

No.G/DS/76/Tender Notice/ AUX MOTORS/2025, Date :18.12.2025

GY/DSL/CB/2025/AUX MOTORS

... 12.01.2026 మధ్యాహ్నం 12.00 గంటలకు ...

టెండర్ నోటీసు

... C_SG_36_685 ... (VKB-PRLI) ... IRSGCC2022 ...

E-Tender Notice No.: 01-2026 Date : 02.01.2026

ముగింపు తేదీ , సమయం : 30.01.2026 మధ్యాహ్నం 3.00 గంటలకు.

క్రమ సంఖ్య :1 టెండర్ నెం. Engg-GTL-Central-2001 ... (ప్రత్యేకంగా 10x10 పిండి...) అంచనా వ్యయం : రూ. 1,56,99,785.66 ఈఎండి: రూ.2,29,500.00

క్రమ సంఖ్య :2 టెండర్ నెం. Engg-GTL-Central-2002 ... GTL-DHNE ... GTL-MKR ... km 354/7-8 ... Br.No.13-A ... అంచనా వ్యయం : రూ. 3,24,50,152.74 ఈఎండి: రూ.3,12,300.00

క్రమ సంఖ్య :3 టెండర్ నెం. Engg-GTL-South-2003 ... GDR-RU ... km 53/29-31 ... Br.No.63A (RUB) (LC23) ... అంచనా వ్యయం : రూ. 5,40,97,105.57 ఈఎండి: రూ.4,20,500.00

క్రమ సంఖ్య :4 టెండర్ నెం. Engg-GTL-South-2004 ... SW I : GDR-RU ... km 63/5-7 ... Br.No.85A (RUB) (LC29) ... SW II : GDR-RU ... km 64/13-14 ... Br.No.90A (RUB) (LC30) ... అంచనా వ్యయం : రూ. 8,84,14,819.61 ఈఎండి: రూ.5,87,100.00

క్రమ సంఖ్య :5 టెండర్ నెం. Engg-GTL-South-2005 ... SW I : GDR-RU ... km 28/29-31 ... Br.No.28A1 (RUB) (LC08) ... SW II : GDR-RU ... km 69/28-30 ... Br.No.95A (RUB) (LC35) ... అంచనా వ్యయం : రూ. 7,48,87,936.86 ఈఎండి: రూ.5,24,300.00

క్రమ సంఖ్య :6 టెండర్ నెం. Engg-GTL-Central-2006 ... 24 ... TTE ... అంచనా వ్యయం : రూ. 1,98,99,582.60 ఈఎండి: రూ.2,49,500.00

క్రమ సంఖ్య :7 టెండర్ నెం. Engg-GTL-West-2007 ... 30 ... TTE ... అంచనా వ్యయం : రూ. 1,62,06,487.41 ఈఎండి: రూ.2,41,000.00

... 02.01.2026

డివిజనల్ రైల్వే మేనేజర్ ... గుంతకల్

A2179

https://www.ireps.gov.in

www.scr.indianrailways.gov.in

# రేవంత్ చాణుక్య రాజకీయం

హైదరాబాద్, భారత శక్తి జిల్లా (ప్రతినిధి) జనవరి 6:

రాజకీయాలలో ఉన్న వారంతా వ్యూహాలు రచిస్తుంటారు. అందులో కొంతమంది వ్యూహాలు మాత్రమే సఫలీకృతం అవుతుంటాయి. తెలంగాణ రాజకీయాలలో వ్యూహాలు రచించి.. పరిణామాలను తనకు అనుకూలంగా మార్చుకోవడంలో మొదటి నుంచి కూడా కేసీఆర్ అగ్రస్థానంలో ఉండేవారు. 2014 నుంచి 2018 వరకు ఆయన వ్యూహాలు తెలంగాణలో విజయవంతం అయ్యాయి. ఎప్పుడైతే రెండు ఉప ఎన్నికలలో ఓటమి.. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఊహించని ఫలితాలు రావడంతో.. కెసిఆర్ కు బ్యాడ్ టైం మొదలైంది. కెసిఆర్ అధికారంలో ఉన్నప్పుడు మీడియాను తన అదుపులో ఉంచుకునేవారని.. భయభ్రాంతులకు గురి చేసేవారని ఆరోపణలు వినిపించేది. ఇప్పుడు కెసిఆర్ అధికారానికి దూరం కావడంతో.. కేవలం గులాబీ మీడియా మాత్రమే ఆయన దండకం చదువుతోంది. ఇక మిగతా మీడియా పెద్దగా పట్టించుకోవడం లేదు.ప్రస్తుతం తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి కొనసాగుతున్నారు. ఆర్థికంగా బలమైన, రాజకీయంగా శక్తివంతుడైన కేసీఆర్ ను ఎదిరించి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. అంతేకాదు, కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడంలో విజయవంతం అయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ మూడోవంతు స్థానాలను గెలుచుకోవడంలో రేవంత్ రెడ్డి సఫలీకృతులయ్యారు. ఇదే ఊపులో పురపాలకం, నగర పాలక ఎన్నికలు నిర్వహించబోతున్నారు. ఇప్పటికే ఓటర్ల జాబితాను సిద్ధం చేస్తున్నారు.. గులాబీ మీడియా, గులాబీ పార్టీ అనుకూల సోషల్ మీడియా ప్రతిరోజు బురద చిమ్ముతున్నప్పటికీ.. ఇష్టానుసారంగా విష ప్రచారం చేస్తున్నప్పటికీ రేవంత్ రెడ్డి ఏమాత్రం వెనుకడుగు వేయడం లేదు. పైగా తనకు ఎదురవుతున్న ప్రతిబంధకాల నుంచి విజయ పాఠాలు నేర్చుకుంటున్నారు.ఇటీవల నూతన సంవత్సరం సందర్భంగా రేవంత్ రెడ్డి ఆంధ్రజ్యోతి ఎండి రాధాకృష్ణ స్వగృహానికి వెళ్లారు.



ఆయనతో చాలాసేపు మాట్లాడారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. వాస్తవానికి ఒక ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ రెడ్డి అక్కడికి వెళ్లడం చాలామందికి ఆశ్చర్యాన్ని కలిగించింది. అయితే రాజకీయంగా వ్యూహాలను అమలు చేయడంలో రేవంత్ రెడ్డి కాస్త విభిన్నమైన శైలి. ముఖ్యంగా మీడియాతో అనుకూలంగా ఉండడం.. మీడియా పెద్దల సలహాలు తీసుకోవడంలో రేవంత్ రెడ్డి ఎప్పటికీ ముందు వరుసలో ఉంటారు. పిసిసి అధ్యక్షుడు అయిన తర్వాత ఆయన ఎన్టీవీ, టీవీ5, ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయాలకు వెళ్లారు. తనకు సపోర్ట్ ఇవ్వాలని కోరారు. ఆ చానల్స్ యాజమాన్యాలతో నేరుగా భేటీ అయ్యారు.. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావలసిన ఆవశ్యకతను వారికి చెప్పారు. వారి దగ్గర నుంచి సలహాలు కూడా స్వీకరించారు. వాటిని రేవంత్ రెడ్డి అమల్లోపెట్టి అధికారంలోకి వచ్చారు.అధికారంలోకి వచ్చిన తర్వాత రేవంత్ రెడ్డి ఆ మీడియా సంస్థలను దూరం పెట్టలేదు. అలాగని తనకు భజన చేసుకునే మాధ్యమాలుగా మార్చుకోలేదు. ప్రభుత్వపరంగా తాను వేగంగా పరిపాలన సాగిస్తూనే.. మీడియా పరంగా ఆ చానల్స్ యాజమాన్యాల సపోర్ట్ కోరారు. తద్వారా యాజమాన్యాలు కూడా రేవంత్ కు సుముఖంగా మారిపోయాయి. ఫలితంగా రేవంత్ చాణక్యం ఫలవంతమై.. తెలంగాణ రాష్ట్ర రాజకీయాలలో సరికొత్త శకాన్ని ఆవిష్కరిస్తుంది. వాస్తవానికి కాంగ్రెస్ పార్టీపై ఏమాత్రం ప్రజలకు నమ్మకం లేని స్థితిలో.. రేవంత్ రెడ్డి పార్టీ పగ్గాలు అందుకున్నారు. సీనియర్ విమర్శలు చేస్తున్నప్పటికీ.. కుర వృద్ధులు అడ్డగోలుగా మాట్లాడుతున్నప్పటికీ.. కెసిఆర్ అడ్డు పుల్లలు వేస్తున్నప్పటికీ.. వాటన్నింటిని తట్టుకొని రేవంత్ రెడ్డి ఇక్కడ దాకా వచ్చారు. రాజకీయాలలో చాణక్యాన్ని ఎలా ప్రదర్శించాలో నిరూపించి చూపిస్తున్నారు. ఇదే సమయంలో తాను వేస్తున్న ఉచ్చుల్లో గులాబీ పార్టీ నాయకులు పడి గిలగిల కొట్టుకుంటున్నారు. ఒకప్పుడు ఈ పరిస్థితి కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఉండేది. ఇప్పుడు రేవంత్ రెడ్డి వల్ల కాంగ్రెస్ పార్టీ అప్పర్ హ్యాండ్ ప్రదర్శిస్తోంది.. కాకపోతే అధికారంలోకి ఉన్నామని రేవంత్ రెడ్డి తల బిరుసుతనాన్ని ప్రదర్శించడం లేదు. కేవలం ప్రజలు ఇచ్చిన అవకాశం లాగానే దీన్ని చూస్తున్నారు. అందువల్లే గులాబీ పార్టీ నేతలు ఏ స్థాయిలో ఆరోపణలు చేసినప్పటికీ.. రేవంత్ రెడ్డికి వ్యతిరేక ఫలితం రావడం లేదు. వ్యతిరేక స్వరం వినిపించడం లేదు.

# కవితమ్మ శపథం

హైదరాబాద్, భారత శక్తి జిల్లా (ప్రతినిధి) జనవరి 6:

తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. గులాబీ కోటలో ముసలం పుట్టిందన్న వార్తలకు బలం చేకూర్చుతూ, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన నిర్ణయం తీసుకున్నారు. శాసన మండలి వేదికగా ఆమె చేసిన ప్రకటన రాష్ట్ర రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. ఉద్యమ పార్టీగా ఎదిగిన బీఆర్ఎస్‌పై తీవ్ర ఆరోపణలు చేస్తూ, తన తండ్రి స్థాపించిన



పార్టీతో పూర్తిగా తెగదెంపులు చేసుకుంటున్నట్టు ప్రకటించారు. ఇన్నాళ్లు సాంస్కృతిక వేదికగా ఉన్న తెలంగాణ జాగృతిని ఇకపై పూర్తిస్థాయి రాజకీయ పార్టీగా మారుస్తున్నట్లు ప్రకటించారు. శాసన మండలిలో కవిత భావోద్వేగానికి గురై కంటతడి పెట్టడం చర్చనీయాంశమైంది. ఆమె మాటల్లో తీవ్రమైన ఆవేదన, ఆగ్రహం స్పష్టంగా కనిపించాయి. ముఖ్యంగా "ఇది ఆస్తుల పంచాయితీ కాదు.. ఆత్మగౌరవ పంచాయితీ" అని ఆమె చేసిన వ్యాఖ్యలు బీఆర్ఎస్ అంతర్గత విభేదాల తీవ్రతను బయటపెట్టాయి. పుట్టింటి బంధాలను తెంచుకుని బయటకు వస్తున్నానని చెప్పడం ద్వారా, కేసీఆర్ కుటుంబంలోనూ, పార్టీలోనూ ఆమెకు దక్కిన ప్రాధాన్యతపై, లేదా ఆమె ఎదుర్కొన్న అవమానాలపై అనేక అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. బీఆర్ఎస్ ఇప్పుడు ఉద్యమ ద్రోహులకు పునరావాస కేంద్రంగా మారిందని ఆమె విమర్శించడం గమనార్హం. తెలంగాణ ఉద్యమ సమయంలో బతుకమ్మ పండుగ ద్వారా సాంస్కృతిక పునరుజ్జీవనానికి ప్రతీకగా నిలిచిన తెలంగాణ జాగృతి సంస్థ ఇప్పుడు రాజకీయ అవతారం ఎత్తనుంది. ఈ మేరకు కవిత కీలక ప్రకటన చేశారు. దీంతో జాగృతి ఇకపై కేవలం ఎన్జీవోగా కాకుండా, ఎన్నికల కమిషన్ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీగా మారుతుంది. వచ్చే ఎన్నికలే లక్ష్యంగా ఈ కొత్త పార్టీ బరిలోకి దిగనుంది. విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళలు, అన్ని వర్గాల ప్రజలే అజెండాగా ఈ పార్టీ పనిచేస్తుందని కవిత స్పష్టం చేశారు. దీనిని బట్టి చూస్తే, కవిత కేవలం ఉద్వేగంతో ఈ నిర్ణయం తీసుకోలేదని, దీని వెనుక ఒక పక్కా రాజకీయ వ్యూహం ఉన్నట్లు అర్థమవుతోంది. యువతను, అసంతృప్త వర్గాలను తన వైపు తిప్పుకునేందుకు ఆమె ప్రయత్నిస్తున్నారు. కవిత నిర్ణయం బీఆర్ఎస్‌కు రాజకీయంగా దెబ్బేనని విశ్లేషకులు భావిస్తున్నారు. కవితకు మహిళల్లో, ముఖ్యంగా బతుకమ్మ ఆడే తెలంగాణ ఆడబిడ్డల్లో ఒక ప్రత్యేకమైన ఇమేజ్ ఉంది. ఆమె వేరు కుంపటి పెట్టడం వల్ల బీఆర్ఎస్‌కు పడాల్సిన సంప్రదాయ ఓట్లు, మహిళా ఓట్లు చీలిపోయే ప్రమాదం ఉంది. ఉద్యమ కాలం నుంచి పనిచేస్తున్న అనేక మంది కవిత వర్గీయులు బీఆర్ఎస్‌లో ఉన్నారు. ఇప్పుడు వారు కవిత వెంటే నడుస్తారా లేక కేసీఆర్ నాయకత్వంలోనే ఉంటారా అన్నది పార్టీలో గందరగోళం సృష్టిస్తుంది. సొంత కూతురే పార్టీ విధానాలను తప్పుబడుతూ, బయటకు రావడం ప్రత్యర్థి పార్టీలకు బలమైన ఆయుధంగా మారుతుంది. కవిత కొత్త పార్టీ ఏర్పాటు కాంగ్రెస్, బీజేపీలకు పరోక్షంగా లాభం చేకూర్చే అవకాశం ఉంది. ప్రభుత్వ వ్యతిరేక ఓటు లేదా బీఆర్ఎస్ అనుకూల ఓటు చీలిపోవడం వల్ల ముక్కోణపు పోటీ ఏర్పడి, అది ప్రధాన పార్టీల సమీకరణాలను మారుస్తుంది. అయితే, కవిత జాగృతి ద్వారా సెంటిమెంట్‌ను ఎంత బలంగా రగిలిస్తారు, యువతను ఎంతగా ఆకర్షిస్తారు అనే అంశంపైనే ఆమె పార్టీ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. "వ్యక్తిగా వెళ్తున్నా.. రాజకీయ శక్తిగా తిరిగి వస్తా" అని కవిత చేసిన శపథం ఆమెలోని పట్టుదలను చూపిస్తోంది. అయితే, కుటుంబ పార్టీని, బలమైన నాయకత్వాన్ని ఎదిరించి, కొత్త పార్టీతో నెట్టుకురావడం అంత సులభం కాదు. కానీ, తెలంగాణ రాజకీయ యవనికపై జాగృతి రూపంలో కొత్త పోరాటం మొదలైందని మాత్రం కచ్చితంగా చెప్పవచ్చు. రాబోయే రోజుల్లో జరిగే పరిణామాలు రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని మార్చే అవకాశం ఉంది.

# సెంటిమెంట్ నమ్ముకున్న గులాబీ దళం

హైదరాబాదభారత శక్తి జిల్లా (ప్రతినిధి) జనవరి 6:


బఆఆర్ఎస్ మరోసారి ప్రజాదరణ కోసం సెంటిమెంటు మంత్రాన్నే నమ్ముకుందా?? మరీ ముఖ్యంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చంద్రబాబును టార్గెట్ చేయడం కూడా అందుకేనా?? మరి ఈ మంత్రం ఫలిస్తుందా..? గతంలోలా ప్రజలు మళ్లీ కేసీఆర్ సెంటి?మెంటును ప్రజలు గౌరవిస్తారా?? ప్రస్తుతం బీఆర్ఎస్ సెంటిమెంట్ రాజకీయాలను చూస్తుంటే ఎవరికైనా ఇదే డౌటొస్తుంది. కృష్ణా జలాల పంపకం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై మాట్లాడే క్రమంలో కేసీఆర్.. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడిని టార్గెట్ చేయడం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. పాలమూరు రంగారెడ్డి డీపీఆర్ వెనక్కి రావడానికి కారణం చంద్రబాబు అని ఆరోపించారు. అదే సమయంలో అవసరం లేకపోయినా పెట్టుబడుల సదస్సు గురించి ప్రస్తావించారు. ఇటీవల రేవంత్ ప్రభుత్వం ఎంవోయూలపై చేస్తున్న ప్రచారాన్ని విమర్శిస్తూ.. గతంలో చంద్రబాబు హయాంలో విశాఖలో జరిగిన సదస్సులో స్టార్ హోటల్ వంట మనుషులతో ఒప్పందాలు చేయించారని ఎద్దేవా చేశారు. పాలమూరును దత్తత తీసుకుని చంద్రబాబు మోసం చేశారని, కేవలం శిలాఫలకాలతోనే కాలం గడిపారని విమర్శించారు. ప్రస్తుతం రేవంత్ రెడ్డి పాలన చంద్రబాబు డైరెక్షన్‌లోనే సాగుతోందని, అందుకే తెలంగాణ ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం వెనక్కి తగ్గుతోందని విమర్శించారు. కేసీఆర్ మళ్లీ తెలంగాణ సెంటిమెంట్ ను రగిలించే ప్రయత్నం చేస్తున్నారని నిపుణులు చెబుతున్నారు. రేవంత్ రెడ్డిని చంద్రబాబుతో ముడిపెట్టడం ద్వారా, తెలంగాణ ప్రయోజనాలను పక్క రాష్ట్రానికి తాకట్టు పెడుతున్నారనే భావనను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేసీఆర్ భావిస్తున్నారని అంచనా వేస్తున్నారు. ఒకే దెబ్బకు ఇద్దరు ముఖ్యమంత్రులను టార్గెట్ చేయడం ద్వారా, తానొక్కడే తెలంగాణ హక్కుల కోసం పోరాడే యోధుడినని నిరూపించుకునే వ్యూహం ఇందులో ఉందని అనుకోవచ్చు. అయితే, ప్రధాన సమస్య అయిన కృష్ణా జలాల వివాదం కన్నా చంద్రబాబుపై వ్యక్తిగత విమర్శలే ఎక్కువగా హైలైట్ అవ్వడం బీఆర్ఎస్‌కు మైనస్ అయ్యే అవకాశం ఉందని మరికొందరు భావిస్తున్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు అనుమతులు, నీటి వాటాల గురించి కేసీఆర్ చేసిన లోతైన విశ్లేషణ కన్నా, చంద్రబాబుపై చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో ఎక్కువగా ట్రోల్ అవుతున్నాయి. దీనివల్ల చర్చ ప్రాజెక్టుల నుంచి రాజకీయ వ్యక్తిగత దూషణలకు మళ్లింది. ప్రస్తుతం తెలంగాణలో అధికారంలో లేని చంద్రబాబును అంతగా టార్గెట్ చేయడం వల్ల ఏపీ-తెలంగాణ మధ్య మళ్లీ ఉద్రిక్తతలు పెరుగుతాయే తప్ప, ప్రస్తుత సమస్యలకు పరిష్కారం దొరకదని సామాన్యులు భావిస్తున్నారు.



# సిటీ చుట్టూ రేడియల్ రింగ్

హైదరాబాద్, భారత శక్తి జిల్లా (ప్రతినిధి) జనవరి 6:


హైదరాబాద్ తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు జలమండలి 8 వేల కోట్ల రూపాయలతో భారీ ప్రాజెక్టును సిద్ధం చేస్తోంది. నగరం చుట్టూ సుమారు 140 కిలోమీటర్ల మేర 'రేడియల్ రింగ్ మెయిన్' పేరుతో ప్రధాన పైపులైన్ వ్యవస్థను నిర్మించనున్నారు. కృష్ణా, గోదావరి, మంజీరా వంటి అన్ని నీటి వనరులను ఈ రింగ్ మెయిన్‌తో అనుసంధానం చేస్తారు. దీనివల్ల ఏదైనా ఒక ప్రాంతంలో పైపులైన్ పాడైతే.. మరో మార్గం ద్వారా నీటిని మళ్లించి సరఫరాకు అంతరాయం లేకుండా చేయవచ్చు. నగరమంతటా 24 గంటల పాటు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. హైదరాబాద్ మహానగరం శరవేగంగా విస్తరిస్తోంది. పెరిగిన జనాభాకు తగ్గట్టుగా.. నగరంలోని ఏ ఒక్క ప్రాంతంలోనూ నీటి కరువు లేకుండా చూడాలని జలమండలి నడుం బిగించింది. దీని కోసం సుమారు 8 వేల కోట్ల రూపాయల భారీ బడ్జెట్‌తో ఒక ప్రత్యేకమైన తాగునీటి ప్రాజెక్టును సిద్ధం చేస్తోంది. నగరానికి నలుదిశల నుండి వచ్చే నీటి వనరులను ఒకదానితో ఒకటి కలిపేలా ఒక భారీ నెట్‌వర్క్‌ను నిర్మించడమే ఈ ప్లాన్ ముఖ్య ఉద్దేశం. సాధారణంగా నగరానికి ఒక్కో వైపు నుండి ఒక్కో నది లేదా రిజర్వాయర్ నీరు వస్తుంది. అయితే.. ఏదైనా ఒక పైపులైన్ పాడైతే ఆ ప్రాంతానికి నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోతుంది. ఇలాంటి సమస్య రాకుండా ఉండటానికి, నగరం చుట్టూ సుమారు 140 కిలోమీటర్ల మేర ఒక పెద్ద రింగు లాంటి ప్రధాన పైపులైన్‌ను ఏర్పాటు చేస్తారు. దీనినే 'రేడియల్ రింగ్ మెయిన్' అని పిలుస్తారు. దీనికి అదనంగా మరో 96 కిలోమీటర్ల మేర చిన్న పైపులైన్ల ద్వారా నగరంలోని వివిధ వాటర్ ట్యాంకులకు కనెక్షన్ ఇస్తారు. ప్రస్తుతం హైదరాబాద్‌కు కృష్ణా, గోదావరి నదులతో పాటు సింగూరు, మంజీరా.. జంట జలాశయాలైన ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ నుంచి తాగునీరు అందుతోంది. ఈ కొత్త ప్రాజెక్టు వల్ల ఈ నీటి వనరులన్నీ ఒకే వ్యవస్థతో అనుసంధానం అవుతాయి. ఉదాహరణకు మంజీరా పైపులైన్‌కు రిపేర్లు వస్తే.. వెంటనే అదే రింగ్ మెయిన్ ద్వారా గోదావరి లేదా కృష్ణా జలాలను ఆ ప్రాంతానికి మళ్లించవచ్చు. నగరం చివరన ఉన్న ప్రాంతాలకు కూడా సమానమైన నీరు అందుతుహైదరాబాద్ ప్రజలకు రోజులో ఎప్పుడైనా నీరు వచ్చేలా (24/7 నీటి సరఫరా) చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఈ లక్ష్యాన్ని చేరుకోవాలంటే రింగ్ మెయిన్ వ్యవస్థ ఎంతో అవసరం. రాబోయే రెండేళ్లలో గోదావరి రెండు, మూడు దశల పనులు కూడా పూర్తవుతాయి. ఆ నీటిని కూడా ఈ రింగ్ మెయిన్‌కు కలిపితే.. భవిష్యత్తులో నీటి ఎద్దడి అనే మాట వినిపించదు. పాత పైపులైన్లు తరచూ పగిలిపోవడం వల్ల నీరు వృథా కావడమే కాకుండా... మరమ్మతులు చేసే వరకు ప్రజలు అల్లాడిపోతున్నారు. ఔటర్ రింగ్ రోడ్డు వెంబడి ఈ కొత్త పైపులైన్లు వేయడం వల్ల నిర్వహణ కూడా సులభం అవుతుంది. ఈ భారీ ప్రాజెక్టు పూర్తయితే హైదరాబాద్ తాగునీటి అవసరాలకు రాబోయే 50 ఏళ్ల వరకు ఎటువంటి ఇబ్బంది ఉండదని అధికారులు చెబుతున్నారు.



# మావోయిస్టుల్లో మిగిలింది వారే...

హైదరాబాద్,భారత శక్తి జిల్లా (ప్రతినిధి) జనవరి 6:

తెలంగాణను మావోయిస్టు రహిత రాష్ట్రంగా మార్చే దిశగా ప్రభుత్వం వ్యూహాత్మక అడుగులు వేస్తోంది. ప్రస్తుతం మావోయిస్టు పార్టీలో ఉన్న 17 మంది తెలంగాణ వాదులు జనజీవన స్రవంతిలో కలిస్తే.. రాష్ట్రం నుంచి ఆ సిద్ధాంతం పూర్తిగా కనుమరుగవుతుందని డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. లొంగిపోయిన వారికి పునరావాస ప్యాకేజీతో పాటు అన్ని విధాలా ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రాన్ని మావోయిస్టు రహిత రాష్ట్రంగా మార్చే దిశగా ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం వ్యూహాత్మక అడుగులు వేస్తోందని డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రస్తుతం మావోయిస్టు పార్టీలో కొనసాగుతున్న తెలంగాణ వాళ్లంతా జన జీవన స్రవంతిలో కలిస్తే.. రాష్ట్రం నుంచి ఆ సిద్ధాంతం పూర్తిగా కనుమరుగవుతుందని స్పష్టం చేశారు. ఈ క్రమంలో అడవుల్లో ఉన్నవారు లొంగిపోయి శాంతియుత జీవనం గడపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. డీజీపీ వెల్లడించిన గణాంకాల ప్రకారం.. ప్రస్తుతం మావోయిస్టు పార్టీలో వివిధ హోదాల్లో తెలంగాణకు చెందిన 17 మంది ఉన్నారు వీరిలో కేంద్ర కమిటీలో నలుగురు, రాష్ట్ర కమిటీలో ఐదుగురు, డివిజన్ కమిటీలో ఆరుగురు, అండర్‌గ్రౌండ్‌లో ఒకరితో పాటు మరొకరు ఉద్యమంలో కొనసాగుతున్నారు. ఈ 17 మంది మావోయిస్టులపై ప్రభుత్వం మొత్తం రూ. 2.25 కోట్ల భారీ రివార్డును ప్రకటించింది. వీరు గనుక ఆయుధాలు వీడి లొంగిపోతే.. పునరావాస ప్యాకేజీ కింద ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని డీజీపీ హామీ ఇచ్చారు. ప్రస్తుతం అడవుల్లో ఉన్న ఆ 17 మందిలో ఐదుగురు మహిళలు ఉన్నట్లు డీజీపీ అధికారికంగా ప్రకటించారు. వీరంతా కీలక బాధ్యతల్లో ఉన్నట్లు సమాచారం. మహిళా మావోయిస్టులు లొంగిపోతే వారి కుటుంబాలకు కూడా ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కాగా, గత కొన్నేళ్లుగా



తెలంగాణలో మావోయిస్టుల ప్రాబల్యం గణనీయంగా తగ్గుతూ వస్తోంది. కీలక నేతలు చనిపోవడం, లొంగిపోవడం పార్టీని ఆత్మరక్షణలో పడేసింది. ఇటీవల మావోయిస్టు పార్టీలో కీలక నేతగా ఉన్న పాక హనుమంతు ఎన్‌కౌంటర్‌లో మరణించడం పార్టీకి పెద్ద ఎదురుదెబ్బగా మారింది. సుదీర్ఘ కాలం పాటు అండర్‌గ్రౌండ్‌లో ఉన్న అగ్రనేత రాజిరెడ్డి ఇటీవల పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఆయనతో పాటు టాప్ మావోయిస్టు బర్సే దేవా మరికొందరు కీలక నాయకులు కూడా హింసా మార్గాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలిశారు. ఈ పరిణామాలు మిగిలి ఉన్న 17 మందిపై కూడా ఒత్తిడి పెంచుతున్నాయి. 'ఆపరేషన్ కగార్' గడువు ముగిసేలోపే తెలంగాణ పూర్తిస్థాయిలో మావోయిస్టు రహిత రాష్ట్రంగా అవతరిస్తుందని డీజీపీ ధీమా వ్యక్తం చేశారు. మారుతున్న సామాజిక, రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో సాయుధ పోరాటం ద్వారా సాధించేది ఏమీ లేదని, ప్రజాస్వామ్య పద్ధతిలో సమస్యలను పరిష్కరించుకోవాలని పోలీసులు కోరుతున్నారు. లొంగిపోయిన వారికి ఇంటి స్థలాలు, పిల్లల చదువు, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ప్రభుత్వం భరోసా కల్పిస్తున్నా

# మహిళను హత్య చేసి ఆపై ఆత్మహత్య

## కొర్లకుంట మారుతీ నగర్ లో ఘటన

తిరుపతిభారత శక్తి జిల్లా (ప్రతినిధి) జనవరి 6:

వివాహేతర సంబంధం తోనే మహిళను హత్య చేసిన వ్యక్తి ఆపై ఆత్మహత్య చేసుకున్నాడు. జీవకోనకు చెందిన సాంబలక్ష్మి (40) తో సోమశేఖర్ వివాహేతర సంబంధం వుంది. సాంబలక్ష్మిని హత్య చేసి అనంతరం సోమశేఖర్ (37). ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గుత్తి వారి పల్లి కి చెందిన సోమశేఖర్ ఐదు సంవత్సరాలుగా కొర్లగుంట మారుతి నగర్ లోఉంటూ ఓ గ్యాస్ ఏజెన్సీలో పని చేస్తున్నాడు. విషయం తెలుసుకున్న ఈస్ట్ డిఎస్పి భక్తవత్సలం, సీఐ శ్రీనివాసులు, ఎస్సై స్వాతి బృందం ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

# సర్వేల్లో నేతలు...

మహబూబ్ నగర్, భారత శక్తి జిల్లా (ప్రతినిధి) జనవరి 6:

2025 జనవరి 25 మున్సిపాలిటీ పాలక వర్గం గడువు ముగిసింది. పాలకవర్గం ముగిసిన రోజు నుండి ప్రత్యేక అధికారుల పాలన లో మున్సిపాలిటీ శాఖ పని చేస్తున్న విషయం అందరికి తెలిసిందే. త్వరలో మున్సిపాలిటీ ఎన్నికలకు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశాలు జారీ అయ్యాయి. అందులో భాగంగానే ఓటర్ల జాబితా సవరణ ముసాయిదా వంటి కార్యక్రమాలు కూడా వేగవంతం దిశగా పనుల్లో సంబందించిన అధికారులు నిమగ్నమయ్యారు. మున్సిపాలిటీ పీఠం పై తమ పార్టీ జెండా పాగ వేసేందుకు అధికార, ప్రతి పక్ష పార్టీలు ఇప్పటికే ఎత్తులకు పై ఎత్తులను వేసే పనిలో నిమగ్నమయ్యారు. ఏ వార్డు లో ఏ అభ్యర్థి నిలబడితే గెలుస్తారో వంటి సర్వే చేసే పనిలో అటు అధికార పార్టీ ఇటు ప్రతిపక్ష పార్టీలు నిమగ్నమయ్యారు. ఇప్పటికే సోషల్ మీడియా, అభ్యర్థులకు తెలియని వ్యక్తుల నుండి మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి వార్డు లో గెలుపు గుర్రాల సర్వే ను నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆర్థికంగా ఉన్నారు అటువంటి వారికీ ఇవ్వడం కన్నా ఆయా వార్డులో అభ్యర్థి ప్రవర్తన, పరిచయాలు, ప్రత్యర్థి కన్నా ఎక్కువ ఖర్చు పెట్టగలడా ఒక వేల పార్టీ నుండి బి ఫామ్ (టికెట్) ఇస్తే గెలుస్తాడా లేదా వంటి విషయాలపై లోతుగా సర్వే చేస్తున్నట్లు సమాచారం. గెలుపు గుర్రాలకు టికెట్ ఇస్తేనే మున్సిపాలిటీపై తమ పార్టీ జెండా పాగ ఉంటుందని ఆ దిశగా నాయకులు ఆలోచిస్తూ అడుగులు వేస్తున్నారు. పార్టీ ని నమ్ముకుని చాలా రోజుల నుండి పార్టీకి సేవ చేస్తున్నాము పార్టీ ఏ పిలుపునిచ్చిన పని చేసాం మా వార్డులో ప్రజల మద్దత్తు పుష్కలంగా ఉంది సంవత్సరం నుండి వార్డు లో వినాయక చవితి, దసరా నవరాత్రి ఉత్సవాలు, బతుకమ్మ, పండుగలు, పబ్బాలు, చావులు ఇలా ఎన్నో కార్యక్రమాలకు హాజరు కావడం తో పాటు ఆర్థిక సహాయకారాలు అందిస్తూ ప్రజల మధ్యలో ఉన్నాము మాకే పార్టీ టికెట్ ఇవ్వాలని నేతల ముందుకు నాయకులతో ఆశావహులు పావులు కదుపుతున్నారు. కొన్ని వార్డు లో అధికార, ప్రతిపక్ష పార్టీలో సైతం ఇద్దరు ముగ్గురు ఆశావహులు వారి వారి ప్రయత్నాలు చేస్తున్నారు. సంవత్సరం నుండి ఎదురు చూస్తున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో తాము కూడా ఫోటీలో ఉన్నామంటూ తమకు మద్దతు ఇవ్వాలని ఇపటికే ఆయా వార్డు లో యువత, ముఖ్యులతో ఇప్పటికే ఆశవహులు లోలోపల సమావేశాలను నిర్వహిం చుకుంటున్నారు. ఎలక్షన్ లో నాకు సపోర్ట్ చేస్తే వార్డులో జరుగబోయే అభివృద్ధి పనుల్లో పనులు ఇప్పిస్తా ఎం పని అడిగిన ఖచ్చితంగా చేసి పెడతాను ఇలా లెక్కకు మించి హామీలను ముఖ్యలకు హామీలను సైతం ఇస్తున్నట్లు తెలుస్తోంది.

# అంధకారంలో జిల్లెల్లగూడెం గ్రామం

ఏలూరు భారత శక్తి జిల్లా (ప్రతినిధి) జనవరి 6:

ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం జిల్లెల్లగూడెం గ్రామం అంధకారంలో వుండిపోయింది. గత నాలుగు రోజుల క్రితం ట్రాన్స్ఫారం కాలిపోవడంతో జిల్లెల్ల గూడెం గ్రామంలో విద్యుత్తు నిలిచిపోయింది. విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్థుల ఆరోపణ. త్రాగునీరు లేక కరెంటు లేక ఆ గ్రామం నానా అవస్థలు పడుతున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని అంటున్నారు. గిరిజన గ్రామమే కదా పోతే పోనీలే అన్నట్లుగా అధికారులు వ్యవహరించడంతో ఆ గ్రామం అంధకారంలోకి వెళ్లిపోయింది. ఎన్నిసార్లు విద్యుత్ శాఖ అధికారులకు గ్రామ ప్రజలు విన్నవించుకున్న అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని అంటున్నారు.

# అధికారుల్లో విజిలెన్స్ గుబులు

హైదరాబాద్, భారత శక్తి జిల్లా (ప్రతినిధి) జనవరి 6:

పది, పదిహేను సంవ త్సరాలుగా నీటిపారుదల శాఖలో జరిగిన అనేక అవినీతి, అక్రమాలు, అవకత వకలపై రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం వేగంగా స్పందించి విచారణ జరిపింది. అన్ని సాంకేతికాంశాలు పరిశీలించింది. అక్రమాల నిగ్గుదే ల్చింది. ముఖ్యంగా కాళేశ్వరంపై ప్రభు త్వం నుంచి విచారణకు ఆదేశాలు వచ్చిం దే తడవుగా.. పకడ్బందీగా విచారణ చేసి నివేదికను ప్రభుత్వానికి అందించింది. విజిలెన్స్ విచారణలో బయటపడ్డ వాస్తవాలను, అలాగే విజిలెన్స్ నివేదికలను కూడా జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ మెచ్చుకుని తమ నివేదికలోనూ అవే అంశా లను పొందుపర్చింది. దీనితో విజిలెన్స్ విచారణ పకడ్బందీగా, లోతుగా చేశారనే ప్రశంసలు సర్వత్రా వచ్చాయి. అయితే, మిడ్ మానేరు ప్రాజెక్టు నిర్మాణానికి సం బంధించి రూ. 1,000 కోట్ల అవినీతి, అక్రమాలు, అవకతవకలు జరిగాయని లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందడంతో.. విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు రంగంలోకి దిగారు. అలాగే కొండపోచమ్మ రిజర్వాయర్ నిర్మాణంలో రూ. 500 కోట్ల వర కు, బుద్ధారం కెనాల్ నిర్మాణంలో రూ. 30 నుంచి 40 కోట్ల వరకు అక్రమాలు జరిగాయనే ఫిర్యాదులు అంద డంటో విజిలెన్స్ విభాగం అదే వేగంతో అంతే పకడ్బందీగా విచారణను చేపట్టింది. విచారణ అనంతరం సిద్ధం చేసిన మూడు నివేదికలు కూడా విజిలెన్స్ కమిషన్ వద్దకు చేరి నెలల కాలం అయ్యింది. ప్రభుత్వానికి మాత్రం చేరడం లేదు. ప్రభుత్వం నుంచి పచ్చజెండా ఊపితేనే.. ఈ విజిలెన్స్ నివేది కలకు మోక్షం కలుగుతుందనే విమర్శలకు ఊతమిస్తున్నాయి. ఇంతటి ముఖ్య మైన విజిలెన్స్ నివేదికలపై రాష్ట్ర ప్రభు త్వం ఎందుకు దృష్టి సారించడం లేదనే చర్చ అధికారవర్గాల్లోనూ మొదలయ్యిం ది. మిడ్ మానేరుపై విచారణ సందర్భంగానే అప్పటి నీటిపారుదల శాఖ ఈఎన్ సీని అక్కడి నుంచి మార్చాల్సి వచ్చింది. కారణం.. మిడ్ మానేరులో ఈ అవకతవకలు జరిగినప్పుడు ఆయన మిడ్ మానేరు సీఈగా బాధ్యతలు నిర్వర్తించారు. బీఆర్ఎస్ హ యాంలో కొండపోచమ్మ రిజర్వాయర్ నిర్మాణంలో భారీగా అక్రమాలు జరిగాయని, అ లాగే బుద్ధారం కెనాల్ నిర్మాణంలోనూ కోట్ల విలువైన అవకతవకలు జరిగాయని విజిలెన్స్ విచారణలో వాస్తవాలు బయటపడ్డా యని సమాచారం. బయటపడ్డ వాస్తవాలు, అక్రమాలు, అవినీతి, అవకతవకలకు బాధ్యులనుకూడా గుర్తించి పూర్తిస్థాయి నివేదికల ను కమిషన్‌కు పంపించినా.. ప్రభుత్వం మా త్రం ఈ నివేదికలపై దృష్టి సారించకపోవడం గమనార్హం. ఫిర్యాదులు రాగానే.. ఎంత వేగంగా విచారణకు ఆదేశించారో, విచారణ నివేదికలు సిద్ధం అయిన తరువాత.. అదే స్థాయిలో సర్కారు స్పందించడం లేదనే వి మర్శలు వస్తున్నాయి. మూడు ముఖ్యమైన విజిలెన్స్ నివేదికలు కమిషన్ కార్యాలంలో మూలన పడిఉంటే.. కనీసం వీటిని బయటకు తీసుకొచ్చి, బాధ్యులపై చర్యలకు ఆదేశా లు ఇవ్వాల్సిన రాష్ట్ర ప్రభుత్వం మాత్రం మీనమేషాలు లెక్కపెట్టినట్టుగా వ్యవహరించడంపై సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతోంది.

# అన్వేష్ కు చుక్కలు...

హైదరాబాద్,భారత శక్తి జిల్లా (ప్రతినిధి) జనవరి 6:

నా అన్వేషణ అనే యూట్యూబ్ చానల్ ద్వారా అన్వేష్ ట్రావెలర్ గా మంచి గుర్తింపును సంపాదించుకున్నాడు. దేశ విదేశాలను తిరుగుతూ ఆ దేశంలో ఉన్న వింతలు విశేషాలను చూపిస్తూ వచ్చాడు. తద్వారా తన మాటలకు అట్రాక్ట్ అయిన జనాలు అతన్ని ఫాలో చేస్తూ అతను పెట్టే కంటెంట్ చూస్తూ వచ్చారు. అయితే ఆయన రీసెంట్ గా హిందూ దేవుళ్లను దూషిస్తూ మాట్లాడిన మాటలు గాని, గరిజపాటి గారిని ఉద్దేశించి వాడిన బూతు పదాలు గానీ, శివాజీని తిట్టిన విషయాల్లో చాలామంది చాలా రకాలుగా స్పందించారు. ముఖ్యంగా హిందూ దేవుళ్లను తిట్టడం పైన హిందూవులు తమ మనోభావాలు దెబ్బతిన్నాయంటూ అతని మీద





కేసులను ఫైల్ చేశారు? మొత్తానికైతే అన్వేష్ ను విమర్శించని వారు లేరు?ఇక తనను పట్టుకోడానికి తెలుగు రాష్ట్రాల పోలీసులు తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నారు. పోలీసులకు దొరక్కకుండా ఉ ండటానికి అన్వేష్ విదేశాల్లోనే తిరుగుతున్నాడు. ఇప్పటికే తన యూట్యూబ్ ఛానల్ నుంచి ఐదు నుంచి ఆరు లక్షల మంది సబ్స్క్రైబర్లు తన చానెల్ ను అన్ సబ్స్క్రైబ్ చేయడంతో అన్వేష్ కి చుక్కలు కనిపిస్తున్నాయి. రీసెంట్గా ఏ జ్యూడ్ అజయ్ ను అన్వేష్ బెదిరిస్తూ పెట్టిన వీడియో ద్వారా అన్వేష్ భారీగా నెగెటివిటిని మూటగట్టుకున్నాడు? అన్వేష్ మీద దాదాపు 30 కేసుల వరకు నమోదు చేశారు. ఇక అన్వేష్ ఇండియాకి రావాలంటే ముందుగా అతని యూట్యూబ్ ఛానల్ ఐడి, ఇన్స్టా ఐడి దొరికితే అది సాధ్యమవుతుందని పోలీసులు దానికోసం తీవ్రమైన ప్రయత్నాలైతే చేస్తున్నారు. ఏది ఏమైనా కూడా ఇంకో పది రోజుల్లో అన్వేష్ కు సంబంధించిన ఛానల్స్ ఐడిని పట్టుకొని అతన్ని ఇండియాకి రప్పిస్తామని హైదరాబాద్ పోలీసులు చాలా తీవ్రమైన కసరత్తులు చేస్తున్నారు. ఇక ఈ క్రమంలోనే అతను కనక ఇండియాకి వస్తే మాత్రం అతను హిందువుల ఆగ్రహానికి గురవ్వడమే కాకుండా అతన్ని వదిలేస్తే హిందువులందరు అతన్ని చితకబడుతారు. అలాంటి వ్యక్తిని పోలీసులు నిజంగానే ఇండియాకి తీసుకొస్తారా లేదంటే ఈ ఇష్యూ సైడ్ ట్రాక్ అయ్యేంత వరకు మేనేజ్ చేస్తున్నారా? అనేది తెలియాల్సి ఉంది?

# అంగారక సంకష్ట చతుర్థి పూజలందుకున్న మహాగణపతి

## -అధిక సంఖ్యలో దర్శించుకున్న భక్తులు

## -దేవాలయాన్ని పుష్పాలు తోరణాలతో అందంగా అలంకరించిన భక్తులు



మంథని భారత శక్తి జిల్లా (ప్రతినిధి) జనవరి 6:

: అంగారక సంకష్ట చతుర్థి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ మహాగణపతి దేవాలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. మంథని పట్టణంలోని తమ్మిచెరువు కట్ట వీధిలో గల శ్రీ మహాగణపతి దేవాలయం ఎంతో విశిష్టతతో కూడుకున్నది. ప్రతి పౌర్ణమి తర్వాత వచ్చే కృష్ణ పక్షంలోని నాలుగో రోజును సంకటహర చతుర్థి అంటారు. చతుర్థి తిథి మంగళవారంతో కలిసి వస్తే దానిని అంగారక చతుర్థిగా పిలుస్తారు. మంగళవారం వచ్చిన చవితి (చతుర్థి) తిథి వెయ్యి సూర్యగ్రహణాల పుణ్యకాలానికి సమానం. కృష్ణ అంగారక చవితి నాడు గణపతి ప్రీత్యర్థం ఉపవసించిన భక్తునికి వచ్చే పుణ్యం అనంతం వెయ్యి పడగల ఆదిశేషునకు సైతం ఆ వైభవాన్ని వివరించుట వీలుకాదు. సంస్కృతంలో 'అంగారక' అంటే "మంటలా ఎర్రగా ఉన్నది" అని అర్థం, ఇది మంగళవారం (కుజుడి రోజు) సూచిస్తుంది. పుష్య మాసం కృష్ణపక్షంలో అంగారక చతుర్థి రావడం చాలా అరుదు. అది గణేశోపాసకులకు అత్యంత విశేషం. మిగితా మాసాల్లో వచ్చిన కృష్ణ అంగారక చతుర్థులకంటే ఇవి చాలా ఫలప్రదం. ఈ రోజున వినాయకుడిని పూజించడం వలన కోరికలు నెరవేరుతాయని, జీవితంలోని సమస్యలు తొలగిపోతాయని భక్తులు నమ్ముతారు. ఈ రోజున చేసే పూజ వల్ల గణపతితో పాటు కుజుడు (మంగళ గ్రహం) అనుగ్రహం కూడా లభిస్తుందని, ఇది జాతకంలోని కుజ దోషాలను కూడా నివారిస్తుందని పండితులు చెబుతారు. గణపతి ముందు 16 దీపాలను వెలిగించి షోడశ గణపతులను ఆవహన చేసే ప్రక్రియ కూడా ఈరోజు చేస్తారు. కృష్ణ అంగారక చవితి నాడు గణపతిని పూజిస్తే అతి శీఘ్రంగా ఫలాలు పొందవచ్చు. అందునా ఈ రోజు ఉపవాసం చేస్తే ఏడాదిలో వచ్చి ప్రతి సంకటహర చవితికి ఉపవాసం చేసిన ఫలితం వస్తుందని కొన్ని గ్రంథాల్లో చెప్పగా, 21 సంకటహర చవితులు ఉపవసించిన ఫలం లభిస్తుందని కొన్ని పురాణ గ్రంథాల్లో కనిపిస్తుంది. అంగారక చవితి నాడు గణపతిని ఆరాధిస్తే కుజుడు కూడా ప్రసన్నుడవుతాడు. కుజుడు గణపతి కోసం చేసిన వెయ్యి సంవత్సరాల తపః ఫలితం ఈరోజు గణపతిని ఆరాధించిన వారికి లభించి, వారు అభివృద్ధి చెందుతారని గణపతి చెప్పాడట. ఈ రోజున భక్తులు గణేశుడిని పూజించి, ఉపవాసం ఉంటారు. కొత్తగా సంకష్టహర చతుర్థి ఉ పవాసాలు ఉండాలనికునేవారు ఈరోజు నుండి దీక్షను ప్రారంభిస్తారు. రాత్రి చంద్రుడిని చూసిన తర్వాత ఉపవాసం విరమిస్తారు. ఇది అడ్డంకులను తొలగించి మరియు జ్ఞానం, శ్రేయస్సు,అదృష్టానికి దేవుడైన గణేశుడికి అంకితం చేయబడిన పవిత్రమైన రోజు. మంగళవారం సంకష్ట చవితి కలిసిరావ డం చాలా విశేషం. ఇంతటి విశిష్టమైన అంగారక చతుర్థి నాడు సంకటహర చతుర్థి వ్రతం ఆచరించడం వల్ల జాతకంలో కుజ దోషసమస్యలు తొలగిపోతాయి. అంతేకాకుండా చేసే పనులలో సంకటాలు తొలగి విజయాలు చేకూరుతాయని శాస్త్రవచనం. అంగారక చతుర్థి సందర్భంగా నూతనంగా ఉపవాసాలు పట్టేవారు ఈరోజు సంకల్పం చేసుకుంటారు. ఈరోజు సంకష్టి ఉపవాసాలు ఉండేవారు మహా గణపతికి ప్రత్యేక పూజలు అభిషేకాలు చేస్తూ ఉంటారు. అలాగే ప్రతినిత్యం ఎందరో భక్తులు ఆలయంలో గణపతిని దర్శించుకొని వెళుతుంటారు. ప్రతి మంగళవారం భక్తులు విఘ్నేశ్వరుని పూజిస్తుంటారు. ముఖ్యంగా సంకటహర చతుర్థి రోజున మంథని పట్టణ ప్రజలే కాకుండాచుట్టుపక్కల గ్రామాల నుండి సైతం అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. సంకటహర చతుర్థి దీక్ష పట్టిన భక్తులు రాత్రి చంద్రోదయం అనంతరం మాత్రమే ఉపవాస దీక్షను విరమిస్తారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పల్లి రాము ఆలయానికి వచ్చిన భక్తులకు సంకల్పాలు, అర్చనలు, అభిషేకాలు చేయించారు. ఆలయం లోని స్వామి వారిని అలంకరిస్తూ భక్తుల సౌకర్యార్థం అర్చకులు పల్లి సంజీవ్, పల్లి రాము సోదరులు అన్ని ఏర్పాట్లు చేశారు. అంగారక చతుర్థి సందర్భంగా గణపతి దేవాలయాన్ని మంథని పట్టణానికి చెందిన బజారు వివేక్ మాధురి దంపతులు వారి సొంత ఖర్చులతో పుష్పాలు, తోరణాలు దేవతామూర్తుల ప్రతిమలతో అందంగా అలంకరించారు.

# లులు మాల్, హైపర్ మార్కెట్ లో 50 శాతం సేల్

హైపర్, ఫ్యాషన్, ఎలక్ట్రానిక్స్ లో భారీ డిస్కౌంట్లులు మాల్, లులు హైపర్ మార్కెట్ లో భారీ సేల్ జరగనుంది. ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు లులు ఆన్ సేల్ నిర్వహిస్తున్నట్లు మాల్ రీజినల్ మేనేజర్ మహ్మద్ షరీఫ్ తెలిపారు. ఈ మేరకు మాల్ లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ 4 రోజుల పాటు వినియోగదారుల కోసం భారీ డిస్కౌంట్స్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాల్ మేనేజర్ ఎజిల్ అరసన్ మాట్లాడుతూ.. ఈ సేల్ లో 50 శాతం డిస్కౌంట్ ఇస్తున్నట్లు తెలిపారు. 200 లకు పైగా బ్రాండ్లు ఈ మెగా సేల్ లో పాల్గొంటున్నాయని చెప్పారు. ఫుడ్ కోర్టుతో పాటు మాల్ లోని ఇతర రిటైల్ స్టోర్లు సైతం ఇందులో పాల్గొంటున్నాయన్నారు. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న షాప్ అండ్ విన్ కాంటెస్ట్ లో కనీసం రూ.1999 షాపింగ్ చేసిన వాళ్లు లక్కీ డ్రా ద్వారా కారు గెలుచుకునే అవకాశం ఉందన్నారు. వినియోగదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు...గేమ్స్, రోడ్స్ పై కూడా 50% డిస్కౌంట్ ఇస్తున్నట్లు తెలిపారు...



# ఆటవీ శాఖ అధికారులతో పవన్ సమీక్షా సమావేశం

అమరావతి భారత శక్తి జిల్లా (ప్రతినిధి) జనవరి 6:

రాష్ట్ర ఉపముఖ్యమంత్రి , అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ మంగళవారం నాడు వెలగపూడిలోని సచివాలయం 2వ బ్లాక్ లో అటవీశాఖ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, 50 శాతం గ్రీన్ కవర్ ప్రాజెక్టుల పురోగతిపై చర్చించారు. ఈ సమావేశంలో అటవీ, పర్యావరణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కాంతిలాల్ దండే, అటవీశాఖ సలహాదారు మల్లికార్జునరావు, పీసీసీఎఫ్ చలపతిరావు, అడిషనల్ పీసీసీఎఫ్ శాంతిప్రియా పాండే, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# జీహెచ్ఎంసి పరిధి బీజేపీ నేతల భేటీ

హైదరాబాద్ భారత శక్తి జిల్లా (ప్రతినిధి) జనవరి 6:

ఈరోజు జీహెచ్ఎంసీ పరిధిలోని ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశంలో రాష్ట్ర బీజేపీ ఛీఫ్ రామచంద్రరావు పాల్గొన్నారు.

ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ వార్డుల విస్తరణ అంశం, రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న అసంబద్ధ నిర్ణయాల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటిపై వచ్చిన అభ్యంతరాలు, అలాగే రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో బీజేపీ తెలంగాణ రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు డా. ఎన్. గౌతమ్ రావు, ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్చ సహా పార్టీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ప్రజా ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యంగా బీజేపీ స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగుతుంది.

# కీచక హెడ్ మాస్టర్ కు దేహశుద్ది

కుత్బుల్లాపూర్ భారత శక్తి జిల్లా (ప్రతినిధి) జనవరి 6:

గత కొంత కాలంగా పాఠశాలలో చదువుకునే విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న ప్రధానోపాధ్యాయుడికి దేహశుద్ధి చేసిన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే?గత కొంత కాలంగా ఎలాంటి అనుమతులు లేకుండా చంద్రగిరి నగర్ కాలనీ లో నిస్సీ స్వాతి పేరుతో ఓ పాఠశాల నడిపిస్తున్నారు విజయ్ కుమార్ అనే వ్యక్తి.

పాఠశాలలో చదివే విద్యార్థినులతో ఇంట్లో పనులు చేపించడం,వారి పట్ల అసభ్యంగా ప్రవర్తించడం చేస్తూ ఎవరికైనా చెబితే పరీక్షల్లో ఫెయిల్ చేస్తానని బెదిరించేవాడని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

సోమావారం నాడు పాఠశాలలో పదవ తరగతి చదివే విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించాడని తల్లితండ్రులకు చెప్పింది బాలిక. ఈ ఘటన పట్ల కోపోద్రిక్తులైన తల్లిదండ్రులు పాఠశాల పై దాడి చేసి ఫర్నీచర్ ధ్వంసం చేశారు.

ప్రధానోపాధ్యాదైన విజయ్ కుమార్ ను దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇలాంటి అనుమతులు లేని పాఠశాలల పై చర్యలు తీసుకుంటామని ఎం ఈ వో జెమినీ కుమారి తెలిపారు .

# రూ. 400 కోట్లతో భూపాలపల్లి మున్సిపాలిటీ అభివృద్ధి చేసినం..

# మేము తీసుకొచ్చిన ప్రతి రూపాయికి మంజూరు జీ.వోలు ఉన్నాయి...!

## మేము నిధులు తెచ్చాము అంటూ చేస్తున్న అర్భటాలకు ఆధారం చూపగలరా.. 12 కోట్లతో నేను మంజూరు చేసిన చెక్ డ్యామ్ కీ వాళ్ళ పేర్లతో శిలాఫలాకాలు వేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే రమణారెడ్డి



జయశంకర్ భూపాలపల్లి. భారత శక్తి జిల్లా ప్రతినిధి) జనవరి 6:

జయశంకర్ భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 12వ మరియు 13వ వార్డు ఖాసీమ్ పల్లిలో పట్టణ అధ్యక్షుడు కటకం జనార్దన్ గారి అధ్యక్షతన మంగళవారం జరిగిన బస్తీ బాట కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి మాట్లాడుతూ...గత సంవత్సరమే మున్సిపాలిటీ యొక్క పదవీకాలం పూర్తయి పోయింది.నిజానికి ఎప్పుడో ఎన్నికలు జరగాల్సి ఉండగా, ప్రభుత్వం కొన్ని కారణాల వల్ల వాటిని వాయిదా వేస్తూ వచ్చింది. ఇప్పుడు ప్రభుత్వం ఎన్నికలకు సమాయత్తం అవుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి.అందుకే మనం కూడా ఒకసారి మన శ్రేణులను, ప్రజలను సమాయత్తం చేయాలనే ఉద్దేశంతో ఈ బస్తీ బాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం.ఈ నేపథ్యంలో, ప్రజలతో నేరుగా కలవడానికిబస్తీబాట కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నాం.ఇక్కడ ఉండే చాలా మంది ప్రజలు వ్యవసాయాన్ని నమ్ముకొని జీవనం సాగించే వారు,వ్యవసాయ కూలీలుగా పని చేసే పరిస్థితుల్లో ఉన్నప్పటికీ నేరుగా మిమ్మల్ని కలవడం చాలా సంతోషంగా ఉన్నది. ఆ రోజు భూపాలపల్లిని గ్రామపంచాయతీ నుంచి నగర పంచాయతీగా మార్చాలని నేను నిర్ణయం తీసుకున్నప్పుడు,నాపై ఎన్నో నిరసన కార్యక్రమాలు జరిపారు.ఈ మున్సిపాలిటీ ఎందుకు? దీనివల్ల మాకు ఇబ్బందులు పెరుగుతాయి,ఇంటి పన్నులు పెరుగుతాయి,ఏం ఉపయోగం ఉంటుంది? అని చాలా మంది నన్ను ప్రశ్నించారు. ఆ రోజు మాజీ చైర్మన్ రవి, పాక్స్ చైర్మన్ సంపత్ కూడా మున్సిపాలిటీ వద్దు అనే జాబితాలో ఉన్నారు. అప్పుడు నేను ఒకటే మాట చెప్పాను ? ఏ పని చేసినా మొదట ఇబ్బంది తప్పదు,కానీ భవిష్యత్తులో మీరే దీన్ని ప్రశంసిస్తారు అని చెప్పడం జరిగింది..ఈ రోజు కాశీంపల్లిని చూస్తే,ఆ రోజు నేను తీసుకున్న నిర్ణయం సరైనది అని నిరూపించడం కొరకు బాధ్యతగా ఈ ప్రాంతాన్ని ఒక నిజమైన పట్టణంగా మార్చాలనే లక్ష్యంతో ముందుకెళ్లాను.భూపాలపల్లిలో మోటార్ సైకిల్ అయినా,కారు అయినా, ట్రాక్టర్ అయినా అన్నీ ఒకే గేర్లలో సాఫీగా వెళ్లేలారోడ్డు విస్తరణ చేసి,సెంట్రల్ లైటింగ్ పెట్టి రాత్రిపూట ఒక ఆడబిడ్డ ధైర్యంగా నడుచుకుంటూ ఎలాంటి భయం లేకుండా ఉండాలి అనే ఉద్దేశంతో రోడ్డు అభివృద్ధి కార్యక్రమాన్ని చేపట్టాం.ఈ రోజు మీ గ్రామంలో భూముల ధరలు ఎంతగా పెరిగాయో మీరు కళ్లారా చూస్తూనే ఉన్నారు. నేను ఆలోచించి చేసిన అభివృద్ధి పనులు ఇంకా ఎన్నో ఉన్నాయి. ఈ ప్రాంతం జాతీయ రహదారితో అనుసంధానమైంది,భూపాలపల్లి పట్టణానికి అభివృద్ధి ఒక వైపు జరిగితే,ఇంకో వైపు కూడా జరగాలనే దృష్టితో ఈ రోజు భూపాలపల్లి పట్టణాన్ని ముందుకు తీసుకెళ్ళేందుకు బైపాస్ రోడ్డు మంజూరు చేయించి,నిధులు మంజూరు చేయస్తే ఇప్పుడు వచ్చిన ఎమ్మెల్యే దాని ప్రస్తావనే లేదు, దాని పూర్తిగా విస్మరించిండు.ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రజలను మభ్యపెట్టేందుకు అధికార పార్టీ డ్రామాలు, కుయుక్తులకు పాల్పడుతోంది.ముఖ్యమంత్రి స్థాయి నుంచి కింది స్థాయి కార్యకర్తల వరకు అందరూ ఒక్కటే పని చేస్తున్నారు. ప్రతిపక్ష నాయకులపై బెదిరింపులు, తప్పుడు కేసులు పెట్టిస్తూ రాజకీయ వేధింపులకు పాల్పడుతున్నారు.స్థానికంగా వైస్ చైర్మన్ పై, ఎమ్మెల్యే కొందరు వ్యక్తులు దుర్మార్గంగా వ్యవహరిస్తూ, రాజకీయ కక్షసాధింపులకు పాల్పడారు. రైతులకు మేలు చేసే విధంగా పొలాలకు వెళ్ళే రోడ్డు వేస్తే అసలు అక్కడ భూమిలేని వ్యక్తితో భూమి వివాదం పేరుతో తప్పుడు ఆరోపణలు చేసి, అన్యాయంగా కేసులు నమోదు చేయించడం తీవ్రంగా ఖండించారు. ఇద్దరు వ్యక్తుల మధ్య వ్యక్తిగత లావాదేవీలలో ఇబ్బందులు ఉండటంతో ఒక్కరూ చేసిన హత్య కేసులో నేరానికి సంబంధం లేకుండా మరో వ్యక్తిపై తప్పుడు ఫిర్యాదు చేయించి, హత్య కేసులో ఇరికించే ప్రయత్నం చేయడం అత్యంత దారుణం. ఈ విధంగా నిర్దోషులను వేధించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం. దీని వల్ల క్షణికకాలం ఆనందం పొందవచ్చు గానీ, ఇలాంటి అక్రమ చర్యల వల్ల శాశ్వతంగా ప్రజల దృష్టిలో చరిత్రహీనులుగా మిగిలిపోతారని హెచ్చరిస్తున్నాం. ప్రజలు తమ ఓటుతో ఎన్నుకున్నది, ప్రజా ప్రతినిధులై ప్రజలను ఇబ్బంది పెట్టడానికి కాదు,సమస్యలు పరిష్కరించడానికి.ఈరోజు బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను లక్ష్యంగా చేసుకొని, తప్పుడు కేసులు పెట్టి కొట్టించడం జరిగింది. ఇది పూర్తిగా రాజకీయ కక్షతో చేసిన చర్యగా భావిస్తున్నాం.ప్రజాస్వామ్యంలో భయభ్రాంతులు సృష్టించే ఇటువంటి చర్యలను ప్రజలు గమనిస్తున్నారని, సమయం వచ్చినప్పుడు తగిన తీర్పు ఇస్తారని స్పష్టం చేశారు.మిత్రులారా...! చరిత్రను పరిశీలిస్తే హిట్లర్ లాంటి నియంతకే చివరకు పరాభవం తప్పలేదని గుర్తు చేశారు. అధికారం శాశ్వతం కాదు, పదవులు శాశ్వతం కాదు ప్రజల మద్దతుతో వచ్చిన అధికారాన్ని ప్రజలకు వ్యతిరేకంగా వినియోగిస్తే ఆ పాలకులకు తప్పకుండా ప్రజల తీర్పు ఎదురవుతుందని ఈ సందర్భంగా తెలిపారు.పోలీస్ అధికారులు కూడా భారత రాజ్యాంగాన్ని గౌరవిస్తూ పనిచేయాల్సిన బాధ్యత ఉన్నవారు ఈరోజు అధికార పార్టీ నాయకుల ఒత్తిడికి లోనవుతూ, ప్రజాస్వామ్య విలువలను తాకట్టు పెడుతున్నారు. జరుగుతున్న ప్రతి సంఘటన మా డైరీలో రికార్డు అవుతూనే ఉంది. రెండు సంవత్సరాలుగా జరుగుతున్న ఈ అన్యాయాలకు తప్పకుండా మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు.కేసీఆర్ నాయకత్వంలో బిఆర్ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రాన్ని ఎలా పాలించిందో ప్రజలకు తెలుసు. ఈరోజు మేము బాధ్యత కలిగిన ప్రతిపక్ష పార్టీగా ప్రజల తరపున నిలబడి ప్రశ్నిస్తున్నాం.ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం నిధులు మంజూరు కాకుండానే, ఎలాంటి శాంక్షన్ లెటర్లు లేకుండానే కొత్త శిలాఫలకాలు ఏర్పాటు చేస్తోంది. గతంలో మేము శాసనసభ్యులుగా ఉన్నప్పుడు, నిధులు మంజూరు అయిన తర్వాత ప్రెస్మీట్ పెట్టి మీడియా ద్వారా ప్రజలకు తెలిపి అభివృద్ధి పనులు ప్రారంభించే వాళ్లం.ఈరోజు కేవలం ఎన్నికల్లో లబ్ధి పొందాలనే ఉద్దేశంతో, నిధులు లేని పనులకు శిలాఫలకాలు వేయడం మరో కుట్రకు నిదర్శనం. ప్రజలు ఈ విషయాన్ని గమనించి అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాం. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, మున్సిపాలిటీల్లో ఉన్న రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ముందుగా చెప్పకుండా అనధికారికంగా కరెంటు కోతలు విధించడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.కేసీఆర్ పాలనలో రైతుబంధు పథకం ద్వారా ఎకరానికి రూ.10 వేలు సహాయం అందింది. ఈరోజు ఆ పరిస్థితి ఉందా..? రేవంత్ రెడ్డి దొంగ ప్రభుత్వం రూ.10 వేలు కాదు, రూ.15 వేలు రైతు బంధు ఇస్తామని చెప్పిన హామీలు ఎక్కడికి పోయాయి.రైతులు యూరియా కోసం తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. సకాలంలో యూరియా అందుతుందా? రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయా? అన్న ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలి. రైతులు పొలాల్లో పని చేయకుండా ఎరువుల కోసం లైన్లలో నిలబడాల్సి వస్తే, అది ప్రభుత్వ వైఫల్యమే. రైతుబంధు సకాలంలో అందక రైతులు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారు. సాగు పెట్టుబడులు లేక, అప్పులు చేయాల్సిన పరిస్థితి రైతులకు ఎదురవుతోంది. రైతుల పట్ల ఈ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని స్పష్టంగా కనిపిస్తోంది.అదేవిధంగా సంక్షేమ పథకాల పరిస్థితి కూడా ఆందోళన కలిగిస్తోంది. ఇలాంటి ప్రజాస్వామ్య విరుద్ధ చర్యలకు ప్రజలు కేవలం ఓటు ద్వారానే ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి. ప్రజల మద్దతు లభించదని గ్రహించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు అక్రమ ఓట్ల ఆధారంగా గెలవాలని కుట్రలు చేస్తున్నారు. ప్రజలను మోసం చేసిన దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు తగిన గుణపాఠం చెప్పాలని, రాబోయే ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను ఘనంగా గెలిపించాలని ప్రజలను కోరారు.

# "గంజాయి" మహమ్మారితో సమాజానికి ముప్పు.

## -యుటిఎఫ్ కరపత్రాల ఆవిష్కరణలో బద్వేల్ అర్బన్ సీఐ ఎస్.లింగప్ప



బద్వేలు భారత శక్తి జిల్లా ప్రతినిధి) జనవరి 6:

గంజాయి మహమ్మారి సమాజానికి తీవ్ర ముప్పు అని, దానిని సమాజం నుండి తరిమికొట్టేందుకు ఉపాధ్యాయులు తమ వంతు పాత్రను పోషించాలని బద్వేల్ అర్బన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎస్.లింగప్ప పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం బద్వేలు లోని అర్బన్ పోలీస్ స్టేషన్లో యుటిఎఫ్ రూపొందించిన "బావి భారత పౌరులను గంజాయి బారి నుండి కాపాడుకుందాం" అనే కరపత్రాలను ఆయన ఆవిష్కరించారుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో చాప కింద నీరులా విస్తరిస్తున్న గంజాయితో సమాజానికి తీవ్రమైన ముప్పు వాటిల్లనున్నదని, దాని బారి నుండి విద్యార్థులను, యువతను కాపాడటం ద్వారా రాష్ట్ర భవిష్యత్తును రక్షించుకుందామంటూ సామాజిక ఉద్యమం పేరుతో యుటిఎఫ్ కరపత్రాన్ని రూపొందించడం అభినందనీయమన్నారు. సమస్యలను, ఒత్తిడిలను అధిగమించలేకపోవడం పోటీని తట్టుకోలేకపోవడం, కుటుంబాలలో భావోద్రేకాలను పంచుకునే స్వేచ్ఛ లేకపోవడం, ఆన్లైన్ గేమ్స్, సోషల్ మీడియా వ్యసనం, సైబర్ ప్రభావం వల్ల విద్యార్థులు, యువత ప్రత్యేక ఆనందం పేరుతో గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారన్నారు. గంజాయి నిరోధానికి ప్రభుత్వం చర్యలు చేపడుతున్నా దాని ప్రభావం రోజురోజుకు పెరగడమే కాకుండా ఆనందంగా గడుపుతున్న కుటుంబాల్లో కల్లోలాలను సృష్టిస్తున్నదని పేర్కొన్నారు. గంజాయి మహమ్మారి ఎంతోమంది యువకుల జీవితాలలో చీకటిని నింపి, వారి జీవితాలను నాశనం చేస్తున్నదన్నారు. గంజాయి వల్ల యువత విచక్షణ కోల్పోవడమే కాకుండా, సహనాన్ని కోల్పోయి సంఘ విద్రోహ శక్తులుగా మారిపోతున్నారన్నారు. విద్యార్థులు, యువత గంజాయి లాంటి మారక ద్రవ్యాల వైపు వెళ్లకుండా చైతన్య పరచడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు.యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయకుమార్, జిల్లా కార్యదర్శి కె.సుధాకర్ మాట్లాడుతూ గంజాయి ప్రభావం రోజురోజుకు విపరీతంగా పెరిగిపోతున్నదన్నారు. ఒకప్పుడు ఎక్కడో చాటు మాటుగా సాగిన గంజాయి ప్రయాణం నేడు పాఠశాల పరిసరాల వరకు వచ్చి చేరిందన్నారు. విద్యార్థులు, యువత గంజాయికి బానిసలుగా మారి వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. గతంలో సిగరెట్ రూపంలో మాత్రమే లభించే గంజాయి నేడు చాక్లెట్స్, బిస్కెట్స్ రూపంలో పాఠశాలలు, కళాశాలల వద్ద దొరకడం తీవ్రమైన ప్రమాదానికి సంకేతమన్నారు. విద్యార్థులను, యువతను టార్గెట్ చేసి తమ సామ్రాజ్యాన్ని మరింత విస్తరించే పనిలో గంజాయి ముఠాలు వ్యవహరిస్తున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. గంజాయిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన వారిపై గంజాయి మాఫియా దాడులకు తెగబడిన సంఘటనలు సైతం గతంలో రాష్ట్రంలో చోటు చేసుకున్నాయన్నారు. వీటిని నిరోధించడం కోసం ప్రభుత్వం చేపట్టే చర్యలు సత్ఫలితాలను ఇవ్వడం లేదన్నారు. గంజాయి వల్ల ఏదైనా సంఘటనలు జరిగినప్పుడు మాత్రమే స్పందించడం కాకుండా గంజాయి నిరోధానికి పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గంజాయి మాఫియా ఆగడాలను అరికట్టేందుకు వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గంజాయి మాఫియా పై కఠినమైన చర్యలు తీసుకోవడంతో పాటు, గంజాయి సేవించడం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరిస్తూ అవగాహన క్యాంపులను నిర్వహించాలని వారు కోరారు.

# రేపటి నుంచి.. నల్లగొండ జిల్లావ్యాప్తంగా.. 'నో హెల్మెట్ ?

## నో పెట్రోల్' నిబంధన అమలు.

## -జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్,



జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా తీసుకున్న నిర్ణయం మేరకు, రేపటి నుంచి (బుధవారం) నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 'నో హెల్మెట్ ? నో పెట్రోల్ ' నిబంధనను అమలు చేయనున్నట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ నిర్ణయం ప్రకారం, జిల్లా పరిధిలోని అన్ని పెట్రోల్ బంకుల్లో హెల్మెట్ ధరించకుండా వచ్చిన ద్విచక్ర వాహనదారులకు పెట్రోల్ సరఫరా చేయరాదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఉన్న పెట్రోల్ బంక్ నిర్వాహకులు, సిబ్బందికి ఈ నిబంధన అమలుపై స్పష్టమైన సూచనలు ఇవ్వడం జరిగింది. అలాగే, ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తూ కౌన్సిలింగ్ కార్యక్రమాలు నిర్వహించామని ఆయన పేర్కొన్నారు.రోడ్డు ప్రమాదాలలో ద్విచక్ర వాహనదారులే అధికంగా ప్రాణాలు కోల్పోతున్నారని, ముఖ్యంగా హెల్మెట్ ధరించకపోవడం వల్ల తల గాయాలు తీవ్రంగా మారి ప్రాణనష్టం సంభవిస్తున్న ఘటనలు ఎక్కువగా ఉన్నాయని,ఈ నేపథ్యంలో రోడ్డు ప్రమాదాలను తగ్గించడం, ప్రజల ప్రాణాలను కాపాడడం ప్రధాన లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

# చిత్తడి నేలల సమగ్ర డాటాను సమర్పించాలి.

# జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

జయశంకర్ భూపాలపల్లిభారత శక్తి జిల్లా ప్రతినిధి) జనవరి 6:



జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఉన్న చిత్తడి నేలల వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమగ్ర డేటాను సమర్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా అటవీశాఖ అధికారి నవీన్ రెడ్డి తో కలిసి జిల్లా వెట్ ల్యాండ్ (చిత్తడి నేలలు) కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిత్తడి నేలల ప్రాముఖ్యత, పర్యావరణ పరిరక్షణలో వాటి పాత్ర, చిత్తడి నేలల నోటిఫికేషన్ అవసరాన్ని వివరించారు. జిల్లాలో చిట్యాల మండలం లోని గోపాల పూర్ చెరువును పైలెట్ ప్రాజెక్టు గా తీసుకొనున్నట్లు తెలిపారు. ఈ చెరువు ద్వారా 4 గ్రామాలకు చెందిన 15 వందల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నట్లు తెలిపారు. కమిటీ సభ్యులు క్షేత్ర స్థాయిలో పర్యటించి చిత్తడి నేలల స్థితిగతులు, విస్తీర్ణం, వినియోగం తదితర వివరాలను సేకరించి నివేదికగా సమర్పించాలని సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, భూపాలపల్లి డివిజన్ ఇరిగేషన్ ఈ ఈ బసవ ప్రసాద్, ఆర్డీఓ హరికృష్ణ, మత్స్య శాఖ అధికారి విజయ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, అటవీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అందరివాడుకు ఆత్మీయ సన్మానం

## ఆర్యవైశ్య మహాసభ వేదికగా సేవా సంకల్పం

### టిడబ్ల్యూజెఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంతోష్ చక్రవర్తికి సత్కారం



ఖమ్మం బ్యూరో, భారత శక్తి, జనవరి 6: ఖమ్మం గుట్టల బజార్ లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవ్యాలయం ప్రాంగణంలో ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ జిల్లా కార్యవర్గ సమావేశం, అధ్యక్షులు పసుమర్తి చంద్రరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగిన ఈ సమావేశానికి జిల్లా నలుమూలల నుంచి ఆర్యవైశ్య సమాజానికి చెందిన నాయకులు, ప్రతినిధులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలి రావడంతో సభకు విశేష ప్రాధాన్యత లభించింది. ఐక్యతే బలమనే భావన సమావేశమంతా ప్రతిధ్వనించింది. సమావేశంలో ఇటీవల ఎన్నికైన గ్రామపంచాయతీ ఆర్యవైశ్య చైర్మన్లు, వార్డు సభ్యులు, చాంబర్ ఆఫ్ కామర్స్, జూబ్లీ క్లబ్, వివిధ దేవాలయాల పాలకవర్గాలకు ఎన్నికైన ఆర్యవైశ్య ప్రతినిధులను వేదికపై ఘనంగా సత్కరించారు. బాధ్యతలు స్వీకరించిన ప్రతి ఒక్కరూ వ్యక్తిగత ప్రయోజనాలకంటే సమాజ హితానికే ప్రాధాన్యం ఇవ్వాలని, సమిష్టి కృషితోనే ఆర్యవైశ్య సమాజానికి గౌరవం పెరుగుతుందని వక్తలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజెఎఫ్ ఎ హెచ్-2843) ఖమ్మం జిల్లా అధ్యక్షుడు టి. సంతోష్ చక్రవర్తిను ఆహ్వానించి, ఃఅందరి వాడుః గా గుర్తింపు పొందిన ఆయనను సభ వేదికపై ఆత్మీయంగా ఘన సన్మానం చేశారు. నిష్పక్షపాత జర్నలిజంతో ప్రజా సమస్యలను నిరంతరం వెలుగులోకి తీసుకువస్తూ సమాజానికి స్వరంగా నిలుస్తున్న ఆయన సేవలను కొనియాడుతూ శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. బాధ్యతాయుతమైన మీడియా ప్రజాస్వామ్యానికి పునాదిగా నిలుస్తుందని నాయకులు స్పష్టం చేశారు. అనంతరం ఆర్యవైశ్య మహాసభ భవిష్యత్ కార్యాచరణపై కీలక చర్చలు జరిపారు. సేవా కార్యక్రమాల విస్తరణ, యువతను సంఘ కార్యకలాపాల్లో భాగస్వామ్యం చేయడం, సాంస్కృతిక విలువల పరిరక్షణ, దేవాలయాల అభివృద్ధి వంటి అంశాలను ప్రాధాన్యంగా తీసుకుంటూ సమాజ శ్రేయస్సే లక్ష్యంగా ముందుకు సాగాలని తీర్మానించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న మండలాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, మహిళా విభాగం నాయకులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేశారు.

# జీపు జాతాను జయప్రదం చేయండి

## సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు

సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి) జనవరి 6:

కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక వ్యతిరేక




విధానాలకు వ్యతిరేకిస్తూ జనవరి 9 నుండి11 వరకు సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా జరిగే జీపు జాతాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సిఐటియు కార్యాలయంలో సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల సంయుక్త సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన గత 12 సంవత్సరాలుగా అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మికుల, రైతుల, వ్యవసాయ కార్మికుల హక్కులను కాలరాస్తూ వారి మనుగడకే ప్రమాదం కలిగించే చర్యలకు పాల్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఈ దేశంలో అనేక సంవత్సరాలుగా పోరాడి కార్మికులు సాధించుకున్న హక్కులను కాలరాస్తూ కార్మిక చట్టాలకు రద్దు చేస్తూ కార్మికులను కట్టు బానిసలుగా చేస్తుందన్నారు. రైతాంగానికి గిట్టుబాటు ధరలు, స్వామినాథన్ సిఫారసులు అమలు చేయకుండా విద్యుత్ సవరణ బిల్లు తీసుకువచ్చి రైతాంగం మెడకు ఉరిపెట్టే విధంగా చర్యలకు పాల్పడుతుందన్నారు. ఈ దేశంలో అనేక సంవత్సరాలుగా వ్యవసాయ కార్మికులు పోరాడి సాధించుకున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని విబి జి రామ్ జి పేరు మార్చి పోరాడి సాధించిన చట్టాన్ని పథకంలో మార్చిందన్నారు. ఉపాధి హామీ చట్టానికి నిధులు తగ్గిస్తూ 60 శాతం కేంద్రం, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలని చెప్పడంలో అర్థం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, రైతాంగం, వ్యవసాయ కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జనవరి 9 నుండి11 వరకు సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా అన్ని మండల, పట్టణ కేంద్రాల్లో జీబుజాత నిర్వహిస్తున్నామని ఈ జాతాను కార్మిక వర్గం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కందాల శంకర్ రెడ్డి, తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొలిశెట్టి యాదగిరిరావు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పులుసు సత్యం, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం రాంబాబు, రైతు సంఘం జిల్లా నాయకులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, దుగ్గి బ్రహ్మం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకురాలు జంపాల స్వరాజ్యం పాల్గొన్నారు.

# జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో

## జిల్లా మహిళా సాధికారిత కేంద్రం బేటి బచావో బేటి పడావో




కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జనవరి 06, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా మహిళా సాధికారిత కేంద్రం బేటి బచావో బేటి పడావో ప్రోగ్రాం లో భాగంగా జిల్లా స్థాయి అధికారులకు సిబ్బందికి పని ప్రదేశాలలో మహిళల పై లైంగిక వేధింపుల చట్టం పైన అవగాహన కార్యక్రమము ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ గారు మహిళల రక్షణ నివారణ పరిష్కారము గురించి ఈ చట్టం పనిచేస్తుందని చట్టంలో ఇంటర్నల్ కమిటీ లోకల్ కమిటీలు ఫామ్ చేయాల్సిన బాధ్యత ప్రతి జిల్లా అధికారులకు ఉందని మహిళల లైంగిక సమస్యల కు గురైనప్పుడు ఆన్లైన్ షీ బాక్స్ పోర్టల్ లో పిటిషన్ దాఖలు చేసుకునేలా షీ బాక్స్ పనిచేస్తుందని, కమిటీ మెంబర్స్ వివరాలు అందరికీ కనబడేలా ప్రతి జిల్లా అధికారులు ప్రదర్శించాలనీ మాట్లాడడం జరిగింది మరియు కలెక్టర్ గారి చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరణ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డి ఎల్ ఎస్ ఏ సెక్రటరీ టి. నాగరాణి మేడం అడిషనల్ కలెక్టర్ మధుమోహన్ డి డబ్ల్యూ ఓ ప్రమీల డిఆర్డిఏ పిడి డిఎంహెచ్ఓ డాక్టర్ విద్య ఎక్సైజ్ హనుమంతు ఎల్ సి మెంబర్స్ స్వర్ణలత షబానా ఈ పురుషులు సమానంగా పనిచేస్తున్నారని పని ప్రదేశాలలో మహిళలు ఇలాంటి హింసకు గురికాకుండా గౌరవంగా ఉండేలా అధికారులు చూసుకోవాలని మహిళలు ఆత్మవిశ్వాసంతో కుండి తనది తాను రక్షించుకోవాలని మహిళల సమస్యలకు గురైనప్పుడు ప్రతి మహిళ ధైర్యంగా షీ బాక్స్ వినియోగించుకోవాలని ఈ పోర్టల్ గోప్యంగా పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని ప్రభుత్వ ఉద్యోగుల అధికారులు, సిబ్బంది, సిడిపివో సూపర్వైజర్స్, సఖి సిబ్బంది, ఐ సి పి ఎస్ సిహెచ్ఎల్ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# రెసిడెన్షియల్ కళాశాలలు, పాఠశాలల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పించాలి

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య
- రంజోల్ రెసిడెన్షియల్ బాలికల జూనియర్ కళాశాల ఆకస్మిక తనిఖీ

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జనవరి 6:

రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అన్ని విధాలా మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య అన్నారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా రంజోల్‌లోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ వసతి, భోజన ఏర్పాట్లు, పరిశుభ్రత, విద్యా ప్రమాణాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని కమిషన్ చైర్మన్ సూచించారు. విద్యార్థులతో కలిసి కూర్చుని భోజనం చేసి భోజనం నాణ్యంగా ఉందని ప్రశంసించారు. మెనూ ప్రకారం భోజనం అందుతున్నదా, విద్యార్థులకు ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పోషకాహారం ఆరోగ్యానికి ఎంతో అవసరమని, విద్యార్థులు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని వివరించారు. అలాగే విద్యార్థులందరూ చదువుపై పూర్తి శ్రద్ధ పెట్టి, ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగితే ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని సూచించారు. విద్యాలయ ఆవరణ



నిత్యం పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో జహీరాబాద్ శాసన సభ్యులు మాణిక్ రావు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, సోషల్ వెల్ఫేర్ డీడీ అఖిలేష్ రెడ్డి, రెసిడెన్షియల్ కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఐఐటీ హైదరాబాద్ బీటెక్-2026 ప్లేస్‌మెంట్స్: ఫేజ్-1లో 62.42 శాతం విజయం

- సగటు సీటీసీ 30 లక్షలు దాటింపు?

సర్క్యూటల్ విభాగాల్లో 83 శాతం పైగా ప్లేస్‌మెంట్

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి , జనవరి 6:

ఐఐటీ హైదరాబాద్‌లో బీటెక్?2026 ప్లేస్‌మెంట్ సీజన్ ఫేజ్?1 బలమైన ఫలితాలను నమోదు చేసింది. మొత్తం 487 మంది నమోదు చేసుకున్న విద్యార్థుల్లో 304 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించడంతో ప్లేస్‌మెంట్ రేటు 62.42 శాతంగా నమోదైంది. ఈ సీజన్‌లో సగటు సీటీసీ ?30 లక్షల కంటే ఎక్కువగా ఉండటం విశేషం. అన్ని విభాగాల్లో సగటు మరియు మధ్యస్థ (మీడియన్) పారితోషికాల్లో స్థిరమైన పెరుగుదల కనిపించిందని సంస్థ అధికారులు వెల్లడించారు. పోటీ నియామక పరిస్థితుల్లోనూ రిక్రూటర్‌ల విశ్వాసం కొనసాగుతున్నట్లు ఈ ఫలితాలు సూచిస్తున్నాయి.

సర్క్యూటల్ విభాగాల్లో అత్యుత్తమ ప్లేస్‌మెంట్ ఫలితాలు నమోదయ్యాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగం 83.33 శాతం, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ 83.05 శాతం, మ్యాథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్ 77.78 శాతం ప్లేస్‌మెంట్ రేటును సాధించాయి. ఈ విభాగాల్లో సగటు సీటీసీ ప్యాకేజీలు ?40 లక్షల పరిధిలో ఉన్నాయి. మెకానికల్, కెమికల్, సివిల్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ వంటి కోర్ ఇంజనీరింగ్ శాఖలు కూడా స్థిరమైన ప్లేస్‌మెంట్ ఫలితాలు సాధించాయి. సాఫ్ట్‌వేర్ రంగంతో పాటు కోర్ డొమైన్ ఉద్యోగాల్లోనూ సమతుల్య పనితీరు కనిపించిందని అధికారులు తెలిపారు. ఈ



ప్లేస్‌మెంట్ సీజన్‌లో గరిష్ట అంతర్జాతీయ పారితోషికం సంవత్సరానికి ?2.5 కోట్లకు చేరుకుంది. దేశీయంగా ఇద్దరు విద్యార్థులు ?1.1 కోట్ల ప్యాకేజీలు పొందగా, మరో నలుగురు విద్యార్థులు ?75 లక్షల నుంచి ?1 కోటి వరకు ఆఫర్‌లు సాధించారు. మొత్తం మీద విభాగాల వారీగా 24 అంతర్జాతీయ ఆఫర్‌లు లభించాయి. ఫేజ్2 నియామక ప్రక్రియ జనవరి 5, 2026 నుంచి ప్రారంభమైంది. మిగిలిన ఆసక్తి ఉన్న విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంపై దృష్టి సారించగా, కొంతమంది విద్యార్థులు ఉన్నత విద్యను కొనసాగించేందుకు ఆసక్తి వ్యక్తం చేసినట్లు తెలిపింది. ఇదే సమయంలో, బీటెక్?2027 ఇంటర్న్‌షిప్ సీజన్ కూడా మంచి ఆరంభం పొందింది. ఇప్పటివరకు 279 ఇంటర్న్‌షిప్ ఆఫర్‌లు, 15 అంతర్జాతీయ ఇంటర్న్‌షిప్‌లు లభించగా, నెలకు ?7.5 లక్షల వరకు స్టైపెండ్‌లు ఆఫర్ కావడం గమనార్హం.

# గీతంను సందర్శించిన డీపీవీ విద్యార్థులు



సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జనవరి 06:

గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ఇటీవల ఐఐటీ హైదరాబాదు ప్రాంగణంలోని డీఏవీ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల కోసం ఒక ఆసక్తికరమైన ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించింది. వాస్తుశిల్పం, డిజైన్ ప్రపంచానికి సంబంధించిన విజ్ఞానదాయన పరిచయాన్ని అందించింది. పాఠశాల విద్యా విజ్ఞాన కార్యక్రమాలలో భాగంగా, డీఏవీలోని 10, 11, 12 తరగతులకు చెందిన 58 మంది విద్యార్థులు, మరో ముగ్గురు అధ్యాపకులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్శనలో భాగంగా, పలు ముఖాముఖి కార్యక్రమాలు, ఎగ్జిబిషన్లు, విద్యార్థులు చేపట్టిన పలు ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఇవి గీతంలోని విద్యా వాతావరణం, సృజనాత్మక సంస్కృతిని వెల్లడించాయి. స్టూడియో ఆధారిత అభ్యాసం, డిజైన్ ఆలోచన, అంతర్ విభాగ విధానాలతో సహా ఆర్కిటెక్చరల్ విద్య యొక్క ప్రధాన అంశాలను ఆర్కిటెక్చర్ అధ్యాపకులు, విద్యార్థి రాయబారులు పరిచయం చేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆర్. శ్రుతి గాల్లి నిర్వహించిన మందాల కార్యశాల ఈ పర్యటనకే తలమానికంగా నిలిచింది. లయబద్ధమైన సంగీతం నేపథ్యంలో స్టూడియో వాతావరణంలో ఏర్పాటు చేసిన ఈ కార్యశాల విద్యార్థులను నమూనా తయారీ, కూర్పు, దృశ్య వ్యక్తీకరణను అన్వేషించేలా ప్రోత్సహించింది. అదే సమయంలో అవగాహన, సృజనాత్మక వాతావరణాన్ని కూడా పెంపొందించింది. అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఆర్. స్నిగ్ధా రాయ్, ఆర్. శృతి గాల్లి, విద్యార్థి రాయబారులు మౌన్య, వేదాంశ్ ఫెయిత్, అరిత్ర తదితరులు డీఏవీ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఆర్కిటెక్చర్ లో కెరీర్ అవకాశాలు, ప్రాంగణ జీవితం, సమస్యల పరిష్కారంలో సృజనాత్మకత యొక్క ప్రాముఖ్యతకు సంబంధించిన ప్రశ్నలకు వారు సమాధానాలు ఇచ్చారు. గీతం ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన తీరు, ముఖాముఖి సంభాషణలను డీఏవీ బృందం ప్రశంసించింది. ఆర్కిటెక్చర్, డిజైన్ లో కెరీర్ అవకాశాలను అన్వేషించడానికి ఈ పర్యటన ప్రేరణను ఇచ్చినట్టు వారు అభిప్రాయపడ్డారు.

# సినిమా

## టీజర్ రికార్డు




సూపర్ స్టార్ మహేశ్ బాబు, దర్శకధీరుడు రాజమౌళి కాంబినేషన్ లో తెరకెక్కుతున్న సెన్సేషనల్ ప్రాజెక్ట్ 'వారణాసి'. ఇప్పటికే భారీ హైప్ ని క్రియేట్ చేసుకున్న ఈ సినిమాని గ్లోబల్ లెవెల్ లో రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఇక ఇందులో భాగంగా మూవీ నుంచి ఇటీవలే వచ్చిన కంటెంట్ వైడ్ రీచ్ ని సొంతం చేసుకుంది. ఇక ఇదే గ్లింప్స్ ఇప్పుడు యునిక్ ఫీట్ సెట్ చేసింది. తాజాగా వారణాసి మూవీ టీజర్ అరుదైన రికార్డు సృష్టించింది. పారిస్‌లోని ప్రఖ్యాత 'లే గ్రాండ్ రెక్స్' థియేటర్లో ప్రదర్శించిన తొలి ఇండియన్ టీజర్ గా నిలిచింది. యూరప్ లార్జెస్ట్ థియేటర్ ఇదే. స్క్రీనింగ్ కు అవకాశమిచ్చినందుకు మూవీ టీమ్ థాంక్స్ చెప్పింది. 'వారణాసి నుంచి పారిస్ వరకు సాహసయాత్ర మొదలైంది. 2027లో పూర్తి సినిమాతో కలుద్దాం' అని ట్విట్టర్‌లో పోస్టు చేసింది. ఇక అమెజాన్ అడవుల నేపథ్యంలో సాగే ఈ కథలో టైమ్ ట్రావెల్, పురాణ గాథల (రామాయణం) స్పర్శ కూడా ఉంటుందని సమాచారం. మహేశ్ బాబు సరసన బాలీవుడ్ స్టార్ ప్రియాంక చోప్రా నటిస్తుండగా, మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్, ప్రకాశ్ రాజ్ కీలక పాత్రలో కనిపించనున్నారు. దాదాపు రూ. 800 కోట్లకు పైగా బడ్జెట్‌తో కేఎల్ నారాయణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాడు.

## రాశికి అనసూయ సారీ




మూడేళ్ల క్రితం జరిగిన ఓ వివాదాస్పద స్కిట్ మళ్లీ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నటి అనసూయ భరద్వాజ్ .. రాశికి బహిరంగ క్షమాపణ చెప్పారు. అప్పటి షోలో రాశి పేరుతో డబుల్ మీనింగ్ డైలాగ్ ఉపయోగించడం తప్పేనని అంగీకరిస్తూ, ఎక్స్ వేదికగా క్షమాపణలు తెలిపారు. ఆ రోజు స్కిట్ రచయితలు, దర్శకులను ప్రశ్నించాల్సిందని, కానీ అప్పట్లో ఆ ధైర్యం తనకు లేదని చెప్పారు. కాలక్రమంలో తన ఆలోచనల్లో మార్పు వచ్చిందని, డబుల్ ఎంటెండ్రస్‌కు వ్యతిరేకంగా మాట్లాడిన తర్వాత ఆ షోనే వదిలేశానని అనసూయ పేర్కొన్నారు. రాశి ఎదుర్కొన్న అవమానం తనకు పూర్తిగా అర్థమవుతోందని, ఈ విషయంలో బాధ్యత తనదేనని చెప్పి మరోసారి క్షమాపణలు కోరారు. దండోరా ప్రీ రిలీజ్ ఈవెంట్ లో నటుడు శివాజీ వ్యాఖ్యలపై వివాదం చెలరేగిన నేపథ్యంలో ఈ విషయం మళ్లీ తెరపైకి రాగా, రాశి గతంలో హైపర్ ఆది స్కిట్ తనను తీవ్రంగా బాధించిందని వెల్లడించారు. బాడీ షేమింగ్, అవమానకర హాస్యాన్ని ఖండించిన రాశి, ఒక దశలో లీగల్ యాక్షన్ ఆలోచన కూడా వచ్చిందని, కుటుంబ సలహాతో ఆ నిర్ణయాన్ని వదిలేశానన్నారు. ఈ తరుణంలో అనసూయ సారీ చెప్పడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## యువతకు దీపిక ఆఫర్

సినిమా రంగంలో రాణించాలనుకునే కొత్త తరానికి బాలీవుడ్ నటీమణి దీపికా పదుకొణె బంపర్ ఆఫర్ ఇచ్చింది. తన 40వ పుట్టినరోజు సందర్భంగా 'ది ఆన్‌సెట్ ప్రోగ్రామ్' అనే కొత్త ప్లాట్‌ఫామ్‌ను మొదలు పెట్టింది. చదువు అయిపోయి ఖాళీగా ఉన్న వారు లేదా సినీ రంగంలో టాలెంట్ చూపించాలనుకునే యువతకు ఇదో గోల్డెన్ చాన్స్. మనలో చాలామందికి కథలు రాయడం, కెమెరా తిప్పడం, డైరెక్షన్ చేయడం, మేకప్, కాస్ట్యూమ్స్ వంటి విభాగాల్లో మంచి పట్టు ఉంటుంది. కానీ ఇండస్ట్రీలోకి ఎలా వెళ్లాలో తెలియదు. అలాంటి వారికోసం దీపికా ఈ వేదికను క్రియేట్ చేసింది. అదేమిటనేది ఆమె మాటల్లోనే.. 'దేశవ్యాప్తంగా ఉన్న యంగ్ టాలెంట్‌ను గుర్తించి, వారికి సరైన ట్రైనింగ్ ఇవ్వాలని గతేడాదే అనుకున్నాను.. ఇప్పుడు దాన్ని నిజం చేస్తున్నాను' అంటూ ఓ వీడియో పోస్ట్ చేసింది. ఈ ప్రోగ్రామ్‌లో జాయిన్ అవ్వాలనుకుంటే.. వెంటనే 'onsetprogram.in' వెబ్‌సైట్‌లోకి వెళ్లి మీ వివరాలు, మీరు చేసే పనికి సంబంధించిన శాంపిల్స్‌ను అక్కడ అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. నచ్చితే, ఇండస్ట్రీలోని పెద్ద పెద్ద టెక్నీషియన్ తో కలిసి పని చేసే అవకాశం దక్కుతుంది. నటన ఒక్కటే కాదు.. రైటింగ్, ప్రొడక్షన్, కెమెరా ఇలా అన్ని విభాగాల్లో శిక్షణ కూడా ఇస్తారు.






## అందుకే 'ఉస్తాద్ భగత్‌సింగ్' వదులుకోవాల్సి వచ్చింది

**: సాక్షి వైద్య**

పవన్ కల్యాణ్ హీరోగా దర్శకుడు హరీశ్ శంకర్ తెరకెక్కిస్తున్న చిత్రం 'ఉస్తాద్ భగత్‌సింగ్'. ఈ సినిమాలో సాక్షి వైద్య నటించనున్నట్లు జోరుగా ప్రచారం జరిగింది. షూటింగ్‌లో కూడా జాయిన్ అయినట్లు వార్తలు వచ్చాయి. తాజాగా వీటిపై సాక్షి ఓ ఇంటర్వ్యూలో స్పందించారు. తనకు ఆఫర్ వచ్చినా కానీ, చేయలేకపోయినట్లు తెలిపారు. "ఉస్తాద్ భగత్‌సింగ్'లో కీలకపాత్రలో నాకు అవకాశం వచ్చింది. కానీ, ఆ సమయంలో నా కుటుంబ అత్యవసర పరిస్థితి కారణంగా నేను వేరే ఊరు వెళ్లాల్సి వచ్చింది. అదే సమయంలో మూవీ టీమ్ సభ్యులు ఫోన్ చేసి రేపటి నుంచి షూటింగ్ ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. వెళ్లలేని పరిస్థితుల్లో తేదీలు సర్దుబాటుచేయలేక దాన్ని వదులుకున్నాను" అని సాక్షి తెలిపారు. "గతంలో నేను నటించిన కొన్ని సినిమాలు వరుసగా ఫ్లాప్ కావడంతో నన్ను ఆ సినిమాను నుంచి తీసేశారు అని వార్తలు వచ్చాయి. ప్రేక్షకుల దృష్టికోణంలో అది నిజమేనేమో.. కానీ.. నేను అలాంటివి పట్టించుకోను. నా పని నేను చేసుకుంటూ ముందుకుసాగుతాను. అలాంటివి నన్ను ప్రభావితం చేయలేవు" అని ఆమె చెప్పారు. ప్రస్తుతం సాక్షి.. 'నారీ నారీ నడుమ మురారి' అంటూ శర్వానంద్‌తో కలిసి ఈ సంక్రాంతికి నవ్వులు పంచడానికి సిద్ధమయ్యారు. ఈ సినిమా జనవరి 14న విడుదల కానుంది. రామ్ అబ్బరాజు తెరకెక్కించిన ఈ చిత్రంలో శర్వానంద్ సరసన సంయుక్త కూడా కనిపించనున్నారు.

## 'టాక్సిక్'లో మరో హీరోయిన్.. ఫస్ట్‌లుక్ రిలీజ్




యశ్ హీరోగా మలయాళ దర్శకురాలు గీతూమోహన్‌దాస్ 'టాక్సిక్' చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. 'ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' అనేది ట్యాగ్ లైన్. ప్రస్తుతం దీని షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా ఈ సినిమాలో రుక్మిణి వసంత్ ఉన్నట్లు టీమ్ ప్రకటించింది. ఇందులో ఆమె మెలిసా అనే పాత్రలో కనిపించనున్నారు. ఈ విషయాన్ని తెలుపుతూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. మోడ్రన్ డ్రెస్‌లో పబ్‌లో నడుస్తూ రుక్మిణి కనిపిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాలో ముగ్గురు హీరోయిన్‌ల లుక్‌ను విడుదల చేశారు. ఇప్పుడు రుక్మిణి కూడా అందులో ఉన్నట్లు అధికారికమైంది. దీంతో ఇందులో నలుగురు హీరోయిన్స్ అయ్యారు. నదియా పాత్రలో కియారా కనిపించనుండగా హ్యూమా ఖురేషీ ఎలిజబెత్‌గా, నయనతార గంగ పాత్రలో అలరించనున్నారు. చిన్నారుల కోసం ఎన్నో కథలు తెరకెక్కాయని, ఇది పెద్దలకు సందేశమిచ్చే చిత్రమని యశ్ ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. భారీ అంచనాల మధ్య వచ్చే ఏడాది మార్చి 19న ప్రేక్షకుల ముందుకురానుంది.

## అందరూ మెచ్చేలా ది రాజాసాబ్



"ప్రభాస్ 'బాహుబలి'కి ముందు ఎలా కనిపించేవారో 'ది రాజాసాబ్' చిత్రంలో అలా కనిపిస్తార"న్నారు నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్. ఈ సినిమాలోని కామెడీ, రొమాన్స్, యాక్షన్, ఫాంటసీ అంశాలు అందర్నీ అలరిస్తాయని తెలిపారు. ప్రభాస్ టైటిల్ పాత్రలో నటించిన ఈ పాన్ ఇండియా చిత్రాన్ని మారుతి తెరకెక్కించారు. టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ కథానాయికలు. ఈ సినిమా ఈ నెల 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ఈ చిత్రంలోని "నాచే నాచే.." గీతాన్ని సోమవారం ముంబయిలో విడుదల చేశారు. ఈ సందర్భంగా నిధి అగర్వాల్ మాట్లాడుతూ.. "ఈ చిత్రం రొమాంటిక్ హారర్ ఫాంటసీ జానర్‌లో రూపొందింది. ఇది భారతీయ సినిమాకి కొత్త జానర్" అన్నారు. సీనియర్ నటి జరీనా వహాబ్ మాట్లాడుతూ.. "హిందీలో కుటుంబ కథలు పూర్తిగా కనుమరుగైపోయాయి.

## 'వారణాసి' గ్లింప్స్.. అక్కడ ఫస్ట్ ఇండియన్ సినిమాగా రికార్డు

రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా రానున్న చిత్రం 'వారణాసి'. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులు దీనికోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ చిత్రం తాజాగా సరికొత్త రికార్డును తన ఖాతాలో వేసుకుంది. జనవరి 5న ఈ సినిమా టైటిల్ టీజర్‌ను పారిస్‌లోని లే గ్రాండ్ రెక్స్ థియేటర్‌లో ప్రదర్శించారు. ఇంటర్నేషనల్ ఆడియన్స్ నుంచి ఆ వీడియోకు మంచి స్పందన వచ్చింది. ఈ విషయం తెలుపుతూ లే గ్రాండ్ రెక్స్ తన అధికారిక సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టింది. దీంతో అక్కడ ప్రదర్శించిన తొలి భారతీయ సినిమా గ్లింప్స్‌గా 'వారణాసి' రికార్డు నెలకొల్పింది. ఇది ఇండియన్ సినిమాకు గొప్ప గుర్తింపు అని అభిమానులు భావిస్తున్నారు. గతంలో రజనీకాంత్ 'కబాలి', ప్రభాస్ 'బాహుబలి 2', 'సాహో' చిత్రాలను ఈ థియేటర్‌లో ప్రదర్శించారు. అయితే విడుదలకు ముందే భారీ స్థాయిలో గ్లింప్స్ లాంచ్ ఈవెంట్ జరగడం ఇదే తొలిసారి కావడం విశేషం. యాక్షన్ అడ్వెంచర్ మూవీగా 'వారణాసి' సిద్ధమవుతోంది. ఇందులో మహేశ్‌బాబు 'రుద్ర' పాత్రలో నటిస్తోన్న విషయం తెలిసిందే. ఈ పవర్‌ఫుల్ పాత్ర కోసం ఆయన ప్రాచీన భారత యుద్ధ కళ కలరిపయట్టు నేర్చుకున్నారు. ఇందులో కొన్ని సన్నివేశాల్లో ఆయన రాముడిగానూ కనిపించనున్నారు. మందాకిని పాత్రలో ప్రియాంక చోప్రా, కుంభ పాత్రలో మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ నటిస్తున్నారు.



**విడుదల తేదీ వైరల్..**

ఐమ్యాక్స్ వెర్షన్‌లోనూ రూపొందుతున్న ఈ సినిమా 2027 వేసవిలో విడుదల కానుంది. ఈ చిత్రాన్ని 120 దేశాల్లో రిలీజ్ చేయాలని రాజమౌళి ప్లాన్ చేస్తున్నారు.



ఒకప్పుడు చందమామను చూపిస్తూ.. గోరుముద్దలు తినిపించేది అమ్మ! పిల్లాడు ఆరోగ్యంగా పెరిగేవాడు. ఇప్పుడు.. సెల్‌ఫోన్ చేతికిచ్చి, ముద్దలు తినిపిస్తుంది. నాన్నేమో.. ట్యాబ్ చూపిస్తూ లాల పోస్తున్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో ఎదుగుతున్న చిన్నారులను.. పసితనంలోనే అనేక రుగ్మతలు చుట్టుముడుతున్నాయి. పెరుగుతున్న సాంకేతికత కొన్నిరకాల వ్యాధులకు కారణం అవుతున్నది. అందులో ఒకటి ఆటిజం. సెల్‌ఫోన్లు, ట్యాబ్‌ల వాడకం పెరిగేకొద్దీ ఆటిజం సమస్య హెచ్చుతున్నది.

# ఎండల్లో తప్పే చేయకండి!

ఎండాకాలం వచ్చిందంటే చర్మానికీ, శరీరానికీ అవసరాలు మారతాయి. దానికి తగ్గట్టు కొన్ని విషయాల్లో మనమూ మారతాం. అక్కడే తప్పు చేసే అవకాశం ఉంది. ఇవి అవసరాలు కాదు, అనర్థాలు అంటున్నారు చర్మ, ఆరోగ్య నిపుణులు.

### ఇంట్లో అక్కర్లేదు

సన్‌స్క్రీన్ బయటికెళ్లేప్పుడు మాత్రమే రాసుకోవాలి. ఇంట్లో ఉన్నా, కారులో వెళ్తున్నా అక్కర్లేదు అనుకోవడం అపోహ మాత్రమే. మనం ఎక్కడ ఉన్నా మన చుట్టూ ఉండే వెలుతురులో చర్మానికి హాని చేసే అతినీల లోహిత కిరణాలు ఉంటాయి. కాబట్టి తప్పకుండా ఈ సమయంలో సన్‌స్క్రీన్ వాడాలి.

### కడుగుతూనే ఉండాలి


ఎండాకాలం వచ్చిందంటే అదేదో యాడ్‌లో 'కడుగు బాబు కడుగు' అన్నట్టు మొహాన్ని మాటిమాటికీ నీళ్లతో కడుగుతుంటారు. ఇది ఎండవేళ చర్మానికి హాయిని కలిగించి, తేమగా ఉంచుతుందని అనుకుంటారు. కానీ ఇది నిజం కాదు. ఇలా మాటిమాటికీ నీటితో చర్మాన్ని కడగడం వల్ల 'ట్రాన్స్ ఎపిడెర్మల్ వాటర్ లాస్ (టీఈడబ్ల్యూఎల్)' అని పిలిచే ప్రత్యేక పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో చర్మం తేమను కోల్పోయి పొడిబారుతుంది.

### అదైతే చాలు

వేసవిలో ఏ వీధి మూలన చూసినా మజ్జిగ, పుదీనా రసం కుండలు, జీరా నీళ్లు, నిమ్మరసాలు దొరుకుతుంటాయి. ఎండవేళ చలువ చేస్తాయన్న ఉద్దేశంతో వాటిని స్వేచ్ఛగా తాగుతుంటారు. కానీ, ఇలా బయట దొరికేవి తాగేప్పుడు అక్కడ ఎంత పరిశుభ్రత పాటిస్తున్నారు, ఎలాంటి నీళ్లు వాడుతున్నారులాంటివి గమనించాలి. లేకపోతే పొట్టకు లేనిపోని తంటా తెచ్చినట్టే.

### అన్నీ తాగొచ్చు

ఎండవేళ శరీరంలో నీటి స్థాయుల్ని నిలిపి ఉంచేందుకు ద్రవాలు ఎక్కువగా తీసుకోవాలి. కాబట్టి మంచీ చెడులతో సంబంధం లేకుండా ఏమైనా తాగొచ్చు అనుకోవడం పొరపాటు. కేవలం మజ్జిగ, కొబ్బరినీళ్ల లాంటి సంప్రదాయ ఆరోగ్యకర పానీయాలకే ప్రాధాన్యం ఇవ్వాలి. మిల్క్‌షేక్‌లు, శీతల పానీయాల్లాంటి హై క్యాలరీ డ్రింకులను ఏ కాలంలో అయినా పక్కన పెట్టేయాల్సిందే.



# ఆటిజం.. అరువు తెచ్చుకుంటున్నం!

మన దేశంలో ప్రతి 80మంది చిన్నారుల్లో ఒకరికి ఆటిజం సమస్య ఉండవచ్చనేది ఒక అంచనా. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని ఆటిజంపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏటా ఏప్రిల్ 2న 'వరల్డ్ ఆటిజం అవేర్‌నెస్ డే' నిర్వహిస్తున్నది. అసలు ఈ ఆటిజం అంటే ఏంటి, అది ఎందుకు వస్తుంది, రావడానికి గల కారణాలేంటి? దాని లక్షణాలు, ఆటిజం వల్ల పిల్లల్లో ఎలాంటి అనారోగ్యం ఏర్పడుతుంది? ఈ సమస్యను ఎలా గుర్తించాలి, నిర్ధారణ పద్దతులు, చికిత్సా విధానం తదితర అంశాలను నేటి ఊపిరిలో తెలుసుకుందాం.

**ఆటిజం** అనేది బయటికి కనిపించే ఒక రకమైన మానసిక వ్యాధి లక్షణం. చాలా ఆటిజం కేసుల్లో మాటలు మొదట్లో వస్తాయి. కానీ రెండేండ్లు వచ్చేసరికి మాటలు ఆగిపోతాయి. దీనినే 'రిగ్రెషన్' అంటారు. చాలామంది పిల్లల్లో మొదటి రెండేండ్లలోపే ఇది జరుగుతుంది. ఆటిజం సమస్య ఉన్న చిన్నారుల్లో నాలుగైదు ప్రధాన లక్షణాలు కనిపిస్తాయి.

1. భావ వ్యక్తీకరణ లేకపోవడం. అది భాష పరంగా గానీ, హావభావాలు వ్యక్తపరచడంలో గానీ సమస్య ఉంటుంది. అంటే వాళ్లు సరిగ్గా మాట్లాడలేరు.
2. ఇతరుల భావాలను గ్రహించలేరు. అంతేకాదు వారి భావోద్వేగాలను వ్యక్తపర్చలేరు.
3. సామాజిక బాంధవ్యాలు తెలియదు. అంటే ఇతరులతో కలిసి ఆడుకోవడం, కలివిడిగా ఉండటానికి ఇష్టపడరు. ఒంటరిగా ఉండాలని కోరుకుంటారు.
4. చేసిన పనినే మళ్లీ మళ్లీ చేస్తుంటారు.
5. ఈ చిన్నారుల్లో మానసిక పరిణతి తక్కువగా ఉంటుంది.

ఈ లక్షణాలన్నీ ఆటిజం పిల్లల్లో ప్రాథమికంగా కనిపిస్తుంటాయి. ఈ సమస్యలతో సతమతమవుతున్న వారిని ఆటిజం బాధితులుగా పరిగణిస్తారు.



### కారణాలు

- ఆటిజం సమస్యకు ఒక ప్రత్యేకమైన కారణమని ఏదీ లేదు. సాధారణంగా 9 నెలల నుంచి 18 నెలలు వచ్చే వరకు పిల్లలు భావాలను వ్యక్తీకరించడంతో పాటు, గ్రహించడం, భాష నేర్చుకోవడం చేయగలుగుతారు. ఈ వయసులో చిన్నారులకు ఫోన్‌లు, టీవీ, ట్యాబ్ లాంటివి అలవాటు కావడం వల్ల భావ వ్యక్తీకరణ, భాష నేర్చుకోవడం దెబ్బతింటుంది. స్క్రీన్ టైమ్‌కి అలవాటు పడితే ఈ సమస్యలు వస్తాయి.

అమెరికన్ పీడియాట్రిక్ సొసైటీ ప్రకారం మొదటి 3 సంవత్సరాల వరకు పిల్లలను ఫోన్, టీవీకి దూరంగా ఉంచడం మంచిది. వాటికి అలవాటుపడితే ఆటిజం వచ్చే ప్రమాదం ఉందని సదరు సొసైటీ హెచ్చరించింది.

- బహుళ భాషలను నేర్చుకోవాల్సి రావడమూ పిల్లల్లో ఆటిజం సమస్యకు కారణం కావొచ్చు. చిన్నారులకు మాటలు వచ్చే క్రమంలో.. తల్లిదండ్రులు వేర్వేరు భాషల్లో మాట్లాడటం వల్ల, పిల్లలకు ఏ భాషను స్వీకరించాలో అర్థం కాదు. వాళ్లు అయోమయానికి గురై భాషపై పట్టుచిక్కకపోవడం వల్ల ఆటిజానికి గురయ్యే అవకాశాలు ఉంటాయి.
- యాంటీ బయోటిక్స్ లాంటి ఔషధాలు ఎక్కువగా వాడటం కూడా ఆటిజానికి దారి తీయొచ్చు.
- ఐవీఎఫ్ ద్వారా జన్మించిన పిల్లల్లో కూడా ఆటిజం రిస్క్ కనిపిస్తున్నది.
- 18 నెలల వయసులో పిల్లలకు ఇచ్చే ఎంఎంఆర్ టీకా వల్ల కూడా ఆటిజం వస్తుందనేది ప్రజల్లో ఉన్న ఒక అపోహ మాత్రమే. దానికి సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి ఆధారాలు లేవు.

గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. పిల్లల పెంపకంలో పెద్దల పాత్ర అధికంగా ఉండేది. అమ్మమ్మ, నానమ్మ, తాతయ్య, మేనమామ, అత్తయ్య, చిన్నాన్న, పిన్ని... ఇలా ఎవరో ఒకరు పిల్లలతో సమయం గడిపేవారు. అప్పట్లో సెల్‌ఫోన్‌లు, ట్యాబ్‌ల ఊసే లేదు. మనుషుల మధ్య కమ్యూనికేషన్ ఎక్కువగా ఉండేది. నిరంతరం వారి మధ్య ఉండటం వల్ల పిల్లల్లో భాషా వికాసం బాగా ఉండేది. హావభావాల వ్యక్తీకరణతో పాటు మానసిక పురోగతిలోనూ వయసుకు తగ్గ పరిణతి కనిపించేది. కానీ, ఇప్పుడు ఉమ్మడి కుటుంబాల ఉనికి గణనీయంగా తగ్గిపోయింది. నూటికి 90 శాతం న్యూక్లియర్ ఫ్యామిలీలే ఉంటున్నాయి. దీనికితోడు తల్లిదండ్రులు ఇద్దరూ ఉద్యోగాలు చేయడం వల్ల పిల్లలు అధిక సమయం ఒంటరిగా గడపాల్సి వస్తున్నది. మనుషులతో కన్నా డిజిటల్ కమ్యూనికేషన్ ఎక్కువైంది. ఏడాది వయసున్న పిల్లలు కూడా సెల్‌ఫోన్, ట్యాబ్‌తో ఆడుకోవడం కనిపిస్తున్నది. ఇలాంటి పరిస్థితులు సైతం ఆటిజానికి దారితీసే అవకాశాలు లేకపోలేదు.

### లక్షణాలు

- పిల్లలు తల్లిదండ్రుల కండ్లలోకి కూడా నేరుగా చూడలేకపోవడం
- పేరుపెట్టి పిలిచినా వెంటనే స్పందించకపోవడం
- ఇతర పిల్లలతో కలిసి ఆడుకోకపోవడం
- ఒంటరిగా ఉండేందుకే ఇష్టపడటం
- ఒకే రకమైన బొమ్మతో మాత్రమే ఆడుకోవడం, మరో బొమ్మ ఇస్తే తీసుకోకపోవడం
- కొందరు పిల్లల్లోనైతే స్పర్శ, వాసన, చూపు, వినికిడి వంటి జ్ఞానేంద్రియ వ్యవస్థ అసంబద్ధంగా ఉంటుంది.

ఈ లక్షణాలన్నీ మొదటి మూడు సంవత్సరాల్లోపు కనిపిస్తాయి.

### రోగ నిర్ధారణ పద్ధతులు

**ప్రత్యేక** లక్షణాలు కనిపించిన వెంటనే సంబంధిత వైద్యులను సంప్రదించాలి. ఆటిజాన్ని నిర్ధారించేందుకు ఇప్పటి వరకు ప్రపంచ వ్యాప్తంగా ఎలాంటి వైద్య పరిజ్ఞానం గానీ, రోగ నిర్ధారణ పద్ధతులు గానీ అందుబాటులో లేవు. కేవలం అనుభవజ్ఞులైన సైకాలజిస్టులు, సైకియాట్రిస్టులు మాత్రమే సమస్యను కొన్ని రకాల పరీక్షల ద్వారా నిర్ధారించగలరు.

### చికిత్సా పద్ధతులు

ఆటిజానికి సంబంధించిన లక్షణాలను ఎంత త్వరగా గుర్తించి, సరైన థెరపీలను అందించగలిగితే అంత మంచిది. 6 నెలల్లోనే 50 శాతం సమస్యను నివారించవచ్చు. కనీసం 3 సంవత్సరాల్లోపు సమస్యను గుర్తించి చికిత్స అందిస్తేనే ఫలితం ఉంటుంది. ఈ 3 సంవత్సరాల గోల్డెన్ టైమ్ దాటిపోతే ఎలాంటి చికిత్సలు అందించినా ఫలితం ఆశించిన మేరకు ఉండకపోవచ్చు. ఆటిజం బాధిత చిన్నారులకు ప్రధానంగా మూడు రకాల థెరపీలతో చికిత్స అందిస్తారు. అందులో 1.ఆక్యుపేషనల్ థెరపీ 2. బిహేవియర్ థెరపీ 3. స్పీచ్ థెరపీ

### 1.ఆక్యుపేషనల్ థెరపీ:

పిల్లల్లో ప్రారంభ దశలో జ్ఞానేంద్రియాలు అసంబద్ధంగా ఉన్నట్లు గుర్తిస్తే, ఆక్యుపేషనల్ థెరపీ అందించవచ్చు. దీని వల్ల ఐదు జ్ఞానేంద్రియాలు నియంత్రణలోకి వచ్చి, సమస్య దాదాపుగా పరిష్కారమవుతుంది.



### 2.బిహేవియర్ థెరపీ:

బిహేవియర్ థెరపీతో పిల్లల అసాధారణ ప్రవర్తనకు సంబంధించిన సమస్యలు పరిష్కరించవచ్చు.


### 3. స్పీచ్ థెరపీ:

ఆటిజం పిల్లల విషయంలో స్పీచ్ థెరపీ చాలా ముఖ్యమైంది. మొదటి రెండు థెరపీలు... అంటే ఆక్యుపేషనల్ థెరపీ, బిహేవియర్ థెరపీల తర్వాతే స్పీచ్ థెరపీ ఇవ్వాల్సి ఉంటుంది. అప్పుడే ఇది ప్రభావవంతంగా పనిచేస్తుంది.

### సలహాలు

- ప్రారంభ దశలోనే గుర్తించి నిపుణులైన వైద్యులను సంప్రదించాలి.
- మూడేండ్లలోపు పిల్లలను బ్లూ లైట్‌కు దూరంగా ఉంచాలి. అంటే సెల్‌ఫోన్స్, ట్యాబ్స్, టీవీలు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలు ఇవ్వకూడదు.
- పిల్లలకు ఎలక్ట్రానిక్ పరికరాలు ఇచ్చి, ఒంటరిగా వదిలేయకుండా వారితో తల్లిదండ్రులు లేదా ఇతర కుటుంబ సభ్యులు గడపడం ఉత్తమం.





# నిద్రలోనూ సుఖం లేదు!

**శారీరక** శ్రమకు, మానసిక ఆందోళనకు చక్కని ఔషధం నిద్ర. ఆరు గంటలు ఆదమరచి నిద్దరోతే.. సమస్యలన్నీ పరారైన అనుభూతి కలుగుతుంది. కానీ, సుఖమెరుగని నిద్ర.. అతివలకు అంతగా అందడం లేదని సర్వేల సారాంశం. స్లీప్ ఫౌండేషన్ ఇచ్చిన నివేదిక.. పురుషుల కన్నా స్త్రీలు నిద్రలేమితో ఎక్కువగా బాధపడుతున్నారని తేల్చింది. ఉద్యోగం, ఇల్లు, పిల్లలు, ఇతర బాధ్యతలతో మల్టీ టాస్కింగ్ చేస్తున్న మహిళలు సరైన నిద్ర లేక సతమతమవుతున్నారని నివేదిక సారాంశం. ఇందుకు కారణాలూ లేకపోలేదు. రుతుక్రమంలో ఈస్ట్రోజెన్, ప్రొజెస్టిరాన్లలో హెచ్చుతగ్గులు నిద్రకు భంగం కలిగిస్తాయి. ముఖ్యంగా రుతుస్రావం ముందు, మెనోపాజ్ సమయంలో వేడి ఆవిర్లు, రాత్రి చెమటలు నిద్రను భంగపరుస్తున్నాయని పరిశోధకులు తేల్చారు. అంతే కాదు గర్భిణిగా ఉన్నప్పుడు హార్మోన్లలో చోటుచేసుకునే మార్పుల కారణంగా శారీరక అసౌకర్యం ఏర్పడుతుంది. ఇది నిద్ర నాణ్యతపై గణనీయంగా ప్రభావం చూపుతుందట. ఈ నిద్రలేమి హృదయ సంబంధ వ్యాధులు, మానసిక రుగ్మతలకు దారి తీస్తుందని ఆరోగ్యరంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సుఖనిద్రకు తగ్గ ఏర్పాట్లు చేసుకోవడం అవసరమని సూచిస్తున్నారు.

# స్నానం తర్వాత బ్రషింగా?

**ఒక్కోసారి** హడావుడిగా, ఏదో ఆలోచనలో ఉండి బ్రష్ చేసుకోలేదనే విషయం మరిచిపోయి స్నానం చేసేస్తుంటాం. తర్వాత గుర్తొచ్చి అప్పుడు బ్రష్ చేసుకుంటాం. ఇది ఎప్పుడో పొరపాటున ఒకసారి జరిగితే పర్వాలేదు. కానీ, అదే అలవాటుగా మారితే మాత్రం చర్మానికి నష్టమేనని హెచ్చరిస్తున్నారు ఆరోగ్య నిపుణులు. మనం పళ్లు తోముకున్నప్పుడు బ్యాక్టీరియా నోటి నుంచి చర్మం మీదకు చేరే ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల నోటి చుట్టూ, గడ్డం చుట్టూ ఇరిటేషన్ వచ్చే అవకాశం ఉంటుంది. తర్వాత అది నెమ్మదిగా మొటిమలకు కారణమవుతుంది. బ్రష్ చేసే సమయంలో చర్మం మీదికి బదిలీ అయిన బ్యాక్టీరియా వల్ల చర్మం మీద పగుళ్లు కూడా ఏర్పడవచ్చని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అందుకే స్నానానికి ముందే బ్రష్ చేసుకోవడం సురక్షితం. ఒక వేళ స్నానం తర్వాత బ్రష్ చేయాల్సి వస్తే ముఖాన్ని మరోసారి సబ్బుతో లేదా ఫేస్‌వాష్‌తో శుభ్రం చేసుకోవాలని సూచిస్తున్నారు.



# ముందే తినేయాలి!

రోజూ వీలైనంత త్వరగా భోజనంచేస్తే గుండె రక్తనాళాల వ్యాధుల ముప్పు తగ్గుతుందట. నేచర్ కమ్యూనికేషన్స్ జర్నల్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనం కోసం పరిశోధకులు 1,03,389 మంది నుంచి ఆహార విధానాలు, గుండె రక్తనాళాల జబ్బులకు సంబంధించిన సమాచారం సేకరించారు. వీరిలో 79 శాతం మంది మహిళలే. పరిశోధనలో పాల్గొన్నవాళ్ల సగటు వయసు 42 ఏండ్లు..

**వయసు,** లింగం, కుటుంబ పరిస్థితి మొదలైన సామాజిక పరిస్థితులు, ఆహారంలో పోషకాల నాణ్యత, జీవనశైలి, నిద్రా చక్రాన్ని పరిశోధకులు పరిగణనలోకి తీసుకున్నారు. పొద్దున్నే టిఫిన్ చేయకుండా భోజనం చేసేవారిలో ఒక్కో గంట ఆలస్యానికి గుండె రక్తనాళాల వ్యాధుల తీవ్రత 6 శాతం పెరుగుతుందని పరిశోధకులు కనుక్కొన్నారు. అంటే పొద్దునే 9 గంటలకు తినే వ్యక్తికి 8 గంటలకే తిన్న వ్యక్తితో పోలిస్తే గుండె రక్తనాళాల జబ్బుల ముప్పు 6 శాతం ఎక్కువగా ఉంటుందన్న మాట. 9 తర్వాత ఒక్కో గంట గడుస్తుంటే ఈ ముప్పు 28 శాతం ఎక్కువగా ఉంటుందని అధ్యయనం వెల్లడించింది. అయితే, ముందురోజు రాత్రి చివరి భోజనానికి, తర్వాతి రోజు ఉదయం భోజనానికి మధ్య విరామం ఎక్కువగా ఉంటే గుండె రక్తనాళాల వ్యాధుల ముప్పు తక్కువట. అలా ఈ పరిశోధన రోజూ పొద్దున, సాయంత్రం భోజనాలు వీలైనంత త్వరగా ముగించేయాలని వెల్లడిస్తున్నది. గ్లోబల్ బర్డన్ ఆఫ్ డిసీజెస్ అధ్యయనం ప్రకారం ప్రపంచ ప్రజల్లో మరణాలకు కారణమయ్యే వ్యాధుల్లో గుండె రక్తనాళాల సమస్యలే ముందువరుసలో ఉన్నాయి.



2019లో గుండె సమస్యలతో 18.6 మిలియన్ల మంది మరణించారు. వీటిలో 7.9 శాతం మరణాలకు ఆహారపు అలవాట్లే ప్రధాన కారణంగా నిలిచాయి. అంటే... ''ఈ తరహా వ్యాధుల పుట్టుక, అభివృద్ధిలో ఆహారం కీలకపాత్ర పోషిస్తున్నదని తెలుస్తుంది. పశ్చిమ దేశాల సమాజాల ఆధునిక జీవనశైలి రాత్రి భోజనం మరీ ఆలస్యంగా చేయడం, పొద్దునే టిఫిన్ తీసుకోకపోవడం మొదలైన ఆహారపు అలవాట్లకు దారితీసింది. అయితే, ఉదయం, రాత్రి భోజనాలు వీలైనంత తొందరగా ముగించుకునే అలవాట్లను స్వీకరిస్తే గుండె రక్తనాళాల వ్యాధుల ముప్పు తగ్గించుకోవచ్చు'' అని పరిశోధకులు పేర్కొన్నారు.

# గ్లైఫోసేట్.. గర్భిణులకు ముప్పు

**గ్లైఫోసేట్‌ను** పంటల్లో కలుపు నివారణకు వాడతారు. ఇది పంటలకు హాని కలిగించకుండానే కలుపును నిర్మూలిస్తుంది. కాబట్టి, రైతులు దీన్ని విస్తృతంగా వాడుతున్నారు. ఏండ్ల తరబడి జరిగిన అధ్యయనాల ద్వారా గ్లైఫోసేట్ మనుషుల్లో క్యాన్సర్‌కు కారణం కావచ్చని భావిస్తున్నారు. ఆహారం రూపంలో అంతగా హాని కలిగించనప్పటికీ గ్లైఫోసేట్ ఆధారిత రసాయనాలు మనుషులను వివిధ రకాలుగా ప్రభావితం చేస్తాయి. చర్మం మండుతుంది. శ్వాసిస్తే ముక్కు రంధ్రాల్లో ఇబ్బందిగా ఉంటుంది. కొన్నిసార్లయితే తీవ్రతను బట్టి కాలేయం, కిడ్నీల పనితీరును దెబ్బతీస్తుంది. మరణం కూడా సంభవించవచ్చు. అంతేకాదు... గ్లైఫోసేట్ గర్భిణుల మీద మరింత దుష్ప్రభావం చూపుతుంది. గర్భధారణ సమయం ఏ కొంచెం తగ్గినా కూడా పుట్టబోయే శిశువు జీవితంపై ప్రతికూల ప్రభావాలకు దారితీస్తుంది. పైగా బిడ్డ పుట్టకముందే శాశ్వత నష్టం కూడా జరగవచ్చు. బిడ్డ పుట్టిన తర్వాత కూడా శరీర పెరుగుదలకు సంబంధించిన సమస్యలు తలెత్తుతాయి. గర్భిణులపై గ్లైఫోసేట్ ప్రభావం గురించి అమెరికాకు చెందిన 'ది ఎన్విరాన్‌మెంటల్ హెల్త్ యూనిట్' జరిపిన సర్వేలో ఈ వివరాలు తెలిశాయి.



అధ్యయనం కోసం పరిశోధకులు 18– 40 సంవత్సరాల మధ్య వయసున్న 77 మంది మహిళల్ని ఎంచుకున్నారు. వీరిని 2015 జూన్ నుంచి 2016 జూన్ వరకు పరీక్షించారు. వీరి మూత్రం నమూనాల్లో దాదాపు 93 శాతం మందిలో గ్లైఫోసేట్ అవశేషాలు చెప్పుకోదగ్గ స్థాయిలో ఉన్నట్టు గుర్తించారు. పట్టణ మహిళలతో పోలిస్తే గ్రామీణుల్లో ఈ సమస్య ఎక్కువగా ఉన్నట్టు ఈ అధ్యయనంలో తేలింది. మొదట్లో దీనికి కారణం నీళ్లు కావచ్చని అనుకున్నారు. కానీ కలుపు నివారణకు గ్లైఫోసేట్ వాడటం వల్ల ఆయా పంటలను ఆహారంగా తీసుకోవడంతో ఈ దుస్థితి దాపురించిందని ఇప్పుడు అనుమానిస్తున్నారు. ఇది చిన్న అధ్యయనమే అయినప్పటికీ ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండాలనేది పరిశోధకుల హెచ్చరిక. మరో విషయం... గర్భిణులు తమ తొలి మూడు నెలల కాలంలో ఈ కలుపు నివారిణికి దూరంగా ఉండాలంటున్నారు పరిశోధకులు. లేదంటే తల్లిపాల ద్వారా కలుపుమందు అవశేషాలు పిల్లలకు చేరుకుంటాయి. కాబట్టి, రైతులు కూడా గ్లైఫోసేట్‌కు ప్రత్యామ్నాయాలను వాడాలి. గర్భిణులు తొమ్మిది నెలలపాటు ఈ కలుపుమందు ప్రభావం అసలే పడకుండా జాగ్రత్త వహించాలని పరిశోధకులు సూచిస్తున్నారు.

# సంగారెడ్డి సదాశివపేట మున్సిపాలిటీలపై కాంగ్రెస్ జెండా ఎగరాలి

**: టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి**

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జనవరి 06: సంగారెడ్డి సదాశివపేట మున్సిపాలిటీలను కాంగ్రెస్ జెండా ఎగరవేయాలని మాజీ ఎమ్మెల్యే టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర గార్డెన్ లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడారు. వచ్చే మూడేళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని పార్టీ అభ్యర్థులు గెలిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని వెల్లడించారు. అభ్యర్థుల ఎంపిక కార్యకర్తలకే వదిలేస్తున్నట్లు పేర్కొన్నారు. రిజర్వేషన్లకు అనుగుణంగా అభ్యర్థులను ఎంపిక చేసుకోవాలన్నారు. గెలిచినా ఓడిన వారే పూర్తి



బాధ్యత వహించాలన్నారు. ఇక కొత్తగా పార్టీలో చేరిన వారికి కౌన్సిలర్ టికెట్ ఇచ్చేది లేదన్నారు. పది సంవత్సరాలు అధికారంలో లేనప్పుడు పార్టీలో ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అసెంబ్లీ పార్లమెంటు ఎన్నికల ముందు పార్టీలోకి వచ్చిన వారికి రెండవ ప్రాధాన్యత ఉంటుందన్నారు. నేను బిఆర్ఎస్ లో ఉన్నప్పుడు కాంగ్రెస్ రూలింగ్ లో ఉందని ఆ సమయంలో సంగారెడ్డి సదాశివపేట మున్సిపాలిటీల చైర్మన్ స్థానాలు టిఆర్ఎస్ గెలిచిందని స్పష్టం చేశారు. స్వయంకృషితో నేను బిజెపి నుంచి సంగారెడ్డి మున్సిపల్ చైర్మన్గా గెలిచినానన్నారు. జీవితమంతా ప్రజాసేవకే అంకితమన్నారు. నేను మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి రానని ఎవరు పిలవద్దని సూచించారు. ఇక సంగారెడ్డి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా కూడా సంతోష్ పేరు ప్రకటించారు. బీసీ అయిన బీసీ మహిళ అయినా జనరల్ అయినా కూనా సంతోష్ పేరే ఉంటుందన్నారు. వైస్ చైర్మన్ అభ్యర్థిగా షఫీ ఆఫీస్ పేరు ప్రకటించారు. ఒకవేళ ఎస్సీకి రిజర్వేషన్ అయితే మహేష్ లాల్ చైర్మన్ గా ఉంటాడన్నారు. ముఖ్యంగా కమిటీలు ఫైనల్ చేసిన అభ్యర్థులే పోటీల్లో నిలుస్తారని ప్రకటించారు. ఎవరు టికెట్ కోసం గాంధీభవన్ వెళ్లి పీసీసీ ప్రెసిడెంట్ ను కలిసి ఇబ్బంది పెట్టొద్దని సూచించారు. సదాశివపేట ఎస్సీ రిజర్వ్ అయితే చిరు చైర్మన్ అభ్యర్థిగా ఉంటాడని ప్రకటించారు. ఒకవేళ సొంత పార్టీ అభ్యర్థులను ఓడించే ప్రయత్నానికి పాల్పడితే ఎన్నికల సమయమని చూడకుండా సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. కార్యక్రమంలో టీజీఐసీ చైర్ పర్సన్ నిర్మల, కాంగ్రెస్ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సూర్యాపేట జిల్లా కేంద్రంలో ప్రెస్ క్లబ్ భవన్ నిర్మించాలి

**: టీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు- కందుకూరి యాదగిరి**

సూర్యాపేట (భారతశక్తి జిల్లా ప్రతినిధి)జనవరి 6: ఎంతో పోరాట చరిత్ర కలిగిన ఉద్యమ చరిత్ర కలిగిన సూర్యాపేట జిల్లా కేంద్రంలో జర్నలిస్టుల ఆత్మగౌరవ ప్రతీక సొంత "ప్రెస్ క్లబ్" భవనం లేకపోవడం విచారకరమని సీనియర్ పాత్రికేయులు భూపతి రాములు గౌడ్, సుంకర బోయిన వెంకటయ్య యాదవ్ అన్నారు.సోమవారం తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా కేంద్రంలో పాత బస్టాండు నుండి పీఎస్ఆర్ సెంటర్ వాణిజ్య భవనం శంకర్ విలాస్ సెంటర్ మీదుగా గాంధీ బొమ్మ వరకు నిర్వహించిన శాంతియుత పాదయాత్రకు వారు మద్దతు నిచ్చి మాట్లాడారు.జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం అయ్యేందుకు అసోసియేషన్లకు యూనియన్లకు అతీతంగా ఎవరు జర్నలిస్టుల సంక్షేమం కోసం ఉద్యమాలకు పిలుపునిచ్చిన తాము తప్పకుండా పాల్గొంటామని తెలిపారు.ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు.ఈ సందర్భంగా అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కందుకూరి యాదగిరి మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా కేంద్రంలో సొంత భవనం




లేక జర్నలిస్టులు చెట్ల కింద ప్రైవేటు భవనాల కింద హోటలలో టీ స్టాల వద్ద గడపాల్సిన దుస్థితి ఏర్పడిందని సమాజానికి అక్షరాల కాంతులను నింపి ప్రజలను చైతన్య పరుస్తున్న ఫోర్త్ ఎస్టేట్ గా కొనసాగుతున్న మీడియా ప్రతినిధులకు నిలువనీయుడా లేకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.అదేవిధంగా అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలాలు ఇందిరమ్మ ఇండ్లు ఇన్సూరెన్సులు ఇవ్వాలని కోరారు. వర్కింగ్ లో ఉన్న ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డులు ఇచ్చి దాని ద్వారా రాష్ట్రంలో ఎక్కడికైనా ఎలాంటి చార్జీలు లేకుండా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.ఇంకా జర్నలిస్టులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని అవన్నీ పరిష్కరించే వరకు తాము దఫలవారీగా ఉద్యమం చేపడతామని తెలంగాణ సాధించుకోవడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమైందని ప్రభుత్వాలు నిలబడాలన్న కూలిపోవాలన్న జర్నలిస్టుల పాత్ర ఎంతో ఉంటుందని దీన్ని గుర్తుచేసుకొని ప్రభుత్వం జర్నలిస్టులను విస్మరించకుండా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించే కొనేందుకు అన్ని యూనియన్ల వారు కలిసి రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టీఎస్జెఏ అసోసియేషన్ జర్నలిస్టులతో పాటు ఇతర యూనియన్లకు సంబంధించిన పలువురు సీనియర్ జర్నలిస్టులు, తదితరులు పాల్గొన్నారు.




## అక్షర టౌన్ షిప్ లో

# ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం

* **కెనాల్స్ అస్థిత్వం కోల్పోయే ప్రమాదం?**
* **డి93 కెనాల్ నుంచి దిగువకు నిరంధే పరిస్థితి లేదు.**
* **అధికారుల తీరుపై ప్రజల అసంతృప్తి**

కరీంనగర్, జనవరి 6(భారతశక్తి ప్రతినిధి): కరీంనగర్ కార్పొరేషన్ కు అతి సమీపంలోని అక్షర టౌన్ షిప్ పేరిట వెంచర్ వెలిసింది. ఈ టౌన్ షిప్ విషయంలో ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడానికి కారణమేంటీ..? తమ పరిధిలోని కెనాల్స్ పరిరక్షణతో పాటు ఆయాకట్టు కు నీరందించే బాధ్యతలను నిర్వర్తించాల్సిన అధికారులు అంటీ ముట్టనట్టుగా నడుచుకుంటున్న తీరు విస్మయానికి గురి చేస్తోంది. కెనాల్స్ అస్థిత్వం కోల్పోయే ప్రమాదం ఉన్నప్పటికీ తీవ్రంగా పరిగణించకపోవడం వెనక ఆంతర్యం ఏంటన్నదే మిస్టరీగా మారింది. అక్షర టౌన్ షిప్ పై భారతశక్తి ప్రతినిధి అందిస్తున్న ప్రత్యేక కథనం...

*** అప్పుడలా...**

కరీంనగర్ రూరల్ మండలం నగునూరు దుర్గా మాత ఆలయానికి వెనక భాగం నుండి కరీంనగర్ దిగువ ప్రాంతానికి SRSP డి93 కెనాల్ నిర్మాణం చేశారు అధికారులు. ఈ డిస్ట్రిబ్యూటరీ కెనాల్ మీదుగా ఆయా కట్టుకు నీరందించే ప్రక్రియ కొనసాగుతోంది. ఈ కెనాల్ నుంచి నగునూరు, తీగలగుట్టపల్లి. వల్లంపహాడ్ గ్రామాల మీదుగా మెన్ కెనాల్ కు అనుసంధానం చేశారు. అయితే కెనాల్ ను ఆనుకుని ఉన్న భూమిలో అక్షర టౌన్ షిప్ పేరిట వెంచర్ ప్రారంభించడం సంచలనంగా మారింది. ఈ విషయం వెలుగులోకి రాగానే టౌన్ షిప్ కోసం కెనాల్ రోడ్డును శాతవాహన అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీకి చేసుకున్న దరఖాస్తులో చూపించుకున్నారని తేలింది. దీంతో ఇరిగేషన్ అధికారులు అభ్యంతరాలు చెప్పడంతో ఇక్కడ ప్లాట్ల క్రయవిక్రయాలు నిలిచిపోయాయి. వెంచర్ కోసం భూమిని చదును చేస్తున్న క్రమంలో ఛానెల్స్ కూడా ధ్వంసం అయ్యాయని తేలినప్పటికీ ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. అప్పటి ఇరిగేషన్ అధికారులు కెనాల్ మీదుగా రైతుల ముసుగులో బీటీ రోడ్డు వేస్తున్నా, ఇరిగేషన్ విభాగానికి చెందిన డిస్ట్రిబ్యూటరీ ఛానెల్స్ ధ్వంసం అయినా పట్టించుకోకపోవడం వెనక ఆంతర్యం ఏమిటన్నది అంతు చిక్కడం లేదు. ఈ విషయంపై నీటి పారుదల శాఖ అధికారులు శాఖ పరంగా విచారణ జరిపారో లేదో వారికే తెలియాలి. కేవలం పోలీసులకు పిర్యాదు చేసి చేతులు దులుపుకున్న తీరే విస్మయానికి గురి చేస్తోంది.

*** ఇప్పుడిలా...**

అక్షర టౌన్ షిప్ వెంచర్ విషయంలో సుడాకు లేఖ రాసి అనుమతులు రద్దు చేయాలని, తమ శాఖ నుండి నో ఆబ్జక్షన్ సర్టిఫికెట్ ఇచ్చిన తరువాతే మళ్లీ పర్మిషన్ ఇవ్వాలని కోరుతూ లేఖ రాశామని పేర్కొంటున్నారు. అయితే అక్షర టౌన్ షిప్ లో సీసీ రోడ్లతో పాటు ఇతరాత్ర నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్న తీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఎస్సారెస్పీ కెనాల్ రోడ్డు మీదుగానే మిషన్లు, సిమెంట్, కాంక్రీట్ రవాణా చేస్తున్నప్పటికీ అధికారులు అభ్యంతరం చెప్పకపోవడం ఏమిటన్నదే అంతు చిక్కకుండా పోతోంది. కేవలం వ్యవసాయ అవసరాలకు సంబంధించిన వాటిని మాత్రమే కెనాల్ రహదారి మీదుగా తరలించుకపోయేందుకు అనుమతి ఉంటుంది కానీ అక్షర టౌన్ షిప్ వెంచర్ లో నిర్మాణాలకు అవసరమైన మెటిరియల్ తీసుకెళ్తున్నా అడ్డుకోకపోవడం కానీ, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ లేఖ రాయకపోవడం వెనక అసలేం జరుగుతోందన్న చర్చ మొదలైంది. బాహాటంగానే వెంచర్ లో రోడ్ల నిర్మాణాలు చేస్తూ ప్లాట్లు విక్రయిస్తామన్న ప్రచారం కూడా చేస్తుండడం గమనార్హం. కమర్షియల్ అవసరాల కోసం కెనాల్ రోడ్డును వినియోగిస్తున్నట్టుగా కళ్లకు కట్టినట్టుగా కనిపిస్తున్నా ఇరిగేషన్ అధికారులు ఎందుకు నియంత్రించలేకపోతున్నారన్నదే విచిత్రంగా ఉంది.

*** వారంతా...**

కాలువలను పర్యవేక్షించే ఉద్యోగులు, ఇంజనీరింగ్ అధికారులు ఇంత మంది ఉన్నా అక్షర టౌన్ షిప్ లో దర్జాగా సాగుతున్న అభివృద్ధి పనులను కట్టడి చేసే వారు లేకుండా పోయారన్న ఆరోఫణలు వినిపిస్తున్నాయి. ఈ వెంచర్ లో ఇండ్ల నిర్మాణాలు ప్రారంభం అయితే రానున్న కాలంలో మిగతా భూముల్లో కూడా రియల్ ఎస్టేట్ వ్యాపారం సాగనుంది. దీనివల్ల కాలువల అస్థిత్వానికే ప్రమాదం ఏర్పడనుంది. డిస్ట్రిబ్యూటరీ కెనాల్ ద్వారా దిగువ ప్రాంతానికి సాగు నీరు అందే పరిస్థితి కూడా ఉండదు.



# రైతాంగానికి అన్ని విధాల ప్రభుత్వం అండగా ఉంటుంది

**: జిల్లా కలెక్టర్**

వైఎస్ఆర్ కడప, జనవరి 06(భారత శక్తి): ఈ ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వమని, రైతులకు అండగా ఉంటుందని జిల్లా ఇంచార్జి మంత్రి మరియు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. మంగళవారం వైఎస్ఆర్ కడప జిల్లా.. కమలాపురం నియోజక వర్గం వీరపు నాయుని పల్లె లో "ఉల్లి రైతులకు ఆర్థిక సహాయం" పంపిణీ కార్యక్రమం నకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి మరియు జిల్లా ఇంచార్జి మంత్రి ఎస్.సవిత, జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, కమలాపురం శాసన సభ్యులు పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి గార్లు విచ్చేశారు. ఈ సందర్భంగా ఇంచార్జి మంత్రి ఎస్.సవిత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో ఆర్థిక ఇబ్బందులల్లో ఉన్నప్పటికీ ఉల్లి రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకొని రైతులకు అండగా నిలబడ్డారని తెలిపారు. ఈ ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వం అనడానికి ఇదే నిదర్శనమన్నారు. ఈ ప్రాంతంలో ఉల్లి రైతుల సమస్యల పై జిల్లా కలెక్టర్, స్థానిక శాసన సభ్యులు వ్యవసాయ శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి అయిన తన దృష్టికి తీసుకొని వచ్చి అందరం కలిసి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొని వెళ్లి చర్చించామన్నారు. ఉల్లి రైతులకు నష్ట పరిహారం అందించినందులకు ముఖ్యమంత్రి కి కృతజ్ఞతలు తెలిపారు. ఉల్లి రైతులకు న్యాయం జరిగేలా వైఎస్ఆర్ కడప జిల్లా వ్యాప్తంగా 7298 మందికి నష్టపరిహారం అందిస్తున్నామని, అందులో ఎక్కువగా 70,000 రూపాయలు అందుకున్న వాళ్ళు 1592 మంది ఉన్నారని, 60,000 రూపాయలు అందుకున్న వాళ్ళు 660 మంది ఉన్నారన్నారు. జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని రైతులు బళ్ళారి రెడ్ వెరైటీ ఉల్లిని అధికంగా సాగు చేస్తారని ఈ ఉల్లి ఎగుమతి చేసేందుకు మాత్రమే అనుకూలమని రైతులు వారు పండించే పంట వల్ల లాభం మరియు



సాగు పద్దతులు తదితర అంశాల పై పూర్తి అవగాహన చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఉల్లి రైతులను ఆదుకునేందుకు మద్దతు ధరను కూడా ప్రకటించడం జరిగిందని తెలిపారు. ఉల్లి రైతుల పరిస్థితుల పై ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్ళడం జరిగిందని రైతులను ఆదుకునేందుకు గౌరవ ముఖ్యమంత్రి సూచనల మేరకు మార్కెట్ ధరలకు అనుగుణంగా అమ్ముకుని, ఎకరానికి రూ.20,000 ఇన్పుట్ సబ్సిడీ (DBT ద్వారా) అందించారు. 14,000 ఎకరాలు, 7,800 రైతులకు మొత్తం రూ.28 కోట్లు జమ చేశారన్నారు. కడప జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు డ్రిప్ ఇరిగేషన్‌కు రూ.40,00050,000 సబ్సిడీ (10% మాత్రమే చెల్లించాలి), ప్లాంటేషన్ పంటలకు (చీనీ, బత్తాయి, నిమ్మ, మామిడి) మొదటి 3 సంవత్సరాలు 90% సహాయం అందిస్తున్నారు. స్మార్ట్ వ్యవసాయం, మార్కెట్ ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నారు. కోల్డ్ స్టోరేజ్‌కు 40% సబ్సిడీ, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు రానున్నాయన్నారు. రైతులు మార్కెటింగ్ అవగాహన పెంచుకోవాలని, యూట్యూబ్, రైతు సేవా కేంద్రాల సలహాలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్య రెడ్డి మాట్లాడుతూ కడప జిల్లా రైతులకు ప్రభుత్వం అండగా నిలిచిందని, ప్రభుత్వం ఎప్పుడూ రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని అన్నారు. ఇటీవల ఉల్లి రైతులు నష్టపోయిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా పరిహారం ప్రకటించిందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత కు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెం నాయుడు కు ధన్యవాదాలు తెలిపారు.

*** మన జిల్లాకు ఈ పరిహారం రావడంలో జిల్లా కలెక్టర్ సహకారం**

ప్రత్యేక చొరవ, శ్రద్ధ చూపడంలోముఖ్యపాత్ర వహించాయన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వానికి అవగాహన చేసి చెప్పి నివేదికలు పంపడం, చర్యలు తీసుకోవడం వల్ల కడప జిల్లా రైతులకు కూడా న్యాయం జరిగిందన్నారు. అలాగే, తాము రైతు కుటుంబం నుండి వచ్చిన వారమని, రైతుల కష్టాలు ఏవో బాగా తెలుసని ఆయన పేర్కొన్నారు. "నేను కూడా రైతు బిడ్డనే చెప్పుకోవచ్చు. వర్షాలు లేకున్నా, కరువు పరిస్థితుల్లోనూ రైతు కష్టపడే ధైర్యం నాకు తెలుసు," అని తెలిపారు. రాష్ట్రంలో ఆర్థిక కష్టాలు ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం రైతుల పట్ల సానుభూతితోవ్యవహరించిందని చెప్పారు. "జిఎన్ఎస్ఎస్ కాలువ నుంచి నీరు రాకపోయినా, తక్కువ ఖర్చుతో నీటి సరఫరా చేయడానికి కలెక్టర్ సహకారంతో చర్యలు చేపట్టామన్నారు కరువు కాలంలో కూడా నీటి వనరులను సరైన విధంగా ఉపయోగించి రైతులకు ఉపశమనం కలిగించగలిగామన్నారు. చివరిగా, రైతు ప్రభుత్వానికి పునాది. రైతు బలంగా ఉంటే రాష్ట్రం బలపడుతుంది. ఈ పరిహారం కార్యక్రమం రైతుల బంధు భావానికి, ప్రభుత్వ సంకల్పానికి ప్రతీకని అన్నారు. ఈ సందర్భంగా ఉల్లి రైతుల నష్ట పరిహారానికి సంబంధించిన మెగా చెక్కును రైతులకు అందజేశారు. ఈ సమావేశంలో జిల్లా ఇంచార్జి జెసి మరియు డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడు,నాయకులు పుత్తా నరసింహారెడ్డి, భూపేష్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రా నాయక్,మార్కెటింగ్ ఏడి పరిమళ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# బంగ్లాదేశ్ లో ఒకేరోజు మూడు ఘోరాలు.. హిందువులపై ఆగని అకృత్యాలు

బంగ్లాదేశ్, జనవరి 6: బంగ్లాదేశ్ లో హిందువులపై హింసకు అంతులేకుండా పోయింది. సోమవారం ఒక్కరోజే మూడు దారుణాలు చోటుచేసుకున్నాయి. ఉదయం ఓ వితంతువుపై గ్యాంగ్ రేప్ జరగగా, సాయంత్రం ఓ జర్నలిస్టును దుండగులు కాల్చి చంపారు. రాత్రి ఓ వ్యాపారిపై కత్తులతో దాడి చేసి దారుణంగా హతమార్చారు. ఈ వరుస దారుణాలతో అక్కడి హిందువులు తీవ్ర భయాందోళనల మధ్య జీవిస్తున్నారు. స్థానిక మీడియా కథనాల ప్రకారం.. నార్సింగ్డి జిల్లా కేంద్రంలోని బ్రాహ్మండికి చెందిన శరత్ చక్రవర్తి మణి స్థానికంగా ఓ కిరాణా షాపు నడుపుతూ జీవనోపాధి పొందుతున్నాడు. మణి గతంలో దక్షిణ కొరియాకు వెళ్లి కొంతకాలం పనిచేసి వచ్చాడు. అక్కడ సంపాదించుకుని వచ్చిన సొమ్ముతో బ్రాహ్మండిలో ఓ ఇల్లు కట్టుకున్నాడు. ప్రస్తుతం కిరాణా షాపుతో వచ్చే ఆదాయంతో కుటుంబం గడుపుకుంటున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి పది గంటల సమయంలో కొంతమంది దుండగులు మణి షాపు వద్దకు వచ్చారు. వచ్చీరావడంతోనే కత్తులతో విచక్షణారహితంగా దాడి చేశారు. దీంతో మణి తీవ్ర గాయాలపాలయ్యాడు. ఆపై దుండగులు పారిపోగా.. స్థానికులు మణిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. మణిని పరీక్షించిన వైద్యులు అతడు అప్పటికే మరణించాడని ప్రకటించారు. ఈ దారుణానికి ముందు సోమవారం ఉదయం కాళీగంజ్ లో 40 ఏళ్ల హిందూ వితంతువుపై దారుణం చోటుచేసుకుంది. ఇద్దరు యువకులు ఆమెపై సామూహిక అత్యాచారం జరిపారు. చెట్టుకు కట్టేసి జుట్టు కత్తిరించారు. మరో ఘటనలో.. సాయంత్రం జశోర్ జిల్లా కాపాలియా బజార్ లో స్థానిక దినపత్రికకు ఎడిటర్ గా వ్యవహరిస్తున్న జర్నలిస్ట్ రాణా ప్రతాప్ అనే యువకుడిని దుండగులు హత్య చేశారు. కాపాలియా బజార్ లో ఓ ఐస్ ఫ్యాక్టరీని కూడా నిర్వహిస్తున్న రాణా ప్రతాప్ ను అతడి ఫ్యాక్టరీ దగ్గరే దారుణంగా కాల్చి చంపారు. సోమవారం ఒక్కరోజే మూడు దారుణాలు చోటుచేసుకున్నాయి.

## నేపాల్ సరిహద్దుల్లో ఉద్రిక్తత...
# భారత్ అప్రమత్తం

నేపాల్, జనవరి 6 (భారత శక్తి): హిమాలయ దేశం నేపాల్‌లో మతపరమైన ఘర్షణలు చెలరేగాయి. ధనుశా జిల్లాలో ఒక ప్రార్థనా స్థలంపై కొందరు దాడికి పాల్పడి, ధ్వంసం చేశారు. దీనిని సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆందోళనలు చెలరేగాయి. రాహౌల్, పర్సా ప్రాంతాల్లో ఆందోళకారులు నిరసనలకు దిగారు. ఈ క్రమంలో ఆయా ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పెద్ద సంఖ్యలో భద్రతాదళాలు రంగంలోకి దిగాయి. కొన్నిచోట్ల పరిస్థితి హింసాత్మకంగా మారడంతో స్థానిక యంత్రాంగం కఠిన చర్యలు చేపట్టింది. పలు ప్రాంతాల్లో కర్ఫ్యూ విధించారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో భారత ప్రభుత్వం అలర్ట్ అయింది. నేపాల్ తో సరిహద్దును మూసేసింది. ఎమర్జెన్సీ సేవలు మినహా, రాకపోకలను బంద్ చేసింది.

## కోనసీమలో ఓఎన్జీసీ గ్యాస్ బ్లోఅవుట్...
# ఇంకా అదుపులోకి రాని మంటలు

కోనసీమ, జనవరి 6 (భారత శక్తి): కోనసీమ జిల్లా మలికిపురం మండలం ఇరుసుమండ గ్రామంలోని ఓఎన్‌జీసీ బావిలో చెలరేగిన మంటలు రెండో రోజు కూడా అదుపులోకి రాలేదు. సోమవారం మధ్యాహ్నం మోరి 5 బావిలో రిపేర్ పనులు చేస్తుండగా అధిక పీడనంతో గ్యాస్, ముడి చమురు బయటకు చిమ్మి ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. ఈ ఘటనతో సమీప గ్రామాల్లో భయాందోళన వాతావరణం నెలకొంది. ఓఎన్‌జీసీ సాంకేతిక నిపుణులు, అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. అంతర్జాతీయ నిపుణుల సహాయం కూడా తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రమాద స్థలాన్ని పూర్తిగా ఆధీనంలోకి తీసుకుని, బావిని చల్లబరిచే పనులు కొనసాగిస్తున్నారు. ప్రస్తుతానికి నీరు, మట్టితో మంటలు ఆర్పే ప్రయత్నం చేస్తున్నారు. అధికారులు రెండు లారీల్లో కూలెంట్ ను తీసుకువస్తున్నారు. దీని సాయంతో మంటలు ఆర్పడంలో పురోగతి కనిపిస్తుందని భావిస్తున్నారు. కోనసీమ జిల్లా కలెక్టర్ మహేశ్ కుమార్, ఎస్పీ రాహుల్ మీనా ఘటనా స్థలంలోనే ఉండి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. ముందుజాగ్రత్త చర్యగా ఇరుసుమండ, మోరి గ్రామాలకు చెందిన సుమారు 500 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించారు. వారికి భోజనం, వైద్య సదుపాయాలు కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన అమలాపురం ఎంపీ గంటి హరీశ్ బాలయోగి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారని చెప్పారు. బాధితులకు అన్ని విధాలా అండగా ఉంటామన్నారు.

## కవితకు మద్దతుగా ఆమె ఇంటి వద్దకు
# భారీగా తరలివచ్చిన అభిమానులు

హైదరాబాద్, జనవరి 6 (భారత శక్తి): ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఇంటి వద్దకు భారీ సంఖ్యలో ఆమె అభిమానులు చేరుకున్నారు. 'తెలంగాణ జాగృతి'ని రాజకీయ శక్తిగా మార్చబోతున్నామని ఆమె ప్రకటించిన వెంటనే, రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజా సంఘాల నాయకులు, కుల సంఘాల నేతలు, ఉద్యమ కార్యకర్తలు భారీగా హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఆమె నివాసం వద్దకు తరలివచ్చారు. ఈ సందర్భంగా కవిత తన ఇంటి బాల్కనీలో నిలబడి అందరికీ చేతులు జోడించి అభివాదం చేశారు. తర్వాత కిందకు వచ్చి ప్రతి ఒక్కరినీ పలకరించారు. "ఎలా ఉన్నారు? ఇంట్లో అందరూ బాగున్నారా?" అంటూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా తెలంగాణ ఉద్యమ కాలం నుంచి తన వెన్నంటి ఉండి, ఇప్పుడు కష్టకాలంలో కూడా మద్దతుగా నిలిచిన ఉద్యమకారులను చూసి కవిత భావోద్వేగానికి లోనయ్యారు. కళ్లలో నీళ్లు తిరిగాయి. ఆమె గొంతు కంపిస్తూ "మీరు లేకపోతే నేను ఇక్కడ ఉండేదాన్ని కాదు. మీరు నా బలం" అంటూ మాట్లాడారు. ఈ సందర్భంలో అక్కడి పరిసర ప్రాంతాలు నినాదాలతో మారుమోగాయి. "జై తెలంగాణ... కవితక్క నాయకత్వం వర్ధిల్లాలి... తెలంగాణ జాగృతి జిందాబాద్" అంటూ నినాదాలు చేశారు. "ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న కవితకు అండగా ఉంటాం. తెలంగాణ జాగృతి ద్వారా ప్రజల కోసం పనిచేస్తాం" అని నినదించారు. మరోవైపు, రాజకీయ శక్తిగా అవతరించబోతున్నామంటూ కవిత చేసిన ప్రకటన రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమయింది. కవిత రాజకీయ పార్టీని ప్రకటిస్తే... రాష్ట్ర రాజకీయ సమీకరణలు మారే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ఆ కిక్ కోసమే మనమందరం కలిసికట్టుగా పనిచేయాలి




అమరావతి, జనవరి 6 (భారత శక్తి): "సక్సెస్ ఇచ్చే కిక్ అద్భుతంగా ఉంటుంది. ఆ కిక్ కోసమే మనమందరం కలిసికట్టుగా పనిచేయాలి. పాలనలో వేగాన్ని పెంచి, ప్రజలకు వేగంగా సుపరిపాలన ఫలాలను అందించడమే లక్ష్యంగా పెట్టుకోవాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులకు, ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారు. 2025లో సాధించిన విజయాల స్ఫూర్తితో 2026లోనూ అదే ఉత్సాహంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం నాడు సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) 14వ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అందరి సమష్టికృషితోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో పూర్తిగా దెబ్బతిన్న 'బ్రాండ్ ఏపీ'ని తిరిగి నిలబెట్టగలిగామని చంద్రబాబు అన్నారు. "2025లో రాష్ట్రం కోసం అందరూ అద్భుతంగా పనిచేశారు. మన టీమ్‌వర్క్ ఫలితంగానే రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు తరలివచ్చాయి. టాటా, జిందాల్, బిర్లా, అదానీ, రిలయెన్స్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి దిగ్గజ సంస్థలు ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చాయి" అని ఆయన వివరించారు. ఈ క్రమంలో ఏ చిన్న పొరపాటుకు తావివ్వకుండా మంత్రులు, అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. విద్యుత్ రంగంలో ప్రభుత్వం సాధించిన విజయాలను సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించారు. "విద్యుత్ ఛార్జీలను 13 పైసలు తగ్గించాం. ప్రజలపై రూ.4,500 కోట్ల ట్రూఅప్ ఛార్జీల భారాన్ని మోపకుండా ప్రభుత్వమే భరించాలని నిర్ణయించాం. విద్యుత్ కొనుగోళ్ల ధరలను కూడా తగ్గించేందుకు ప్రణాళికలు రచిస్తున్నాం. 2029 నాటికి విద్యుత్ కొనుగోలు ధరను యూనిట్‌కు రూ.3.70కి తగ్గించడమే లక్ష్యం. విద్యుత్ రంగంలో మనం చేసిన కృషి వల్లే రాష్ట్రానికి డేటా సెంటర్లు వస్తున్నాయి" అని చంద్రబాబు పేర్కొన్నారు. దావోస్ పర్యటన ద్వారా ఏపీ బ్రాండ్‌ను ప్రపంచానికి ప్రమోట్ చేయగలిగామని, విదేశీ కంపెనీలను ఆకర్షించడంలో విజయం సాధించామని తెలిపారు. గూగుల్ సెంటర్‌ను రాష్ట్రానికి తీసుకురావడంలో మంత్రి నారా లోకేశ్ ఎంతో కృషి చేశారంటూ అభినందించారు. కాగా, ఈ 14వ ఎస్ఐపీబీ సమావేశంలో పరిశ్రమలు, పర్యాటకం, ఫుడ్ ప్రాసెసింగ్, ఇంధన రంగాల్లో పలు కీలక పెట్టుబడుల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. గత 13 సమావేశాల్లో రూ.8.55 లక్షల కోట్ల పెట్టుబడులకు, 8.23 లక్షల ఉద్యోగాలకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపిన విషయాన్ని అధికారులు గుర్తుచేశారు. ఈ సమావేశంలో మంత్రులు నారా లోకేశ్, అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, గొట్టిపాటి రవి, టీజీ భరత్... సీఎస్ విజయానంద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మరోసారి ఆసుపత్రిలో
# అడ్మిట్ అయిన సోనియాగాంధీ

ఢిల్లీ, జనవరి 6 (భారత శక్తి): కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు, రాజ్యసభ ఎంపీ సోనియా గాంధీ మరోసారి అనారోగ్యానికి గురయ్యారు. తీవ్రమైన దగ్గు, శ్వాసకోశ సమస్యలతో ఢిల్లీలోని సర్ గంగారామ్ ఆసుపత్రిలో చేరారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉంది. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆసుపత్రి వర్గాలు స్పష్టం చేశాయి. సీనియర్ పల్మోనాలజిస్ట్ (ఊపిరితిత్తుల నిపుణుడు) నేతృత్వంలోని వైద్య బృందం ఆమెకు చికిత్స అందిస్తోంది. ఢిల్లీలో గత కొన్ని రోజులుగా వాయు కాలుష్యం చాలా ఘోరంగా ఉంది. దీని కారణంగానే ఆమె అనారోగ్యానికి గురైనట్టు వైద్యులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. గతంలో కూడా ఆమె శ్వాసకోశ సమస్యలతో బాధపడ్డారు. గత డిసెంబర్ లో సోనియా 79వ పుట్టినరోజును జరుపుకున్నారు. మరోవైపు, సోనియా ఆసుపత్రిలో చేరారన్న వార్తతో కాంగ్రెస్ శ్రేణులు ఆందోళనకు గురవుతున్నాయి. ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నారు. ఇంకోవైపు, సోనియా ఆరోగ్యం గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు చెబుతున్నారు.

# ఇక్కడే ఉంటా.. దమ్ముంటే వచ్చి నన్ను పట్టుకో..

వాషింగ్టన్, జనవరి 6: వాషింగ్టన్, బొగొటా మధ్య ఉద్రిక్తతలు శరవేగంగా పెరుగుతున్నాయి. వెనిజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా దళాలు అదుపులోకి తీసుకున్న కొన్ని రోజులకే ఇప్పుడు కొలంబియా వంతు వచ్చిందన్నట్లుగా పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన తీవ్ర వ్యాఖ్యలకు కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో ఏకంగా "నన్ను వచ్చి పట్టుకో. నేను ఇక్కడే ఎదురుచూస్తున్నా" అంటూ బహిరంగ సవాల్ విసిరారు. గత వారాంతంలో మదురో అరెస్ట్‌ను ఓ పెద్ద విజయంగా అభివర్ణించిన ట్రంప్, ఇప్పుడు తన దృష్టిని కొలంబియా వైపు మళ్లించారు. కొలంబియా కూడా 'చాలా అనారోగ్యంతో' ఉందని, 'కొకైన్ తయారుచేసి అమెరికాకు అమ్మే ఓ అనారోగ్యకర వ్యక్తి' దేశాన్ని నడిపిస్తున్నారని పెట్రోను ఉద్దేశించి తీవ్రంగా విమర్శించారు. "అతనికి కొకైన్ మిల్లులు, ఫ్యాక్టరీలు ఉన్నాయి. ఇదంతా ఎక్కువ కాలం సాగదు" అని ట్రంప్ హెచ్చరించారు. కొలంబియాలో కూడా అమెరికా ఆపరేషన్ ఉంటుందా? అని విలేకరులు అడగ్గా, "నాకు ఇది మంచి ఆలోచనలాగే ఉంది" అని బదులిచ్చారు. ట్రంప్ వ్యాఖ్యలపై సోమవారం పెట్రో 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఘాటుగా స్పందించారు. మరోవైపు కొలంబియా విదేశాంగ శాఖ ఒక ప్రకటన విడుదల చేస్తూ.. చర్చలు, సహకారం, పరస్పర గౌరవం ఆధారంగా ఇతర దేశాలతో సంబంధాలు కోరుకుంటున్నట్లు తెలిపింది. యాక్సియోస్ (Axios) కథనం ప్రకారం ఈ పరిణామాలపై వైట్‌హౌస్ ప్రతినిధి అన్నా కెల్లీ స్పందించారు. ఈ ప్రాంతంలో అమెరికా పట్టు బిగించి, వలసలను, డ్రగ్స్ ప్రవాహాన్ని అరికట్టే భద్రతా ప్రణాళికలో ఈ చర్యలు భాగమేనని తెలిపారు. "ప్రతి ఏటా వేలాది మంది అమెరికన్ల మరణానికి కారణమవుతున్న మాదకద్రవ్యాల నుంచి మాతృభూమిని రక్షించుకోవడానికి అధ్యక్షుడి వద్ద అనేక మార్గాలున్నాయి" అని ఆమె పేర్కొన్నారు. గత అక్టోబర్‌లోనే డ్రగ్స్‌తో సంబంధాలున్నాయనే ఆరోపణలతో ట్రంప్... పెట్రో, ఆయన కుటుంబంపై ఆంక్షలు విధించారు. అయితే పెట్రో ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నారు. తన హయాంలో 'ప్రపంచ చరిత్రలోనే అతిపెద్ద కొకైన్ స్వాధీనం' జరిగిందని స్పష్టం చేస్తున్నారు. వెనిజువెలాలో జరిగిన ఆపరేషన్ నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలు కొలంబియాలో కూడా అలాంటి పరిస్థితి వస్తుందేమోనన్న ఆందోళనలను రేకెత్తిస్తున్నాయి.




## బాలలకు వారి చట్టాలపై
# అవగాహన పెంపొందించాలి

**: జిల్లా స్త్రీ శిశు సంక్షేమ సాధికారిత అధికారి పి.రామాదేవి**

కడప, జనవరి 6 (భారత శక్తి): బాలలకు వారి చట్టాలపై అవగాహన పెంచుకొని మిషన్ వాత్సల్య అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకునేలా అవగాహన పెంచాలని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ సాధికారిత అధికారి పి.రామాదేవి పేర్కొన్నారు. మంగళవారం న్యూ కలెక్టరేట్ లోని డి.బ్లాక్ DRCC హాలులో బాలలకు ఉన్న చట్టాలపై మరియు మిషన్ వాత్సల్య అందిస్తున్న సేవల గురించి కడప కార్పొరేషన్ మండలం పరిధిలోని మహిళా పోలీసులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించబడమైనది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రీమతి. పి. రమాదేవి, జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ సాధికారత అధికారి, వై.యస్.ఆర్. కడప వారు మహిళా పోలీసులు పిల్లలు మరియు మహిళల రక్షణలో ముఖ్య భూమిక పోషిస్తున్నారని తెలిపారు. కావున మహిళా పోలీసులందరూ ప్రతి ఒక్కరు వారి సచివాలయ పరిధిలోని మహిళలు మరియు పిల్లలతో అనునిత్యం మమేకమై మాట్లాడుతూ వారికి ఉన్న సమస్యలను తెలుసుకొని వాటిని నివృత్తి చేసేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ నందు ఐసిడియస్ ద్వారా అందిస్తున్న సేవలు, మిషన్ వాత్సల్య ద్వారా అందిస్తున్న సేవలు, మిషన్ శక్తి మరియు గృహ హింస విభాగము ద్వారా అందిస్తున్న సేవలు గురించి వివరిస్తూ ప్రతి మహిళా పోలీస్ కూడా మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా అందిస్తున్నటు వంటి సేవలు మరియు పిల్లలకి మహిళలకు సంబంధించిన చట్టాలు గురించి ఖచ్చితంగా తెలుసుకోవాలని అప్పుడే క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి అర్హత గల వారికి న్యాయం చేకూర్చిన వాళ్ళు అవుతారని తెలియజేశారు. అదేవిధంగా జిల్లా బాలల పరిరక్షణ అధికారి డియర్ సుభాష్ యాదవ్ గారు మాట్లాడుతూ జిల్లా బాలల పరిరక్షణ విభాగం మరియు శిశు గృహ అందిస్తున్న సేవలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది, మిషన్ శక్తి వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది మరియు శిశుగృహ సిబ్బంది కడప కార్పొరేషన్ మరియు సికే దిన్నె మండలం పరిధిలోనిమహిళా పోలీసులు పాల్గొన్నారు.

# యూపీలో వివిధ కారణాల వల్ల 2.8 కోట్ల ఓట్లు రద్దు



ఉత్తర ప్రదేశ్, జనవరి 6: ఉత్తరప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) అనంతరం కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) మంగళవారం ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసింది. మొత్తం 15.44 కోట్ల మంది ఓటర్లలో 2.8 కోట్ల మంది ఓటర్లను తొలగించినట్లు ఈసీ తెలిపింది. శాశ్వతంగా వలసపోయిన వారు, మరణించిన వారు, బహుళ రిజిస్ట్రేషన్లు వంటి కారణాల వల్ల ఈ తొలగింపులు జరిగాయని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నవదీప్ రిన్వా తెలిపారు. ప్రస్తుతం 12.55 కోట్ల మంది ఓటర్ల పేర్లను జాబితాలో కొనసాగించినట్లు ఆయన వెల్లడించారు. తొలగించిన 2.89 కోట్ల మందిలో 46 లక్షల మంది మరణించారని, 2.17 కోట్ల మంది ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లారని, 25.47 లక్షల మంది ఒకటి కంటే ఎక్కువచోట్ల ఓటర్లుగా నమోదు చేసుకున్నారని అధికారులు తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణకు ముందు ఉత్తరప్రదేశ్‌లో 15.44 కోట్ల మంది ఓటర్లు ఉండగా, వివిధ కారణాల వల్ల ఓటర్ల తొలగింపుల అనంతరం ఆ సంఖ్య 12.56 కోట్లకు తగ్గింది. ఓటర్లు తమ పేరు ముసాయిదా జాబితాలో ఉందో లేదో యాప్ ద్వారా లేదా ఎన్నికల సంఘం వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని అధికారులు సూచించారు. ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ విధానాల్లో అభ్యంతరాలను స్వీకరిస్తామని, వాటిని పరిష్కరించిన తర్వాత తుది జాబితాను మార్చి 6న విడుదల చేస్తామని అధికారులు తెలిపారు.

# చైతన్య హై స్కూల్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ

ఎల్బీనగర్, జనవరి 06 (భారత శక్తి): దిల్సుఖ్ నగర్‌లోని సత్యనారాయణపురం కాలనీలో ఉన్న చైతన్య హై స్కూల్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించే ఉద్దేశంతో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న సుమారు 150 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కె. సైదులు, చైతన్యపురి సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ మంత్రి గోవర్ధన్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏసీపీ కృష్ణయ్య మాట్లాడుతూ, విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడం, విద్యార్థులతో ఇలాంటి ర్యాలీలు నిర్వహించి ప్రజలను చైతన్యవంతులను చేయడం మెచ్చుకోదగ్గ విషయమని తెలిపారు. రాష్ డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని, మైనర్ విద్యార్థులు వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికావద్దని సూచించారు.జీఎన్ఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ గింజల నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలను చైతన్య వంతులను చేసే ఈ తరహా కార్యక్రమాలకు పోలీస్ శాఖ నుండి ఇంత మంది అధికారులు పాల్గొని విద్యార్థులను ఉత్సాహపరిచినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, డీన్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొని రోడ్డు భద్రతపై నినాదాలతో ప్రజల్లో అవగాహన పెంచారు.






## సీనియర్ సిటీజన్లకు గుర్తింపు కార్డులు అందజేసిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

ఎల్బీనగర్, జనవరి 06 (భారత శక్తి): సీనియర్ సిటిజన్లకు గుర్తింపు కార్డులతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఆరోగ్య సంరక్షణలో రాయితీలు బస్సులు, రైళ్ల ఛార్జిలలో తగ్గింపులు ఉంటాయని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. వైదేహి నగర్ కాలనీ సీనియర్ సిటిజన్లకు ఆయన గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సీనియర్ సిటిజన్లకు అందాల్సిన రాయితీలు అందించేందుకు తన శాయశక్తులా కృషి చేస్తానన్నారు. బ్యాంకులలో ఫిక్స్డ్ డిపాజిట్లపై వచ్చే అధిక వడ్డీ, ప్రభుత్వ కార్యాలయాలలో ప్రాధాన్యం వంటి సేవలు పొందవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ స్థానిక నాయకులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి, పోగుల రాంబాబు, రాజేందర్ రెడ్డి, జేఎల్ నారాయణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## మహాలక్ష్మి పథకం వలన ఆర్టీసీకి లాభాలు : ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

హైదరాబాద్, జనవరి 06 (భారత శక్తి): మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీకి మంచి డిమాండ్ వచ్చిందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మంగళవారం రోజు అసెంబ్లీ లో మాట్లాడారు.గ్రామాల్లో సరిపోను బస్సులను ఏర్పటు చేయాలన్నారు. ఉమ్మడి జిల్లాలోని యాదగిరిగుట్ట పెద్ద డిపో కావున ఎక్కువ ఎలక్ట్రికల్ బస్సులను కేటాయించాలని కోరారు. గ్రామాల్లో పాఠశాలలకు సెలవులు వచ్చిన సమయంలో బస్సులు నడవటం లేదని, పాఠశాలకు సెలవులు ఉన్నప్పుడు కూడా ఆర్టీసీ బస్సులను నడపాలని కోరారు.మహాలక్ష్మి పథకంలో ఆర్టీసీ ఉచిత బస్సు సౌకర్యాన్ని మహిళలకు ఏర్పాటు చేయడం




వల్ల,ఆర్టీసీకి మంచి డిమాండ్ ఉందన్నారు. మహిళలు అన్ని సమయంలో ఆర్టీసీబస్సు సేవలను వినియోగించుకుంటున్నారని అన్నారు. కావున యాదగిరిగుట్ట డిపోకు ఎలక్ట్రికల్ బస్సులను అందజేయాలని కోరారు. తెలంగాణ తిరుపతి లాంటి యాదగిరిగుట్ట దేవస్థానం కొండపైకి వెళ్లే బస్సుల్లో మహిళలకు మహాలక్ష్మి పథకం వర్తిచడం లేదని,దీని ద్వార నెలకు వచ్చే ఆలయ ఆదాయంలో డిపోకు ఎక్కువ కట్టవలసి వస్తుందని, కొండపైకి వెళ్లే బస్సులో మహిళలకు కూడా మహాలక్ష్మి పథకం వర్తించే లాగా చూడాలన్నారు..ప్రతి గ్రామానికి నూతనంగా ఎలక్ట్రికల్ బస్సులను పునరుద్ధరించాలని కోరారు.గత పది ఏళ్లలో ఆర్టీసీ కార్మికులు ధర్నాలు చేసి ఎంతో మంది చనిపోయారు.ప్రజా పాలన ప్రభుత్వంలో మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ లాభాల్లోకి వచ్చి పరిరక్షించి ఆదుకున్నామన్నారు.

## పొగ పెడుతున్న బడంగ్‌పేట్ సర్కిల్ శానిటేషన్

*** ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లుతున్నా పట్టించుకోని అధికారులు**

బడంగ్ పేట్, జనవరి 06 (భారత శక్తి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం శివారు మునిసిపాలిటీలు, మునిసిపల్ కార్పొరేషన్లను జీహెచ్ఎంసిలో విలీనం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన శంషాబాద్ జోనల్ కమిషనర్ ఆర్. చంద్రకళ బడంగ్‌పేట్ సర్కిల్ ఉప కమిషనర్ త్రిల్లేశ్వర రావు పారిశుధ్యానికి పెద్దపీట వేస్తామని, చెత్త రహిత ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తామని పత్రికల ద్వారా ప్రకటించారు. కానీ, వీరి ఆధ్వర్యంలో పనిచేస్తున్న బడంగ్‌పేట్ సర్కిల్ శానిటేషన్ విధి నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించడం విచారకరం. బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే సిబ్బంది శానిటేషన్ చెత్తను ఎత్తి వేయాల్సిన బదులు, అదే చెత్తను ఒక పెద్ద గుట్టగా చేసి అక్కడే తగలబెడుతున్నారు. దీని వల్ల వెలువడుతున్న దట్టమైన పొగ గంటల తరబడి పరిసర ప్రాంతాల్లో వ్యాపించి, సమీపంలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోకి చేరుతోంది. ఫలితంగా అక్కడ చదువుతున్న చిన్నారులు తీవ్రమైన శ్వాస సంబంధిత సమస్యలకు గురవుతున్న పరిస్థితి



నెలకొంది.ఇటీవల అంగన్‌వాడీ కేంద్ర పరిసరాల అపరిశుభ్రతపై ప్రశ్నించగా, సదరు శానిటేషన్ అధికారి నిర్లక్ష్యంగా, బాధ్యతారహితంగా సమాధానం ఇచ్చారని ఆరోపించారు. ఇప్పటికీ అదే వైఖరి కొనసాగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ వ్యవహారంపై బడంగ్‌పేట్ కార్పొరేషన్ భారతీయ జనతా పార్టీ నాయకులు తీవ్రంగా స్పందించారు. ముఖ్యంగా బీజేపీ నాయకులు రామకృష్ణారెడ్డి ఈ నిర్లక్ష్యంపై తీవ్రంగా మండిపడుతూ, పిల్లల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరింత ఆందోళనకర విషయం ఏమిటంటే, సదరు శానిటేషన్ అధికారి గతంలో నగర పంచాయతీ ఉన్నప్పటి నుంచే ఇదే సర్కిల్‌లో కొనసాగుతూ ఉండటం.అనేక మంది ఉన్నతాధికారులు బదిలీ అయినప్పటికీ, ఈ అధికారి మాత్రం ఇక్కడి నుండి కదలకపోవడంతో, పై అధికారులతో లేదా ప్రజాప్రతినిధులతో ఏవైనా చీకటి ఒప్పందాలు ఉన్నాయనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.కావున, జీహెచ్ఎంసి ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి,విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తున్న బడంగ్‌పేట్ సర్కిల్ శానిటేషన్ అధికారిని తక్షణమే బదిలీ చేయాలని,చెత్తను తగలబెట్టే అనారోగ్యకర పద్ధతిని నిలిపివేసి, చెత్తను శాస్త్రీయంగా ఎత్తివేసే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నామని బీజేపీ నాయకులు స్పష్టం చేశారు. లేనియెడల, ఈ ప్రాంతం కూడా దేశ రాజధాని న్యూఢిల్లీ లాగ ఎదుర్కొంటున్న తీవ్రమైన కాలుష్య సమస్యల బారిన పడే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి ఆకస్మికంగా తనిఖీలు


ఎల్బీనగర్, జనవరి 06 (భారత శక్తి): మల్కాజ్ గిరి పోలీస్ కమీషనరేట్ సీపీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అవినాష్ మహంతి సోమవారం సాయంత్రం సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ లో ఆకస్మిక తనిఖీలకు శ్రీకారం చుట్టారు.సరూర్‌నగర్ పోలీస్ సిబ్బంది పనితీరు, రికార్డులు, ప్రజా సమస్యల పరిష్కారంపై ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, పెండింగ్ ఫిర్యాదులు,బీట్ పోలీసింగ్, సిబ్బంది విధులు నిర్వహిస్తున్న తీరు గురించి సీపీ సమగ్రంగా సమీక్షించారు.ఈ



తనిఖీ కార్యక్రమంలో ఎల్బీనగర్ డీసీపీ అనురాధ, అడిషనల్ డీసీపీ కోటేశ్వరరావు, ఏసీపీ కృష్ణయ్యతో పాటు స్టేషన్ ఎస్ఐలు, డిఐ, ఏఎస్ఐలు మహిళా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## విదేశీ ఎంబీబీఎస్ సీట్ల పేరుతో భారీ మోసం

ఎల్బీనగర్, జనవరి 06 (భారత శక్తి): విదేశాల్లో ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తామని నమ్మించి లక్షల రూపాయలు వసూలు చేసి మోసానికి పాల్పడ్డ కన్సల్టెన్సీపై చైతన్యపురి పోలీస్ స్టేషన్‌లో చీటింగ్, ఫ్రాడ్ కేసు నమోదు అయ్యింది.గుంటూరు నివాసి అయిన గోపాల్ రెడ్డి తాను ఎంబీబీఎస్ కోర్స్ చదవడానికి హేమంత్ రెడ్డిని సంప్రదించగా, కర్గిస్తాన్ దేశంలో ఎంబీబీఎస్ కోర్స్ పొందవచ్చని చెప్పి, న్యూ వేవ్ స్టూడెంట్స్ కన్సల్టేన్సీ ద్వారా యూనివర్సిటీ ఆఫ్ సౌత్ ఆసియా కాలేజీలో అడ్మిషన్ ఇప్పించి, వీసా, కర్గిస్తాన్ వెళ్ళడానికి ఫ్లైయిట్ టికెట్ ను ఏర్పాటు చేసి పంపించాడు. కోర్స్ మొదటి సెమిస్టర్ ఫీజ్ 3 లక్షల 75 వేలు హేమంత్ రెడ్డికి ఇక్కడే చెల్లించడం జరిగింది. అక్కడికి వెళ్లిన తరువాత స్టూడెంట్ కోఆర్డినేటర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి, వెళ్లిన తరువాత ఎలాంటి ఉద్యోగం ఇప్పించలేదు. మిగతా ఖర్చులను ఇండియాలో చెప్పకుండా కర్గిస్తాన్




వెళ్లిన తరువాత చెప్పారు. హేమంత్ రెడ్డికి చెల్లించిన డబ్బులు కాకుండా, 1లక్షా 50 వేలు కట్టవలసిన పరిస్థితి. అంత డబ్బు కట్టలేక,కోర్స్ చేయకుండా ఇండియాకు రావలసి వచ్చింది.కట్టిన డబ్బులు అడిగితే తన మీద కేసు పెట్టారని,తనకు న్యాయం చేయాలనీ, కన్సల్టెన్సీ యజమాని హేమంత్ రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విదేశాల్లో వైద్య విద్యకు సంబంధించిన నకిలీ హామీలు ఇచ్చి డబ్బులు తీసుకుని, ఆ తరువాత ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండా మోసం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.ఇది కేవలం ఆర్థిక మోసం మాత్రమే కాకుండా, విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకునే తీవ్రమైన నేరం. పోలీసులు ఈ వ్యవహారాన్ని సీరియస్ క్రైమ్‌గా పరిగణించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కన్సల్టెన్సీ కార్యకలాపాలు, ఆర్థిక లావాదేవీలపై లోతైన విచారణ చేస్తున్నామని సీఐ సైదులు తెలిపారు.

## హైదరాబాద్‌వాసులను కాలుష్యం నుంచి రక్షించాలనేదే మా లక్ష్యం: మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్, జనవరి 06 (భారత శక్తి): రేపటి తరాల భవిష్యత్ కోసం హిల్ట్‌పాలసీని తీసుకొస్తున్నామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. హిల్ట్‌పాలసీపై చర్చ సంరద్భంగా అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. "హిల్ట్‌పాలసీని సాదాసీదా భూమార్పిడిగా చూస్తున్నారు. దీనిపై సద్విమర్శలు చేస్తే స్వీకరిస్తాం. హిల్ట్ పాలసీ ద్వారా పారిశ్రామిక ప్రాంతం.. నివాస ప్రాంతంగా మారుతుంది. ఓఆర్ఆర్ లోపలి ప్రాంతాల్లో కాలుష్యం లేకుండా చేసేందుకు సీఎం యత్నిస్తున్నారు. నగరంలోని పరిశ్రమలను ఓఆర్ఆర్ అవతలివైపునకు తరలిస్తాం. ఈ పాలసీ మేము కొత్తగా చేస్తున్నది కాదు. దీనికోసం విస్తృతంగా చర్చలు జరిగాయి. వనరులు సమకూర్చుకునేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుంది. హిల్ట్ పాలసీ గురించి తెలియకుండా ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారు. పారిశ్రామికవేత్తల భూములను.. ప్రభుత్వ భూములని ప్రచారం చేస్తున్నారు. జీవో ఎంఎస్ 19కు సంబంధించి లీజు భూములపై ప్రభుత్వానికి సర్వాధికారులు ఉంటాయని గత ప్రభుత్వం జీవో తెచ్చింది. స్వచ్ఛందంగా ముందుకు వస్తే భూములు కన్వర్ట్ చేస్తాం. నగరవాసులను కాలుష్యం నుంచి రక్షించాలన్నదే మా లక్ష్యం. మా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి హేతుబద్ధత, శాస్త్రీయత ఉండాలని చూస్తున్నాం. భవిష్యత్ గురించి ఆలోచించే మా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది'' అని మంత్రి శ్రీధర్‌బాబు వివరించారు.


## ఓపెన్ జిమ్ పరికరాలను ప్రారంభించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



ఎల్బీనగర్, జనవరి 06 (భారత శక్తి): వైదేహి నగర్ నార్త్ కాలనీలోని రోడ్ నెంబర్ 12 పబ్లిక్ పార్కులో, జిహెచ్ఎంసి నిధులతో మంజూరు చేయించి ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పరికరాలను, వైదేహినగర్ నార్త్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల సమక్షంలో ఎల్బీనగర్ నియోజకవర్గం శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ప్రారంభోత్సవం చేశారు.ఈ కార్యక్రమంలో బి.యన్.రెడ్డి డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు కటిక రెడ్డి అరవింద రెడ్డి, వైదేహి నగర్ నార్త్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పోగుల రాంబాబు కార్యదర్శి రాజేందర్ రెడ్డి, లక్ష్మీనారాయణ, వెంకట నరసింహారెడ్డి, మూర్తి వెంకటేష్ గౌడ్, చక్రధర్, వైదేహి నగర్ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రామకృష్ణ కార్యదర్శి వెంకయ్య సభ్యులు ప్రకాష్ బాబు, వేణుగోపాల్, శ్రీనివాసులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలసిన డీఈ

సంగారెడ్డి, జనవరి 06 (భారత శక్తి): నూతనంగా విధుల్లో చేరిన డీఈ నెహ్రూ నాయక్ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పుష్ప గుచ్ఛం అందజేసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విద్యుత్ సరఫరా పరిస్థితి, కొనసాగుతున్న అభివృద్ధి పనులు, భవిష్యత్ ప్రణాళికలపై చర్చించారు.ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. విద్యుత్



శాఖ పనుల్లో జాప్యం లేకుండా పూర్తిచేయాలని, నిరంతర విద్యుత్ సరఫరా అందేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.